## దళితుల భూములకు స్కెచ్!

- 'గూగుల్' పేర రూ.కోట్ల విలువైన వందల ఎకరాల డి పట్టా భూములపై కన్ను
- విశాఖ జిల్లా తర్లువాడలో ల్యాండ్ పూలింగ్ జిమ్మిక్కులు

2



PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu


సంపుటి : 45 సంచిక : 25 | విజయవాడ, సోమవారం 25 ఆగస్టు 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 25 August 2025 | Rs



## క్రికెట్‌కు పుజారా గుడ్‌బై

- అన్ని ఫార్మాట్లకు రిటైర్మెంట్
- 103 టెస్ట్‌ల్లో 7,195 పరుగులు సాధించిన 'నయావాల్'



8


# స్ఫూర్తివంతం... సురవరం



సురవరానికి నివాళులర్పిస్తున్న ఎంఎ బేబీ, డి రాజా, తమ్మినేని, జాన్‌వెస్లీ, జూలకంటి, సాగర్, బి వెంకట్ తదితరులు

- అధికార లాంఛనాలతో సుధాకర్‌రెడ్డి అంతిమయాత్ర
- గాంధీ వైద్యకళాశాలకు భౌతికకాయం
- తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి నివాళి
- పుష్పాంజలి ఘటించిన డి రాజా, ఎంఎ బేబీ, రాఘవులు, పి.మధు ప్రభృతులు

**ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో**

కమ్యూనిస్టు దిగ్గజం, సిపిఐ అఖిల భారత మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డికి ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం ఉదయం పది గంటల ప్రాంతంలో ఆయన భౌతికకాయాన్ని హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్‌కు తీసుకొచ్చారు. రాజకీయ, సినీ ప్రముఖులు, ప్రజా, కార్మిక, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు, వివిధ రంగాల ప్రముఖులు సురవరానికి నివాళులర్పించి ఆయన ప్రజా సేవను స్మరించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణ, సిపిఐ అఖిల భారత ప్రధాన కార్యదర్శి డి.రాజా, సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, సిపిఎం సీనియర్ నాయకులు పి.మధు, తమ్మినేని వీరభద్రం, తెలంగాణ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, సిపిఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వర్లు, ఆంధ్రప్రదేశ్ సిపిఐ నేతలు జెల్లి విల్సన్, ముప్పాళ్ల నాగేశ్వరరావు, తెలంగాణ మాజీ మంత్రి కెటిఆర్, సిపిఐ కేరళ రాష్ట్ర కార్యదర్శి బినయ్‌విశ్వం, సిపిఐ ఎంపి సందోష్‌కుమార్, సిపిఐ జాతీయ నాయకురాలు అని రాజా తదితరులు నివాళులర్పించారు. మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో ప్రభుత్వ లాంఛనాలతో సురవరం అంతిమయాత్ర మఖ్దూం భవన్ నుంచి ప్రారంభమైంది. పోలీసులు గౌరవవందనం సమర్పించి పోలీసు బ్యాండుతో ముందు నడవగా, ఎర్ర జెండాలతో సిపిఐ వలంటీర్లు, పిఎన్‌ఎం కళాజాతాలు వారిని మిగతా 7లో

# ప్రజారోగ్య బాధ్యత ప్రభుత్వానిదే

- వైద్య ఖర్చుల వల్ల అప్పులపాలవుతున్న ప్రజలు
- జాతీయ సదస్సులో వక్తలు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ప్రజారోగ్యం బాధ్యత ప్రభుత్వానిదేనని, వైద్యం ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉంటేనే ప్రజలకు వైద్య సేవలు అందుతాయని సదస్సులో పలువురు వక్తలు తెలిపారు. తృతీయ స్థాయి ఆరోగ్య కేంద్రాలను ప్రైవేటు రంగంలో నిర్వహించాలనుకోవడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఒక ఆస్పత్రిని ఏర్పాటు చేయాలనే ఆలోచన ప్రభుత్వం చేస్తోందని, వీటిని ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటుకు అప్పగించే విధంగా పి4 పద్ధతిలో ఏర్పాటు చేయాలనే ఆలోచన వల్ల సమాజానికి, ప్రజా ఆరోగ్యానికి ఎటువంటి మేలు జరగదని పేర్కొన్నారు. ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యాన జాతీయ స్థాయి ఆరోగ్య సదస్సు విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగింది. వేదిక గౌరవాధ్యక్షులు కెవిఎస్ సాయిప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో 'వైద్యరంగం ప్రైవేటీకరణ-పరిణామాలు' అనే అంశంపై ప్రజ్ఞాన్ సస్టైనబుల్ హెల్త్ అవుట్‌కమ్స్ ఫౌండేషన్ అధ్యక్షులు ప్రొఫెసర్ జివిఎస్ మూర్తి మాట్లాడారు. వైద్యరంగం ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉన్నప్పుడే సాధారణ ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఒక కుటుంబానికి వచ్చే ఆదాయంలో 10 శాతానికి మించి వైద్యానికి ఖర్చు చేయడం వల్ల అవి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని చెప్పారు. ఆదాయంలో 25 శాతం మిగతా 7లో



ప్రజారోగ్య వేదిక సావనీర్ ఆవిష్కరిస్తున్న వైద్యరంగ నిపుణులు

## పింఛను తొలగింపుతో దంపతుల ఆత్మహత్య

- శ్రీకాకుళం జిల్లాలో దారుణం
- చికిత్స పొందుతున్న కుమార్తె



అప్పారావు



లలిత

**ప్రజాశక్తి- గార, శ్రీకాకుళం సిటీ**

వచ్చే నెల నుంచి వికలాంగ పింఛను రాదన్న నోటీసు రెండు నిండు ప్రాణాలను బలి తీసుకుంది. కుటుంబ పోషణకు ఆధారమైన పింఛను పోతుందన్న మనస్తాపంతో శ్రీకాకుళం జిల్లా గార మండలం అంపోలుకు చెందిన అంధుడు కొల్లి అప్పారావు (45), ఆయన భార్య లలిత (42)తో కలిసి శనివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నారు. ఆదివారం ఉదయాన తల్లిదండ్రులు విగతజీవులుగా పడి ఉండడాన్ని చూసిన కుమార్తె దేవి, గ్లాసులో మిగిలి ఉన్న ద్రావణాన్ని తాగింది. ఆమెను స్థానికులు శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆమె పరిస్థితి నిలకడగా ఉంది. స్థానిక కథనం ప్రకారం... గార మండలంలోని శ్రీకూర్మంలో ఒక ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయునిగా చేసిన అప్పారావుకు కనుచూపు తగ్గి ఏదీ సరిగ్గా కనిపించకపోవడంతో ఉద్యోగం మానేశారు. కొన్నేళ్లుగా వికలాంగ పింఛను తీసుకుంటున్నారు. ఇటీవల పింఛన్ల పరిశీలన అనంతరం 40 శాతం కంటే తక్కువ వైకల్యం ఉన్నట్లు, పింఛనుకు అనర్హత అయినట్లు సచివాలయ అధికారులు నోటీసులు మిగతా 7లో

## అణుకేంద్రంపై డ్రోన్ దాడి..



ఉక్రెయిన్ డ్రోన్ దాడుల కారణంగా మంటల్లో చిక్కుకున్న రష్యాలోని కుర్స్క్ అణు విద్యుత్ ప్లాంట్

- ఉక్రెయిన్ బరితెగింపు
- రష్యా న్యూక్లియర్ ప్లాంట్‌లో మంటలు
- శాంతి చర్చలకు విఘాతం

**మాస్కో :** ఉక్రెయిన్ మరోసారి బరితెగించింది. రష్యాలోని కుర్స్క్ అణు విద్యుత్ ప్లాంట్‌పై ఆదివారం ఉదయం డ్రోన్‌తో దాడి చేసింది. ఈ దాడితో న్యూక్లియర్ ప్లాంట్‌లో మంటలు చెలరేగాయి. రియాక్టర్ నెంబర్ 3 ధ్వంసమైంది. మంటల్లో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. అయితే ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని, రష్యా బలగాలు సకాలంలో డ్రోన్‌ను కూల్చేసి మంటలు అదుపులోకి తీసుకొచ్చాయని ప్లాంట్ అధికారులు ప్రకటించారు. ఉక్రెయిన్ ఉద్దేశపూర్వకంగా రష్యాలోని అణు విద్యుత్ కేంద్రాలను, నూనె శుద్ధి కర్మాగారాలను, విద్యుత్ గ్రిడ్‌లను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తుందని రష్యా విమర్శించింది. గత వారంలో ఉక్రెయిన్ దళాలు యురోపియన్ యూనియన్‌కు చమురు సరఫరా చేసే "డ్రుజ్‌బా" పైప్‌లైన్ పై దాడి చేశాయి. దీన్ని హంగేరి, స్లోవేకియా దేశాలు ఖండించాయి. ఉక్రెయిన్ స్వాతంత్ర్యదినోత్సవ రోజున రష్యాపై అనేక ప్రాంతాల్లో దాడులకు ప్లాన్ చేసిందని, దాదాపు 95 ప్రాంతాల్లో డ్రోన్‌లను కూల్చేసామని రష్యా వర్గాలు వెల్లడించాయి. ఆదివారం దాడి సమయంలో మరో రెండు రియాక్టర్లు ఆఫ్‌లో ఉన్నాయని, డ్రోన్ దాడిని అడ్డుకోకపోతే తీవ్ర నష్టం జరిగేదని అధికారులు తెలిపారు. మరోవైపు అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఎఇఎ) ఆందోళన వ్యక్తం చేసింది. అణు విద్యుత్ కేంద్రాలపై దాడులు చాలా ప్రమాదకరమని, నష్టం ఊహించలేమని హెచ్చరించింది. ఈ దాడుల వల్ల ఇరు దేశాల మధ్య శాంతి చర్చలకు విఘాతం కలిగే అవకాశం ఉందని, యుద్ధం మరింత తీవ్రతరం అవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు..



మహాసభలో మాట్లాడుతున్న ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి జిబన్ సాహా


## ఐక్య పోరాటాలతోనే రవాణా కార్మికుల సమస్యల పరిష్కారం

- ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ మహాసభ పిలుపు

3


## ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్న మోడీ

- దేశాన్ని కాపాడాల్సిన బాధ్యత కమ్యూనిస్టులపైనే
- సిపిఐ రాష్ట్ర మహాసభలో జాతీయ కమిటీ నాయకులు వహీదా పర్వీన్



మహాసభలో మాట్లాడుతున్న సిపిఐ జాతీయ కమిటీ నాయకురాలు వహీదా పర్వీన్

**ప్రజాశక్తి- ఒంగోలు సిటీ**

రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని మోడీ ప్రభుత్వం ధ్వంసం చేస్తోందని, ఇంతటి ఫాసిస్టు పాలనను వందేళ్లలో చూడలేదని సిపిఐ జాతీయ కమిటీ నాయకులు వహీదా పర్వీన్ విమర్శించారు. దేశాన్ని కాపాడాల్సిన బాధ్యత కమ్యూనిస్టులపైనే ఉందని అన్నారు. ఒంగోలులో ఆదివారం సిపిఐ 28వ రాష్ట్ర మహాసభను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఆర్‌ఎస్‌ఎస్‌ను స్వాతంత్ర్య దినోత్సవం రోజున మోడీ దేశభక్తి సంస్థగా కీర్తించడం గర్హనీయమన్నారు. షైనింగ్ ఇండియా అంటూ మోడీ గొప్పలు చెప్తున్నారని, దేశంలో మూడింట రెండువంతుల మంది ప్రజలు పేదరికంలో మగ్గుతున్నారని వివరించారు. దేశ సార్వభౌమాధికారంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జోక్యం పెరిగిందని, తాను పాకిస్తాన్‌తో యుద్ధం వద్దని వారించడంతో మోడీ యుద్ధం విరమించినట్లు 35 సార్లు ప్రస్తావించడం భారతదేశ ఔన్నత్యాన్ని ట్రంప్‌నకు తాకట్టు పెట్టినట్లు అయిందని దుయ్యబట్టారు. దేశంలో మోడీ ప్రభుత్వం చరిత్రను, సంస్కృతిని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య వ్యవస్థను తీవ్రంగా వక్రీకరిస్తోందన్నారు. దేశంలో ఫైనాన్షియల్ క్యాపిటల్ పెత్తనం చేస్తోందని, దేశ ఆర్థిక వ్యవస్థను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేందుకు మోడీ తీవ్రంగా కృషి చేస్తున్నారని విమర్శించారు. దేశంలో సామాజిక, ఆర్థిక అసమానతలు తీవ్రంగా ఉన్నాయని, వీటిని అధిగమించేందుకు వామపక్షాలు తీవ్రంగా కృషి చేయాల్సి ఉందని తెలిపారు. ఇది కమ్యూనిస్ట్ పార్టీకి పెద్ద సవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ జాతీయ నాయకులు రావుల వెంకయ్య, మహా న్యూస్ ఎడిటర్ మారెళ్ళ వంశీకృష్ణ మాట్లాడారు. మృతవీరుల స్తూపాన్ని మహాసభ వేదిక (పిఎస్ జివి కన్వెన్షన్) నల్లూరి అంజయ్య ప్రాంగణంలో మాజీ ఎమ్మెల్సీ పిజె చంద్రశేఖరరావు ఆవిష్కరించారు. సభకు సిపిఐ నాయకులు జెవి సత్యనారాయణమూర్తి, దుర్గ భవాని, జి.నాజర్, నారాయణ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. సినీనటుడు మాదాల రవి, జి.ఈశ్వరయ్య, రావుల రవీంద్రనాథ్, ఆహ్వాన సంఘ అధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కోసం పడిగాపులు

- ఎరువుల కొరతతో అన్నదాతలకు తీవ్ర ఇక్కట్లు
- 'అనంత', పల్నాడు నుంచి ఇతర రాష్ట్రాలకు తరలింపు?



తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం కామరాజుపేట సొసైటీ వద్ద ఎరువుల కోసం పడిగాపులు కాస్తున్న రైతులు (ఫైల్ ఫొటో)

**ప్రజాశక్తి- యంత్రాంగం**

రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో వర్షాలు అనుకూలించడంతో ఎరువులకు డిమాండ్ ఏర్పడింది. యూరియా కొరత వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సొసైటీల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చింది. యూరియా వచ్చిన కొన్ని గంటల్లోనే అమ్ముడుపోతుంది. దీంతో, ఎప్పుడు యూరియా వస్తుందా? అని పడిగాపులు కాయాల్సి వస్తోంది. ప్రైవేట్ వ్యాపారులు అధిక ధరకు విక్రయిస్తుండడం, పురుగుల మందులు కొంటేనే యూరియా విక్రయిస్తామని షరతు విధిస్తుండడంతో సొసైటీ వద్ద ఎరువుల కొనుగోలుకు రైతులు మొగ్గుచూపుతున్నారు. అక్కడ అందుబాటులోలేకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. అధికారులు మాత్రం ఎరువుల కొరత లేదని చెప్పుకొస్తున్నారు.

- తూర్పుగోదావరి జిల్లాలో ఈ ఖరీఫ్‌కు 26,464 మెట్రిక్ టన్నుల యూరియా కాగా, 18,588 మెట్రిక్ టన్నులు వచ్చాయని అధికారులు తెలిపారు. సీతానగరం, గోకవరం, కొవ్వూరు, అనపర్తి, నిడదవోలు, ఉండ్రాజవరం మండలాల్లో కొరత తీవ్రంగా ఉంది. సొసైటీల వద్ద ఎరువుల కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు. సహకార సంఘం చైర్మన్లు సైతం ఇటీవల సీతానగరం మండల వ్యవసాయాధికారిని కలిసి ఎరువులు అందించాలని వినతిపత్రం అందించడం సమస్య తీవ్రతకు అద్దం పడుతోంది.
- కాకినాడ జిల్లా కాజులూరు, తాళ్లరేవు, గొల్లప్రోలు, పిఠాపురం, సామర్లకోట, కోటనందూరు మండలాల్లో ఎరువుల కొరత ఉంది. కాజులూరు మండలానికి వెయ్యి మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ఇప్పటి వరకూ 600 మెట్రిక్ టన్నులే వచ్చాయి.

**వ్యవసాయ శాఖ మంత్రి సొంత జిల్లాలో ఇదీ పరిస్థితి**

శ్రీకాకుళం జిల్లాకు ఖరీఫ్‌లో 42,225 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం అందులో కోతపెట్టి 21,644 మెట్రిక్ టన్నులు కేటాయించింది. జులై కోటా కింద విడుదల కావాల్సిన మిగతా 7లో

## 3 రోజులు వర్షాలు

- విపత్తుల నిర్వహణ సంస్థ

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

రాష్ట్రంలో రానున్న మూడు రోజులపాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్‌జైన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాలకు ఆనుకుని అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందన్నారు. దీని ప్రభావంతో ఉత్తరాంధ్ర తీరం వెంబడి ఈదురుగాలులు వీచే వీలుందని తెలిపారు. ఈ నెల 25న శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖ, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు. 26న శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, గోదావరి, ఏలూరు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. 27న శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో మోస్తారు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు.

## ఆ 3 బిల్లులపై జెపిసిలో చేరబోం

- ఎస్‌పి, ఆప్, టిఎంసి ప్రకటన
- ప్రతిపక్ష నేతలపై వేధింపులు, ప్రాంతీయ పార్టీలపై ఒత్తిడి కోసమే బిల్లులని విమర్శ

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

ప్రతిపక్ష పార్టీలే లక్ష్యంగా తీసుకొచ్చిన 130వ రాజ్యాంగ సవరణకు సంబంధించిన మూడు బిల్లులపై వేసిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి)లో చేరేందుకు ప్రతిపక్ష పార్టీలు నిరాకరించాయి. ఇప్పటికే సమాజ్‌వాదీ పార్టీ, ఆప్, టిఎంసి తాము జెపిసిలో చేరబోమని ప్రకటించాయి. ఐదేళ్లకు మించి శిక్షపడే అవకాశమున్న కేసులలో ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రులు, మంత్రులు 30 రోజులకుపైగా జైలులో ఉంటే 31వ రోజున పదవిని కోల్పోయే విధంగా తీసుకొచ్చిన మూడు బిల్లులను లోక్‌సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రవేశపెట్టినప్పుడు ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. దీంతో ఈ బిల్లులను పరిశీలించడానికి జెపిసి ఏర్పాటు చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రతిపక్ష పాలిత ప్రభుత్వాలను కూల్చివేత లక్ష్యంగా తీసుకొచ్చిన బిల్లులపై లోక్‌సభ స్పీకరు వేసే జెపిసిలో తాము చేరబోమని ప్రతిపక్ష పార్టీలు ఒక దాని తరువాత ఒకటి ప్రకటిస్తున్నాయి. బిల్లుల పరిశీలనకు ఏర్పాటు చేసే జెపిసికి ఏ సభ్యుడిని నామినేట్ చేయబోమని టిఎంసి ప్రకటించింది. టిఎంసి రాజ్యసభ పక్షనేత డెరెక్ ఓబ్రెయిన్ మాట్లాడుతూ.. జెపిసి విలువలేనిదని అన్నారు. ప్రతిపక్షాలే లక్ష్యంగా ఈ బిల్లులు తీసుకొచ్చారని, ఆ జెపిసికి సభ్యులెవరినీ నామినేట్ చేయబోమని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షులు అఖిలేష్ యాదవ్ తెలిపారు. ఆదివారం లక్నోలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'బిల్లు ఆలోచన తప్పు. ఈ బిల్లును ప్రవేశపెట్టిన వ్యక్తి (హోంమంత్రి అమిత్ షా) తనపై తప్పుడు కేసులు పెట్టారని చాలాసార్లు చెప్పారు. ఈ బిల్లులు రాజకీయ ప్రేరేపితమని చెప్పారు. ప్రతిపక్ష నాయకులను వేధించడానికి, ప్రాంతీయ పార్టీలపై ఒత్తిడి తీసుకురావడానికి, వాటిలో తిరుగుబాట్లను ప్రేరేపించడానికి కేంద్రం వీటిని తీసుకొచ్చిందని విమర్శించారు. ఓట్లను ఎలా దొంగిలిస్తున్నారనే దానిపై జరుగుతున్న చర్చ నుంచి దృష్టిని మళ్లించడానికి ఉద్దేశపూర్వకంగా ఈ బిల్లును తీసుకొచ్చారని అన్నారు. ప్రాంతీయ రాజకీయ ఉద్యమాలపై దాడి చేసేందుకు తీసుకొచ్చిన ఈ బిల్లులను తమ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఎంపి, మాజీ మంత్రి ఆజం ఖాన్, మాజీ మంత్రి గాయత్రి ప్రజాపతి, మాజీ ఎంపి రమాకాంత్ యాదవ్, ఎమ్మెల్యే ఇర్ఫాన్ సోలంకి వంటి ఎస్‌పి నాయకులను ఏళ్ల తరబడి జైలుకు పంపారని, ఇది అధికార దుర్వినియోగాన్ని స్పష్టం చేస్తోందన్నారు.

## విశాఖలో తొలి ప్రకృతి వైద్య కళాశాల

- వచ్చే ఏడాది నుంచి ప్రవేశాలు
- మంత్రి సత్యకుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో తొలి ప్రకృతి వైద్య కళాశాల విశాఖపట్నంలో రాబోతుందని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఆయుర్వేద, హోమియో, యూనాని, ప్రకృతి వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో భాగంగా ఆస్పత్రులను కొత్తగా ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలను ప్రభుత్వం వేగవంతం చేసిందన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయనొక ప్రకటన విడుదల చేశారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రకృతి వైద్య కళాశాలల్లో అడ్మిషన్లు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. విశాఖ, కాకినాడలో ఆయుష్ ఇంటిగ్రేటెడ్ ఆస్పత్రులు సిద్ధమవుతున్నాయని తెలిపారు. విశాఖపట్నం నగరంలోనే ప్రభుత్వ ఆయుర్వేద మందుల తయారీ, నాణ్యత పరీక్షల ప్రయోగశాల కూడా రాబోతుందన్నారు. రాష్ట్ర విభజన అనంతరం 2016-17లో ప్రకృతి వైద్య కళాశాల, రెండు ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆస్పత్రుల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. నేషనల్ ఆయుష్ మిషన్ కింద కాకినాడలో, శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో ఆయుర్వేద వైద్య కళాశాలల ఏర్పాటు ఆమోదం కోసం కేంద్ర ఆయుష్‌కు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

# ప్రత్యామ్నాయ అభివృద్ధి వ్యూహంతో వామపక్షాలు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై ఆగ్రహం
- సిపిఐ 28వ రాష్ట్ర మహాసభలో వి శ్రీనివాసరావు సౌహార్ద్ర సందేశం



మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- ఒంగోలు సిటీ

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కొత్త అధ్యాయం రాయడానికి వామపక్ష పార్టీలు ఐక్యంగా కదలాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. వామపక్షాల ఐక్యతే ప్రత్యామ్నాయమని అన్నారు. ఒంగోలులో ఆదివారం సిపిఐ 28వ రాష్ట్ర మహాసభలో ఆయన సౌహార్ద్ర సందేశం ఇచ్చారు. మతోన్మాదాన్ని, కార్పొరేట్ దోపిడీని అరికట్టాలంటే, రైతు-కూలీ-ఉద్యోగి సమస్యలు పరిష్కారం కావాలంటే వామపక్షాలు బలపడక తప్పదన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు వామపక్షాల ఐక్యతే మార్గమని నొక్కిచెప్పారు. ఆ దిశగా సిపిఐ రాష్ట్ర మహాసభ కార్యాచరణ రూపొందించుకోవాలని కోరారు. రాష్ట్రంలో వ్యవసాయం అభివృద్ధి చెందాలంటే హంద్రీనీవా, వెలిగొండ ప్రాజెక్టులు పూర్తి కావాలన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక వ్యూహం రూపొందించాలని వివరించారు. పరిశ్రమలు అభివృద్ధి చెందాలని, నిరుద్యోగ సమస్య పరిష్కారం కావాలని తెలిపారు. ప్రజల అభివృద్ధి కావాలిగానీ, కార్పొరేట్ల అభివద్ధి కాదని అన్నారు. రాష్ట్రం సమగ్రాభివృద్ధి సాధించాలంటే వామపక్ష ఐక్యతతోనే సాధ్యమని తెలిపారు.

కేరళ తరహా అభివృద్ధి సాధించాలన్నారు. ఆ రాష్ట్రంలో వంద శాతం అక్షరాస్యత నుంచి వంద శాతం డిజిటల్ అక్షరాస్యత సాధించడం వెనుక వామపక్షాల కృషిని వివరించారు. పార్లమెంటులో 800 మంది సభ్యుల్లో 434 మందిపై కేసులు ఉన్నాయని, వారిలో 70 శాతం మంది బిజెపి వారేనని తెలిపారు. 'నీకు సిగ్గు ఉంటే ముందు వారిని తొలగించు మోడీ!' అని అన్నారు. లౌకిక పార్టీగా చెప్పుకునే టిడిపి ఎన్‌డిఎలో చేరి మతోన్మాదానికి అండగా నిలుస్తోందని విమర్శించారు. విజయవాడ లెనిన్ సెంటర్ పేరు మార్చే ఆలోచనకు కూడా టిడిపినే వెన్నుదన్ను ఇచ్చిందన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో 32 వేల మంది మహిళలు అదృశ్యమయ్యారని చెప్పారని, ఇప్పుడు ఆయన అధికారంలోకి వచ్చాక దీనిపై నోరు మెదపకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. వైసిపి పాలనలో అమలు చేసిన విధానాలే టిడిపి కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. భూసేకరణ, రియల్ ఎస్టేట్, పరిశ్రమల ముసుగులో కార్పొరేట్లకు లక్షల ఎకరాలు కట్టబెడుతోందని, ప్రజల అభివృద్ధిని మరిచిందని వివరించారు. విశాఖలో అదానికి 300 ఎకరాలు కట్టబెట్టిందన్నారు. పరిశ్రమల పేరుతో సేకరించిన లక్షల ఎకరాల్లో ఎన్ని పరిశ్రమలు వచ్చాయో? ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారో? చెప్పాలని, దీనిపై శ్వేతపత్రం విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతిపక్షంగా ప్రజల తరపున పోరాడాల్సిన వైసిపి విఫలమైందని తెలిపారు. ప్రజాక్షేత్రంలో ఆపని వామపక్షాలు చేయాలన్నారు. గత విద్యుత్తు పోరాటంలో అమరులైన వీరులను స్మరిస్తూ మరోసారి విద్యుత్తు పోరాటం చేపట్టాలని, ఆగస్టు 28న అందరం ప్రతిజ్ఞ చేద్దామని శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

## ఎరువులు పక్కదారి పట్టిస్తే డీలర్ల లైసెన్సులు రద్దు

- జిల్లాల వారీ లభ్యత, సరఫరాపై ఆరా !
- అధికారులతో సిఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



రాష్ట్రంలో ఎరువులు పక్కదారి పట్టిస్తే ఆయా డీలర్ల లైసెన్సులు రద్దు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఎరువుల సరఫరా విషయంలో రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని సూచించారు. ఎరువుల లభ్యత, సరఫరాపై సిఎస్, డిజిపి, వ్యవసాయాధికారులు, ఇంటెలిజెన్స్, విజిలెన్స్‌శాఖ అధికారులతో హైదరాబాద్ నుంచి సిఎం టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఆదివారం సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాల వారీ ఎరువుల లభ్యత ఎలా ఉంది? సరఫరా ఎలా అవుతోందనే విషయంపై ఆరా తీశారు. అవసరానికి తగ్గట్టు ఎరువులు అందుబాటులో ఉంచాలని సిఎం ఆదేశించారు. మార్క్‌ఫెడ్ ద్వారా ఎంతమేర ఎరువులను సరఫరా చేస్తున్నారని అధికారులను సిఎం అడిగారు. మార్క్‌ఫెడ్ ద్వారా సుమారు 70 శాతం మేర ఎరువులు సరఫరా అయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎరువులు పక్కదారి పట్టకుండా విజిలెన్స్ అధికారులు యూరియా, ఎరువుల స్టాక్ కూడా చెక్ చేయాలని సిఎం ఆదేశించారు. వ్యవసాయేతర అవసరాలకు యూరియా తరలిపోకుండా కట్టడి చేయాలని, ఎరువుల సక్రమ వినియోగంపై రైతుల్లో అవగాహన పెంచాలని సూచించారు.

ఎరువులు, యూరియా సరఫరా విషయంలో జరిగే దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. పొరపాట్లు ఉంటే సరిచేసుకోవాలని, ఎవరైనా ఫేక్ ప్రచారాలు చేస్తుంటే అలాంటి వారిని గుర్తించి గుణపాఠం తరహాలో సమాధానం చెప్పాలని అధికారులకు సిఎం ఆదేశించారు. స్థానిక అధికారులతో జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులు సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు. పరిశ్రమలు, రవాణా, విజిలెన్స్, పోలీస్, వ్యవసాయశాఖల అధికారులు, కలెక్టర్లు సమన్వయంతో రోజువారీ పరిశీలన బృందాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎక్కడైనా సమస్య వస్తే స్థానిక ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలని సిఎం పేర్కొన్నారు. ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కేసులు నమోదు చేయడానికి ఎక్కడా వెనుకాడొద్దని ఆదేశించారు. ఐఎంఎఫ్‌ఎస్ పోర్టల్‌లో రియల్ టైమ్ ప్రాతిపదికన సమాచారం అప్‌డేట్ కావడం లేదని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. పోర్టల్‌లో సమాచారం నిరంతరం అప్‌డేట్ అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అత్యధికంగా ఎరువులు అమ్ముతున్న రిటైలర్లు తరచూ కొనుగోలు చేస్తున్న వారు ఎవరైనా ఉన్నట్లు గుర్తిస్తే అలాంటి వారి విషయంలో వెంటనే దర్యాప్తు చేపట్టాలన్నారు. రైతు సేవా కేంద్రాలు, సహకార సంఘాల వద్ద సరిపడా నిల్వలు ఉండేలా చూసుకోవాలని అధికారులను సిఎం చంద్రబాబు ఆదేశించారు. బయట ప్రైవేట్ డీలర్ల కంటే ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా ఎరువుల సరఫరా ఎక్కువగా జరిగేలా చూడాలన్నారు. రిటైల్ కేంద్రాలు, పిఎసిఎస్‌ల వద్ద యూరియా, ఎరువుల కోసం రైతులు పడిగాపులు పడే పరిస్థితి రాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

# కౌలు రైతులకు పంట రుణాలిచ్చేదెప్పుడు?

- కేటాయించింది రూ.8 వేల కోట్లు
- ఇప్పటి వరకూ ఇచ్చింది రూ.838 కోట్లే



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కౌలు రైతులకు పంట రుణాలు అందని ద్రాక్షగా మారాయి. ప్రస్తుత సీజన్ ప్రారంభమై మూడు నెలలవుతున్నా.. ఇప్పటికీ కౌలు రైతుల గురించి కూటమి ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాల్లేవు. నూతన కౌలు చట్టాన్ని తీసుకొస్తామని చెప్పి గతేడాది కాలంగా బుట్టదాఖలు చేసిన విషయం విధితమే. 2025-26 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ రంగానికి రుణాల కింద రూ.3.06 లక్షల కోట్లు ఎస్‌ఎల్‌బిసిలో ప్రతిపాదించారు. ఈ మొత్తంలో కౌలు రైతులకు అరకొరగా రూ.8 వేల కోట్లు రుణాలివ్వాలని వ్యవసాయశాఖ లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ ఇప్పటి వరకూ ఇచ్చింది కేవలం రూ.838 కోట్లు. అంటే లక్ష్యంలో 10.47 శాతంగా ఉంది. ఈ మొత్తం కేవలం కౌలు రైతులకు మాత్రమే అందిందా? అంటే అనేక సందేహాలు వ్యక్తం అవుతాయి. బ్యాంకర్లు కౌలు రైతుల పేరుతో వివిధ బంగారు రుణాలు, ఇతర వ్యవసాయ రుణాలు కొన్నింటిని ఈ ఖాతాలోనే చూపిస్తున్నారనేది కౌలు రైతు సంఘాల వాదన. ప్రస్తుతం సాగవుతున్న భూమిలో 80 శాతం వరకూ కౌలు రైతులు చేతుల్లో ఉంది. సాగు భూముల్లో ఇంత పెద్ద మొత్తంగా ఉన్నా.. రుణాల మంజూరు విషయంలో తగిన కేటాయింపులు లేకపోవడంతో కౌలు రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారుల నుంచి అధిక మొత్తంలో రుణాలు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా కౌలు రైతులు దాదాపు 32 లక్షల మంది ఉన్నారని కౌలు రైతు సంఘాలు అంచనా. వీరిలో 10 లక్షల మంది సొంత భూమి లేని కౌలు రైతులు కాగా, మిగిలిన 22 లక్షల మంది కొద్దిపాటి సొంత భూమితోపాటు ఇతరుల భూములను కౌలుకు సాగు చేస్తున్నారు. వ్యవసాయ శాఖ ఈ ఏడాది 10 లక్షల క్రాఫ్ కల్టివేటర్స్ రైట్స్ కార్డులు (సిసిఆర్‌సి) ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటి వరకూ 75,858 రెన్యువల్ కార్డులతో కలిపి 5.99 లక్షల మందికి మాత్రమే కార్డులు ఇవ్వగలిగారు. కౌలు రైతులందరికీ సిసిఆర్‌సి కార్డులు ఇస్తే కొంతైనా బ్యాంకుల్లో రుణాలు పొందేందుకు ఆస్కారం ఉంది. కాని ప్రభుత్వం కార్డుల జారీలోనూ కుంటి సాకులతో అందరికీ కార్డులు మంజూరు చేయడం లేదు. దీంతో కౌలు రైతులకు బ్యాంకుల్లో పంట రుణాలు పొందడం సాధ్యం కావడం లేదు. వాణిజ్య పంటలైన మిరప, పత్తి, పొగాకు సాగు చేసే రైతులకు సాగు వ్యయం అధికంగా ఉండటంతో రుణాల అవసరం అధికంగా ఉంటుంది. బ్యాంకర్లు రుణాలను మంజూరు చేయకపోవడంతో వీరు అధిక వడ్డీలకు ప్రైవేటు వ్యాపారస్తుల వద్ద రుణాలు తీసుకుంటున్నారు. పంటలు దెబ్బతిన్నా లేక సరైన దిగుబడి రాకపోయినా నష్టాలపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్న పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కౌలు రైతులందరికీ సిసిఆర్‌సి కార్డులు మంజూరు చేయడంతోపాటు, అందరికీ బ్యాంకు రుణాలు అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

## పాశవిక హత్య

- గర్భిణి భార్య శరీర భాగాలు ముక్కలు చేసి మూసీలో పారేయడానికి యత్నించిన భర్త
- బోడుప్పల్‌లో దారుణం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



ప్రేమవివాహం చేసుకున్న దంపతుల మధ్య వచ్చిన కలహాలు.. చివరికి భర్త భార్యను హత్యచేసే స్థాయికి తీసుకెళ్లాయి. ఆపై ఆమె మృతదేహాన్ని ముక్కలు ముక్కలుగా చేసి, కవర్‌లో పెట్టి మూసీనదిలో పారేయాలని ప్రయత్నిస్తుండగా ఇరుగు పొరుగువారి అప్రమత్తతతో హత్య ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. తెలంగాణ రాష్ట్రం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో జరిగిన ఈ ఘటన స్థానికులను భయభ్రాంతులకు గురి చేసింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా కామారెడ్డిగూడకు చెందిన స్వాతి (25), మహేందర్ రెడ్డి.. ప్రేమ వివాహం చేసుకుని బోడుప్పల్ కార్పొరేషన్‌లోని బాలాజీ హిల్స్‌లో నివాసముంటున్నారు. మహేందర్‌రెడ్డి ర్యాపిడో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కాల్ సెంటర్‌లో స్వాతి ఉద్యోగం చేస్తున్నారు. పెళ్లయిన రెండు నెలల నుంచే వారిమధ్య గొడవలు మొదలయ్యాయి. పోలీసులు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు పెద్దల సమక్షంలో రాజీ పడ్డట్టు తెలుస్తోంది. అయినా వారి మధ్య గొడవలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో గర్భవతిగా ఉన్న భార్య స్వాతిపై మహేందర్ రెడ్డి కక్ష పెంచుకున్నాడు. శనివారం రాత్రి ఇంట్లోనే స్వాతిని చంపి, పాశవికంగా మృతదేహాన్ని ముక్కలు ముక్కలుగా చేశాడు. శరీరంలోని కాళ్లు, చేతులు, తల వేరు చేసి మూసీ నదిలో పడేశానని నిందితుడు విచారణలో ఒప్పుకున్నాడు. ఛాతీ భాగాన్ని మాత్రం ఇంట్లో కవర్లో పెట్టి బయటకు తీసుకెళ్లే యత్నం చేశాడు. అయితే, గదిలో నుంచి అనుమానాస్పద శబ్దాలు రావడంతో పొరుగువారు అక్కడి వచ్చి చూడగా శరీర భాగాలు కనిపించాయి. దీంతో మేడిపల్లి పోలీసులకు సమాచారం అందించారు. డిసిపి పద్మజా రెడ్డి, ఎసిపి శ్రీనివాస్, సిఐ గోవింద్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. శరీర భాగాల కోసం మూసీ పరివాహక ప్రాంతంలో గాలిస్తున్నారు. హత్యకు కారణాలు తెలుసుకునే ప్రయత్నంలో ఉన్నారు.



పెదగంట్యాడలో పాదయాత్ర నిర్వహిస్తున్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

## ఉక్కులో ఇఒఐలను వ్యతిరేకిస్తూ బైకు ర్యాలీలు, పాదయాత్ర

ప్రజాశక్తి - ఉక్కునగరం, గాజువాక (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లోని విభాగాలను ప్రయివేటుకు అప్పగించేందుకు ఇఒఐలను పిలవడాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 31న కూర్మన్నపాలెంలో తలపెట్టిన మహాధర్నాను జయప్రదం చేయాలంటూ ఆదివారం పెద్ద సంఖ్యలో కార్మికులు, ప్రజలు బైకు ర్యాలీలు, పాదయాత్ర చేశారు. విశాఖ గాజువాక నియోజకవర్గంలోని అగనంపూడి, ఉక్కునగరం, కూర్మన్నపాలెం, పెదగంట్యాడ, గంగవరం ప్రాంతాల్లో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, అఖిలపక్ష కార్మిక సంఘాలు ఆధ్వర్యాన ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా చోట్ల పోరాట కమిటీ నాయకులు జె అయోధ్యరాం, మంత్రి రాజశేఖర్, యు రామస్వామి, ఎన్ రామారావు, జె రామకృష్ణ మాట్లాడుతూ విశాఖ ఉక్కు పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను తీవ్రంగా వ్యతిరేకించారు. ప్లాంట్ ప్రయివేటీకరణలో భాగంగానే కర్మాగారంలో ఒక్కో విభాగాన్ని ముక్కలు చేసి ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు చూస్తున్నారన్నారు. తక్షణం ఇఒఐ టెండర్లను రద్దు చేయాలన్నారు. ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని కోరారు. ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఎతో కూడిన వేతనాలను పూర్తి స్థాయిలో ఇవ్వాలని, బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.



## వేతనాలు తగ్గించడం సరికాదు

- పిఎఫ్, ఇఎస్ఐ యాజమాన్యమే చెల్లించాలి
- 104 ఎంఎంయు కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 104 ఉద్యోగులకు వేతనాలు తగ్గించడాన్ని 104 ఎంఎంయు కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశం విజయవాడలోని సిఐటియు కార్యాలయంలో 104 ఎంఎంయు ఎంప్లాయీస్ రాష్ట్ర కమిటీ గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, అధ్యక్షులు విఆర్ ఫణికుమార్, ప్రధాన కార్యదర్శి సిహెచ్ రాంబాబు అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సమావేశం పలు తీర్మానాలు చేసింది. వాటిని యూనియన్ గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు మీడియాకు వెల్లడించారు. 104 ఉద్యోగులకు భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం నుంచి తగ్గించిన జీతాల బకాయిలను ఇప్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పిఎఫ్, ఇఎస్ఐ చట్ట ప్రకారం అమలు చేసి, ఇఎస్ఐ పరిధి దాటిని ఉద్యోగులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, 104 ఉద్యోగులకు రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. వీటితోపాటు కండీషన్‌లో లేని 104 వాహనాలకు తక్షణమే వాటిని మార్చి, వాటికి ఫిట్‌నెస్ వెంటనే చేయించాలని, ఉద్యోగుల సమస్యలపై ప్రతినెలా యాజమాన్యం, ప్రభుత్వ అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో కలిపి గ్రీవెన్స్ ప్రతి జిల్లా జోనల్, రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేయాలన్నారు. మాజీ యాజమాన్యమైన అరబిందో సంస్థ నుంచి బకాయిలతోపాటు చట్టపరమైన చెల్లింపులను ఉద్యోగులకు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. చట్ట ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులకు ఇవ్వాల్సిన క్యాజువల్, ఎర్న్ లీవ్‌లు, పబ్లిక్ హాలిడేస్, గుర్తింపు కార్డులు, పే స్లిప్పులు అమలు చేయాలని పేర్కొన్నారు.

# భూసేకరణకు వ్యతిరేకంగా పోరాటం ఉధృతం

- ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి సమావేశంలో మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు

వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వం చేపట్టిన భూసేకరణకు వ్యతిరేకంగా పోరాటాన్ని ఉధృతం చేయనున్నట్లు మాజీ మంత్రి, ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు తెలిపారు. విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో వివిధ రైతు సంఘాలతోపాటు కరేడు, రావూరు రైతులు హాజరయ్యారు. ఈ సమావేశం వివరాలను వడ్డే మీడియాకు వివరిస్తూ.. పంజాబ్‌లో 65 వేల ఎకరాల సమీకరణ, కర్ణాటకలోని బెంగళూరులో 1,700 ఎకరాలు సేకరణ సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యాన స్థానిక రైతులు అడ్డుకున్నారని వెల్లడించారు. అదే స్ఫూర్తితో రాష్ట్రంలోనూ వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వం చేపట్టిన భూసేకరణను అడ్డుకుంటామని చెప్పారు. కరేడులో రైతులు తమ భూములు ఇవ్వబోమని గ్రామ సభలో తీర్మానం చేసినా, భూసేకరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టడం దుర్మార్గమన్నారు.

ఇండోసోల్ కోసం కరేడులో 8,500 ఎకరాలు, బిపిసిఎల్ కోసం రావూరులో 6 వేల ఎకరాలు సేకరించడాన్ని వ్యతిరేకించారు. అన్ని రకాల పంటలు పండే సారవంతమైన కరేడు, రావూరు భూములను కాపాడుకుందామని రైతు సంఘాలు, రైతులకు పిలుపునిచ్చారు. పత్తి రైతుల ప్రయోజనాలకు నష్టం కలిగించేలా పత్తి దిగుమతులపై సుంకాన్ని రద్దు చేయడాన్ని తప్పుబట్టారు. మోడీ అధికారం చేపట్టిన పదేళ్లలో 1.50 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే వారిలో పత్తి రైతులే అధికంగా ఉన్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం దేశంలోని పత్తి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. సుంకాల రద్దు సమస్యపై కరపత్రాల ప్రచారం, గ్రామ స్థాయిలో సమావేశాలు, సభలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంటు విషయంలో కేంద్రం చర్యలను రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోకపోవడం, రాష్ట్ర ప్రయోజనాలపై నోరు మెదపకపోవడం సరైంది కాదన్నారు. ఎపి రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం విచక్షణా రహితంగా బహుళ పంటలు పండే భూములను రైతుల నుంచి లాక్కోవడం అన్యాయమన్నారు. ఎక్కడైనా ఏర్పాటు చేసుకుని నిర్వహించేందుకు అవకాశం ఉన్న పరిశ్రమలను తీసుకొచ్చి సారవంతమైన భూములున్న, 18 వేల మంది ప్రజలు నివశిస్తున్న గ్రామాల్లో పెట్టే చర్య దుర్మార్గమైందన్నారు. దీనికి వ్యతిరేకంగా రైతులు, ప్రజలు చేపట్టిన పోరాటానికి సంయుక్త కిసాన్ మోర్చా సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందన్నారు. అదానీ, అంబానీ వంటి పెట్టుబడిదారులకు దేశ వ్యాప్తంగా కట్టబెట్టే ప్రయత్నం జరుగుతుందన్నారు.

కరేడు భూముల సాధన సమితి కన్వీనర్ ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ.. కరేడులో ఉన్న సారవంతమైన భూములను వదులుకునేందుకు గ్రామస్తులు సిద్ధంగా లేరన్నారు. ప్రభుత్వం ఎన్ని ఆటంకాలు సృష్టించినా ఎదుర్కొంటామని తెలిపారు. ప్రాణాలు సైతం ఫణంగా పెట్టి భూములు కాపాడుకుంటామని స్పష్టం చేశారు. ఇకనైనా ప్రభుత్వం భూసేకరణ ఆలోచనను విరమించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, ఇతర రైతు సంఘాల నాయకులు డి హరినాథ్, కొల్లా రాజమోహన్, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, లలిత కుమారి, వసుంధర, ఎం సూర్యనారాయణ, శ్రీకుమార్, వి రాజశేఖర్ రెడ్డి, కె బాలకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

## మూల్యాంకనం సరళీకృతం చేయండి

- వైఎస్ఆర్‌టిఎ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే మూల్యాంక విధానాన్ని సరళీకృతం చేయాలని వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ ట్రెజరర్ వి రెడ్డి శేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఇప్పటికే బోధనేతర పనులతో ఒత్తిడికి గురవుతున్న ఉపాధ్యాయులపై కూటమి ప్రభుత్వం అసెస్మెంట్ పుస్తకాలను అప్పజెప్పి మూల్యాంకనంపై పనిభారం పెంచుతోందని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనివల్ల ఉపాధ్యాయులు ఆగ్రహంతో ఉన్నారన్నారు. ఈ పుస్తకాల వల్ల ప్రజాధనం దుర్వినియోగం తప్ప విద్యార్థులకు ఒరిగిందేమీ లేదన్నారు. ఇదే విధానాన్ని ప్రైవేటు పాఠశాలల్లో అమలు చేయగలదా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

# దళితుల భూములకు స్కెచ్!

**'గూగుల్' పేర రూ.కోట్ల విలువైన వందల ఎకరాల డి పట్టా భూములపై కన్ను**

**బంజరు భూముల్లో సాగులోలేని వారి పేర్లు చేర్చి డబ్బులు కొట్టేసే కుట్ర**

**విశాఖ జిల్లా తర్లువాడలో ల్యాండ్ పూలింగ్ జిమ్మిక్కులు**

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ జిల్లా ఆనందపురం మండలం తర్లువాడ గ్రామంలో పేదల భూములను లాక్కొని బడాబాబులకు లబ్ధి చేకూర్చే 'స్కెచ్' అమలుకు అధికార పార్టీ నేతలు కొందరు స్కెచ్ వేశారు. ఇందులో భాగంగా రెవెన్యూ, ఎపిఐఐసి, స్థానిక సచివాలయ సిబ్బందిని రంగంలోకి దించారు. పేద దళితులపై ఒత్తిడి పెంచారు. 300 ఎకరాలను గూగుల్‌కిస్తే ఈ ప్రాంతం రూపురేఖలు మారిపోతాయంటూ నమ్మబలుకుతున్నారు. రూ.వందల కోట్ల విలువైన ఈ భూములను ఎగరేసుకుపోయే ప్రణాళికలో అధికార పార్టీకి చెందిన ఓ ఎమ్మెల్యే, ఇంకొంతమంది టిడిపి నాయకుల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.


దళితుల సాగులో ఉన్న డి పట్టా భూమి

### ఏం జరుగుతోంది?

ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్న కాలంలో తర్లువాడ గ్రామ దళితుల్లో 49 మందికి ఒక్కొక్కరికీ రెండేసి ఎకరాల చొప్పున తర్లువాడ చుక్కకొండ చుట్టూ డి పట్టా భూములు ఇచ్చారు. వాటిలో జీడి, మామిడి, సపోటా, నిమ్మచెట్లు వేసుకుని దళిత కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నారు. ఆ భూములను ల్యాండ్ పూలింగ్ ద్వారా స్వాధీనం చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైనట్టు పేర్కొంటూ ఎపిఐఐసియేగాక, స్థానిక రాజకీయ నేతలు కొంతమంది కొండ చుట్టూగల భూములపై సర్వే చేశారు. డి పట్టా భూమిని ప్రభుత్వం తీసుకుని ఎకరాకు రూ.40 లక్షలు, బంజరు (ఆక్రమణలు చేసిన) వారికి ఎకరాకు రూ.15 లక్షలు ఇచ్చేందుకు ఆనందపురం తహశీల్దార్ కార్యాలయంలో పరిహారం కోసం పలువురి పేర్లతో జాబితాలను సిద్ధం చేశారు. దీంతో, తమ తాతముత్తాతల కాలం నుంచి సాగులో ఉన్న భూములను లాక్కొంటే తమ జీవనోపాధి ఏమవుతుందోనని 'ప్రజాశక్తి' ఎదుట వాపోయారు.

### చుక్కకొండ చుట్టూ వెయ్యి ఎకరాలపైనే..

తర్లువాడలోగల చుక్కకొండ దిగువ భాగంలో చుట్టూ సుమారు వెయ్యి ఎకరాలకుపైగానే డి పట్టా భూములు ఉన్నాయి. పక్కనే ప్రభుత్వ బంజరు ఉండడంతో కార్పొరేట్లు, బడా రాజకీయ నేతల కళ్లు పడ్డాయి. ఆనందపురం మండల రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది ఈ భూములను ల్యాండ్ పూలింగ్‌లో తీసుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఎపిఐఐసి వీటిని స్వాధీనం చేసుకుని, ఆ తర్వాత గూగుల్ సంస్థ కార్యకలాపాల కోసం సుమారు 300 ఎకరాలు ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో దళితుల సాగుతో ఉన్న ఏడు ఎకరాలకు పెన్సింగ్ వేశారు. తాజాగా 300 ఎకరాలను గూగుల్ సంస్థకిస్తే అభివృద్ధి జరిగి ఉద్యోగాలొస్తాయంటూ ఒక ఎమ్మెల్యే సహా టిడిపికి చెందిన కొందరు మండల నాయకులు, ఓ వైసిపి నాయకుడు నిత్యం గ్రామంలోకి వచ్చి ప్రచారం చేస్తున్నారని, భూములు ఇచ్చేయాలంటూ తమను బలవంతపెడుతున్నారని దళితులు ఆందోళన వ్యక్తం చేశారు.

### అదనంగా లబ్ధిదారుల పేర్లు

నాడు ఇందిరమ్మ హయాంలో తమకు ఇచ్చిన డి పట్టా భూములతోపాటు 300 మందికిపైగా దళితులు వందల ఎకరాల బంజరు భూముల్లో పంటలు సాగు చేస్తున్నారని, ఆ భూముల్లోలేని కొంతమంది పేర్లు జాబితాలో ఉన్నాయని, సచివాలయం, రెవెన్యూ కార్యాలయాల్లో ఈ జాబితా తయారైందని తర్లువాడకు చెందిన సూర పైడిరాజు, కంచుబారిక శ్రీరాములు తెలిపారు. డి పట్టాలు ఉన్నవి మీవి, మిగతా బంజరు మాది అంటూ తర్లువాడకు చెందిన ఓ సామాజిక తరగతికి చెందిన వారంతా ఆ భూములపై పరిహారం కోసం రెవెన్యూ జాబితాల్లో పేర్లను నమోదు చేసుకున్నారని చెప్పారు. తమ డి పట్టాలను ఇచ్చేది లేదని దళితులు తేల్చి చెప్తున్నారు. మిగతా బంజరులో కొత్తవారి పేర్లను చేర్చి భూములను కాజేసేందుకుగానీ తాము అంగీకరించబోమన్నారు. 50 ఏళ్లుగా సర్వే నెంబర్లు ఒకటే ఉండగా, తాజాగా రెవెన్యూ సిబ్బంది గజిబిజి చేస్తూ భూములు ఎక్కడో ఉన్నట్టు సర్వే నెంబర్లను మార్చేసి తమను గందరగోళ పరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా చేస్తే భూములను ల్యాండ్ పూలింగ్‌కి ఇచ్చేస్తామని వారు భావిస్తున్నట్లుందని అన్నారు.

### తహశీల్దార్ ఏమన్నారంటే ?

ఆనందపురం తహశీల్దార్ శ్రీనుబాబును 'ప్రజాశక్తి' ఈ భూములపై వివరణ కోరగా ఎపిఐఐసి కోసం 300 ఎకరాలు ల్యాండ్ పూలింగ్ చేస్తున్నామన్నారు. ఆ భూముల్లో ఎంతమంది డి పట్టాదారులు, ఆక్రమణదారులు ఉన్నారన్న విషయమై వివరాలు సేకరించామని చెప్పారు. డి పట్టాదారులతో మాట్లాడేందుకు రాజకీయ నాయకులు గ్రామంలోకి వెళ్తున్నారని తెలిపారు. తర్లువాడ విఆర్ఒ అనూష మాట్లాడుతూ జాబితాలు డి పట్టాలపై 49 మంది పేర్లతో 98 ఎకరాలు సిద్ధం చేశామని, బంజరు ఆక్రమణదారులుగా 70 మంది పేర్లను సచివాలయంలో ఉంచామని చెప్పారు.

# ఐక్య పోరాటాలతోనే
# రవాణా కార్మికుల సమస్యల పరిష్కారం

## ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ మహాసభ పిలుపు

**ప్రజాశక్తి-ఒంగోలు సిటీ**

ఐక్యపోరాటాలతోనే రవాణా కార్మికుల సమస్యలు పరిష్కారమవుతాయని పలువురు నాయకులు అన్నారు. ఒంగోలులో నేపాల్ దేవ్ భట్టాచార్య నగర్ (కాపు కల్యాణ మండపం)లో ఆదివారం ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్) రాష్ట్ర మహాసభ ఘనంగా జరిగింది. ఈ మహాసభలో రవాణా రంగం ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యలు, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రయివేటీకరణ దోపిడీని ఎదుర్కోవడంపై ప్రతినిధులు చర్చించారు. మహాసభ ప్రారంభోపన్యాసంలో వక్తలు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా రవాణాను సంక్షోభంలోకి నెడుతోందన్నారు. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను నిర్లక్ష్యం చేస్తూ.. ప్రయివేట్‌కు, కార్పొరేట్లకు అప్పగిస్తోందని విమర్శించారు. బస్సులు, లారీలు నడిపే డ్రైవర్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, డీజిల్ ధరలు నిరంతరం పెరుగుతుండడంతో జీవనాధారం కష్టతరమవుతోందని పేర్కొన్నారు. రోడ్డు భద్రత పేరిట అన్యాయంగా జరిమానాలు విధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ జాతీయ కార్యదర్శి జీబన్ సాహా



మహాసభ లో మాట్లాడుతున్న ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి జిబన్ సాహా

మాట్లాడుతూ డ్రైవర్లను ఉబర్, ఓలా, ర్యాపిడో వంటి యాప్ ఆధారిత కంపెనీలు తీవ్రంగా దోచుకుంటున్నాయన్నారు. ఇటువంటి కార్పొరేట్ అనుకూల చర్యలతో ట్రాన్స్‌పోర్ట్ రంగం కుదేలు అవడంతో పాటు ఆ రంగంలో పని చేస్తున్న డ్రైవర్లు, ఆపరేటర్లు, ఆటో రంగ కార్మికుల బతుకులు ఛిద్రం అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పాటికే జిఎస్‌టి, విద్యుత్ ఛార్జీలతో ఆర్థిక భారాలు మోస్తున్న కార్మికులకు నూతన వాహన చట్టం అమలు మరింత ప్రమాదకరంగా పరిణమిస్తోందని అన్నారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్మిక హక్కులను నిర్వీర్యం చేస్తూ, లేబర్ కోడ్స్ పేరుతో లైసెన్సులు రద్దు చేసి, కార్పొరేట్లకు లాభం చేకూరుస్తోందని విమర్శించారు. ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఆర్ లక్ష్మయ్య మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులను ఎదిరించేందుకు ఇతర కార్మిక సంఘాలతో ఐక్య కార్యాచరణ రూపొందించాలని సూచించారు. మన బలం పెరిగితేనే పోరాటం బలపడుతుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఉద్యోగ, కార్మిక, కర్షక ఐక్య కార్యాచరణ ద్వారా ఉద్యమం చేపట్టాలని పిలుపునిచ్చారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కేరళలో ఉన్న 44 వెల్ఫేర్ బోర్డులు దేశానికి ఆదర్శమని, అలాంటి నమూనాలను కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా మహాసభలో ప్రవేశపెట్టిన పెట్టిన పలు తీర్మానాలు ప్రవేశపెట్టింది. ప్రయివేటీకరణ, కార్పొరేట్ దోపిడీకి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్త ఉద్యమాలు చేపట్టాలి. యాప్ ఆధారిత క్యాబ్ కంపెనీల దోపిడీపై ప్రత్యేక పోరాటాలు నిర్వహించడం ద్వారా నిరోధించాలి. ప్రభుత్వ చర్యలకు నిరసనగా 2026 జనవరి 24న భారీ ర్యాలీ నిర్వహించడం, సెప్టెంబర్ 2న దేశవ్యాప్త ఆందోళనలో విస్తృతంగా పాల్గొనడం, రాష్ట్రంలో ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ మరింత బలోపేతం చేయడం వంటి తీర్మానాలు ప్రవేశపెట్టారు.

దీన్ని ఫెడరేషన్ ఆమోదించింది. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి శ్రీనివాసులు, ఎన్ శివాజీ, సురేష్, సత్యనారాయణ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. సభలో జోజన్ సాహా కార్యకలాపాల నివేదిక ప్రవేశపెట్టారు. తొలుత మహాసభ జెండాను ఆర్ లక్ష్మయ్య ఆవిష్కరించారు. సభలో ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అయ్యపరెడ్డి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్, అధ్యక్షులు కాలం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

కొత్త సాంకేతికతతో కూడిన స్మార్ట్ రేషన్ కార్డులను ఈ నెల 25 నుంచి పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.45 కోట్ల కుటుంబాలకు నాలుగు విడతల్లో ఈ కార్డులు అందించనున్నట్లు తెలిపారు. తొలి విడతలో సోమవారం నాడు 9 జిల్లాలు..విజయనగరం, విశాఖపట్నం, ఎన్‌టిఆర్, తిరుపతి, నెల్లూరు, శ్రీకాకుళం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తామని నాదెండ్ల చెప్పారు. ఈ నెల 30న రెండో విడత.. చిత్తూరు, కాకినాడ, గుంటూరు, ఏలూరులో, సెప్టెంబరు 6న మూడో విడతలో 5 జిల్లాలు..అనంతపురం, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ, అనకాపల్లి పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే సెప్టెంబరు 15న నాలుగో విడతలో 8 జిల్లాలు..బాపట్ల, పల్నాడు, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల, ప్రకాశం జిల్లాల్లో స్మార్ట్ కార్డుల పంపిణీ చేపట్టనున్నట్లు తెలిపారు. అయితే కొత్త కార్డుల కోసం వచ్చిన దరఖాస్తుల్లో 16,67,032కు ప్రభుత్వం ఆమోదముద్ర వేసినా..వాటిలో 6.71 లక్షలకే తొలి విడతలో కార్డులు ఇవ్వనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. సందేహాల నివృత్తి కోసం టోల్ ఫ్రీ నెంబరు 1967కు ఫోన్ చేయొచ్చన్నారు.

# 26, 27 తేదీల్లో రాష్ట్ర మహాసభ

- గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం

**ప్రజాశక్తి-ఒంగోలు సిటీ**

వృత్తిరక్షణ, వృత్తిదార్ల సంక్షేమం కోసం పనిచేస్తున్న గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర 7వ మహాసభ ఈ నెల 26, 27 తేదీలలో ఒంగోలులో జరగనుంది. ఒంగోలులోని కాపు కల్యాణమండపంలో 26వ తేదీ ఉదయం పది గంటలకు ప్రారంభసభ జరుగుతుందని సంఘం ప్రకాశం జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు పేర్కొన్నారు. సభకు పశు సంవర్ధక శాఖ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ టి దామోదర నాయుడు, రైతు సంఘం పూర్వ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు పాల్గొంటారని తదితరులు తెలిపారు.


ఆందోళనకు దిగిన ఎన్‌టిఆర్ అభిమానులను బలవంతంగా అరెస్టు చేస్తున్న పోలీసులు

# 'అనంత'లో ఎన్‌టిఆర్ అభిమానుల నిరసన

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ జూనియర్ ఎన్‌టిఆర్‌పై చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా ఆయన అభిమానులు నిరసనకు దిగారు. వెంకటేశ్వర ప్రసాద్ రెండ్రోజుల్లో బహిరంగ క్షమాపణ చెప్పకపోతే ఆందోళనలు చేపడతామని ఇది వరకు ప్రకటించారు. అయినా ఎమ్మెల్యే నుంచి ఎటువంటి స్పందనా లేకపోవడంతో రాయలసీమ జిల్లాల నుంచి ఎన్‌టిఆర్ ఫ్యాన్స్ అనంతపురం వచ్చి మారుతీనగర్‌లోనున్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకున్నారు. అయినా వెనక్కు తగ్గకపోవడంతో లాఠీఛార్జీ చేశారు. అనంతరం పలువురిని అరెస్టు చేసి టూటౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో ఆందోళనకారులు మాట్లాడుతూ ఎమ్మెల్యే తక్షణం బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేకుంటే ఆయనపై టిడిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెండ్రోజులు గడువు ఇచ్చినా ఎటువంటి స్పందనలేకపోవడంతో ఈ నిరసనకు దిగాల్సి వచ్చిందని చెప్పారు. అరెస్టులతో తమ నిరసనను ఆపలేరని చర్యలు తీసుకునే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు.

# రాష్ట్ర సాంస్కృతిక విధానాన్ని ప్రకటించాలి

- చిత్రకారుల రాష్ట్ర సమ్మేళనం తీర్మానం

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** ప్రభుత్వం తన సాంస్కృతిక విధానాన్ని ప్రకటించాలని, అన్ని విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాల్లో ఫైన్ ఆర్ట్స్ ఉపాధ్యాయుల నియామకం చేపట్టాలని కోరుతూ ఫోరమ్ ఫర్ ఆర్టిస్ట్స్, ఎంబివికె ఆధ్వర్యాన జరిగిన చిత్రకారుల రాష్ట్ర సమ్మేళనం తీర్మానించింది. మరిన్ని ఫైన్ ఆర్ట్స్ సంస్థలను ప్రభుత్వం నెలకొల్పాలని, రాజధానిలో కళాకారులకు ఆర్ట్ గ్యాలరీలు ఏర్పాటు చేయాలని కోరుతూ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. విజయవాడ ఎంబి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం 'వర్తమాన పరిస్థితుల్లో చిత్రకారుడి పాత్ర' అన్న అంశంపై ఫోరమ్ ఫర్ ఆర్టిస్ట్స్, ఎంబివికె ఆధ్వర్యాన చిత్రకారుల రాష్ట్ర సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 40 మంది చిత్రకారులు 'శ్రమైక జీవనం' పేరుతో గీసిన చిత్రాలను చిత్రకళ అవధాన్ శిల్పి మర్లపూడి ఉదయ్ కుమార్ ప్రారంభించారు. అనంతరం ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ బాధ్యులు సునీల్ కుమార్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీధర్ ముఖ్య


సదస్సులో మాట్లాడుతున్న ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీధర్

అతిథిగా మాట్లాడుతూ ప్రపంచం కష్టజీవుల శ్రమపై ఆధారపడి ముందుకు వెళుతోందని, ఆ శ్రమను గౌరవించడం అందరి కర్తవ్యమని అన్నారు. కళకు హద్దులు లేవని వివరించారు. అన్ని భావాలను చిత్ర కళద్వారా వ్యక్తం చేయవచ్చున్నారు. ప్రతి ఒక్కరిలోనూ సృజనాత్మకత ఉంటుందని, అది సమాజ మార్పులకు అనుగుణంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. అయితే, ప్రపంచంలో అన్నింటి లాగానే చిత్రకళ కూడా దోపిడీకి గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. చిత్ర కళాకారులు పాత తరానికి, కొత్త తరానికి వారధి లాంటి వారని, ఎంతో సంస్కార వంతులని అన్నారు. కానీ, సమాజం వారిని చిన్నచూపు చూసిందని, సమాజానికి చిత్రకళ ఆవశ్యకత ఎంతో ఉందని పేర్కొన్నారు. కృత్రిమ మేధస్సు (ఎఐ) వచ్చినా మానవ మేధకు మించింది మరొకటి లేదన్నారు. కళాకారులు నిరంతర కృషి ద్వారా సృజనాత్మకతకు పదును పెట్టుకోవాలన్నారు. ఆ సృజనాత్మకతను సమాజ మేలు కోసం ఉపయోగించాలని సూచించారు. కళాకారులకు రాష్ట్ర రాజధానిలో ప్రత్యేకమైన వేదిక ఏర్పాటు చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. 'సాంప్రదాయ చిత్రకళ ఆవశ్యకత' అన్న అంశంపై సాంప్రదాయ చిత్రకళా విశ్లేషకులు డాక్టర్ సాగర్ గిన్నె, 'చిత్రకళా రంగంలో వస్తున్న మార్పుల'పై యోగి వేమన విశ్వవిద్యాలయం ఫైన్ ఆర్ట్స్ విభాగానికి చెందిన డాక్టర్ మృత్యుంజయరావు, 'మార్పులకు అనుగుణంగా చిత్రకారుడు పాత్ర' అంశంపై ప్రముఖ చిత్రకారులు వై.శేష బ్రహ్మం వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంబివికె కార్యదర్శి పి.మురళీకృష్ణ, అమరావతి బుద్ధ విహార్ బాధ్యులు శుభాకర్, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ బాధ్యులు అరసవిల్లి గిరిధర్, మల్లిక్, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

# 28 నుంచి 30 వరకూ
# విశాఖలో 'సేనతో సేనాని'

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, కలెక్టరేట్ (విశాఖపట్నం)**

జనసేన రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశాలకు విశాఖ వేదిక కానుందని ఆ పార్టీ పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం విశాఖలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి 30 వరకు విశాఖపట్నంలో 'సేనతో సేనాని' పేరుతో ఈ సమావేశాలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఈ మూడు రోజులపాటు పార్టీ అధినేత పవన్ కల్యాణ్ సమావేశాల్లో పాల్గొంటారని తెలిపారు. 28న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో వైఎంసిఎలో సమావేశం జరుగుతుందని, అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు రాష్ట్రస్థాయి కార్యకర్తలతో సమావేశమవుతారని తెలిపారు. 29న పార్లమెంటు నియోజకవర్గాల నుండి పార్టీ కోసం మొదటి నుంచీ కష్టపడిన, వైసిపిపై పోరాటం చేసిన కార్యకర్తలతో సమావేశం ఉంటుందన్నారు. 30న మధ్యాహ్నం ఒంటి గంటకు ఇందిరా ప్రియదర్శిని స్టేడియం వేదికగా 15 వేల మంది కార్యకర్తలతో సమావేశం ఉంటుందని, సాయంత్రం 6 గంటలకు పవన్ ప్రసంగిస్తారని తెలిపారు. పౌరులకు అందించాల్సిన సేవలు, ఉపాధి, మహిళల భద్రత, రాబోయే రోజుల్లో పార్టీ చేయబోయే కార్యక్రమాలు, క్షేత్ర స్థాయిలో రైతులకు అందించిన సహాయం, ఇతర అంశాలపై సమావేశాల్లో చర్చిస్తామన్నారు. ఉపాధి రంగంలో పర్యాటక శాఖ ఏవిధంగా ముందుకు వెళ్తుందో తెలిపేందుకు ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. నిర్వహణకు శాసనసభ్యుల ఆధ్వర్యంలో ఇప్పటికే 12 కమిటీలు ఏర్పాటు చేశామన్నారు.

# జన్యు శాస్త్ర పితామహుడు ఎవరు ?

## ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ (ఎఫ్‌బిఒ) పరీక్షల మోడల్ పేపర్



- జి. శ్యామ్,
పోటీ పరీక్షల ప్రత్యేక నిపుణులు,
కాకినాడ,
సెల్ : 9848136254,
9848256254

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ (ఎఫ్‌బిఒ) పరీక్షల మోడల్ పేపర్

**91. క్లోరోఫిల్‌లో ఉండే మూలకం ఏది ?**
(1) సల్ఫర్ (2) మెగ్నీషియం (3) క్లోరిన్ (4) ఐరన్

**92. "టచ్ మీ నాట్" అని పిలువబడే మొక్క ఏది ?**
(1) అత్తిపత్తి (2) ఫెర్న్ మొక్క
(3) బ్రయోఫైటా (4) మాస్ మొక్క

**93. కిరణజన్య సంయోగ క్రియలో ఏర్పడే ఉప ఉత్పన్నం ?**
(1) జఉ2 (2) ఉ2 (3) జఉ (4) గ్లూకోజ్

**94ఈ క్రింది వాటిలో పరాన్న జీవులు అని వేటిని పిలుస్తారు ?**
(1) రఫ్లేషియా (2) యుట్రిక్‌లేరియా
(3) రైజోబియం (4) శిలీంధ్రాలు

**95..మొక్కలలో ఉండే పురుష బీజ కణాలు అని వేటిని పిలుస్తారు ?**
(1) అండకోశం (2) అండాలు
(3) కీలాగ్రం (4) పరాగరేణువులు

96.ఈ క్రింది వాటిలో అనిషేకఫలం అని దేనిని అంటారు ?
(1) మామిడి(2) దానిమ్మ (3) పైనాపిల్ (4) ఆపిల్

**97.ఈ క్రింది వాటిలో ఏ మొక్క కీటకాల ద్వారా పరపరాగ సంపర్కం జరుపుకుంటుంది ?**
(1) వరి (2) నైట్ క్వీన్ (3) రఫ్లేషియా (4) బిగ్నోనియా

**98. ఈ క్రింది వాటిలో ఏ మొక్క కాండాల ద్వారా శాఖీయ ప్రత్యుత్పత్తి జరుపుకుంటుంది. ఆ మొక్క ఏది ?**
(1) క్యారెట్ (2) రణపాల (3) డాలియా (4) చెరకు

**99.ఈ క్రింది వాటిలో సంపూర్ణ పుష్పం ఏది ?**
(1) దోసకాయ (2) సోరకాయ (3) కాకరకాయ (4) మందార

**100. వాయుసహిత శ్వాసక్రియ అనేది ఈ క్రింది వాటిలో దేని సమక్షంలో జరుగుతుంది ?**
(1) $CO_2$ (2) $O_2$ (3) $SO_2$ (4) $NO_2$

**101.ఈ క్రింది వాటిలో ఏ మొక్క ఔషధాన్ని పాము కాటు నివారణకు వాడతారు ?**
(1) సర్పగంధి మొక్క (2) నీలగిరి మొక్క
(3) నల్లమందు మొక్క (4) కాఫీ మొక్క

**102. ఈ క్రింది వాటిని జతపరచండి.**
జాబితా-I జాబితా-II
(a) వేప (i) దగ్గు నివారణకు
(ఎ) ఉసిరికాయ (ii) చర్మ సంబంధ వ్యాధుల నివారణకు
(c) కరివేపాకు (iii) రోగ నిరోధక శక్తి
(d) రావి (iv) జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది
(1) (a)-(ii), (b)-(iii), (c)-(iv), (d)-(i)
(2) (a)-(i), (b)-(ii), (c)-(iii), (d)-(iv)
(3) (a)-(iv), (b)-(i), (c)-(iii), (d)-(ii)
(4) (a)-(iv), (b)-(iii), (c)-(ii), (d)-(i)

**103. జన్యు శాస్త్ర పితామహుడు అని ఎవరిని పిలుస్తారు ?**
(1) గ్రెగర్ మెండల్ (2) లూయిస్ పాశ్చర్
(3) ఎడ్వర్డ్ జెన్నర్ (4) రాబర్ట్ హుక్

**104.ఈ క్రింది వాటిని జతపరచండి.**
జాబితా-I జాబితా-II
(a) $CO_2$ (i) థర్మల్ విద్యుత్ సబ్‌స్టేషన్లు
(b) CO (ii) ఫ్రియాన్‌లు
(c) CFC (iii) మోటార్ వాహనాలు
(d) $SO_2$ (iv) అడవులు నరికివేయడం
(1) (a)-(iv), (b)-(iii), (c)-(i), (d)-(ii)
(2) (a)-(i), (b)-(ii), (c)-(iii), (d)-(iv)
(3) (a)-(iv), (b)-(i), (c)-(iii), (d)-(ii)
(4) (a)-(iv), (b)-(iii), (c)-(ii), (d)-(i)

**105. జర్మన్ సిల్వర్ అనేది దేని మిశ్రమం ?**
(1) బంగారం మరియు వెండి (2) రాగి మరియు వెండి
(3) రాగి, జింక్ మరియు వెండి (4) రాగి, జింక్ మరియు నికెల్

**106. క్షయంకు ఉదాహరణ ?**
(1) వెండిపై నల్లటి పూత (2) రాగిపై ఆకుపచ్చ పూత
(3) ఇనుముపై గోధుమ రంగు పూత (4) పై మూడు

**107. అణు రియాక్టర్లలో మాడరేటర్‌గా కింది వాటిలో ఏది ఉపయోగించబడుతుంది?**
(1) ఓజోన్ (2) భార హైడ్రోజన్
(3) భారజలం (4) హైడ్రోజన్ పెరాక్సైడ్

**108. వాటర్ గ్యాస్ అంటే ?**
(1) $CO + H_2$ (2) $CO + H_2O$
(3) $CO_2 + H_2$ (4) $CO_2 + H_2O$

**109. క్రింది వాటిలో ఏది కార్బన్ యొక్క స్వచ్ఛమైన రూపం?**
(1) చార్కోల్ (2) కోక్
(3) ఫుల్లరీన్ (4) కార్బన్ బ్లాక్

**110.ఏ రకమైన బొగ్గులో కార్బన్ శాతం అత్యధికంగా ఉంటుంది?**
(1) పీట్ (2) లిగ్నైట్
(3) బిట్యుమినస్ (4) ఆంథ్రసైట్

**111.ఇనుమును క్షయం నుండి రక్షించడానికి జింక్‌ను ఉపయోగిస్తారు, ఎందుకంటే జింక్**
(1) ఇనుము కంటే ఎక్కువ ఎలక్ట్రోపాజిటివ్
(2) ఇనుము కంటే చౌకైనది
(3) నీలం తెలుపు లోహం
(4) వేడి మరియు విద్యుత్‌కు మంచి వాహకం

**112. క్రింది పదార్థాలను ప్రయోగశాలలో వాటి మొదటి సంశ్లేషణ యొక్క కాలక్రమానుసారంగా అమర్చండి:**
(a) నల్ల బంగారం (b) ఫుల్లెరీన్ (c) గ్రాఫేన్ (d) కెవ్లార్
**క్రింద ఇవ్వబడిన కోడ్‌ల నుండి సరైన సమాధానాన్ని ఎంచుకోండి:**
(1) (a), (b), (c), (d) (2) (d), (b), (c), (a)
(3) (b), (d), (c), (a) (4) (d), (a), (b), (c)

**113.ఇసుక మరియు నాఫ్తలీన్ మిశ్రమాన్ని దీని ద్వారా వేరు చేయవచ్చు:**
(1) ఉత్పతనం (2) స్వేదనం
(3) క్రోమాటోగ్రఫీ (4) పాక్షిక స్వేదనం

**114.క్రింది కార్బన్ సమ్మేళనాలలో ఏది మసి మంటను ఇవ్వదు?**
(1) బెంజీన్ (2) హెక్సేన్ (3) నాఫ్తలీన్(4) ఆంత్రాసీన్

**115. 1 కిలోల కార్బన్‌ను వేడి చేయడం ద్వారా ఎంత $CO_2$ ఉత్పత్తి అవుతుంది?**
(1) 11/3 కేజీలు (2) 3/11 కేజీలు
(3) 4/3 కేజీలు (4) 3/4 కేజీలు

**116. పెట్రోల్, డీజిల్ ఏ సహజ వనరు నుండి లభిస్తాయి?**
(1) కోక్ (2) కోల్ తార్ (3) బిట్యుమెన్ (4) పెట్రోలియం

**117. సహజ వనరుల నుండి కాకుండా నేరుగా భూమి వెలుపల నుండి మనం పొందని ఏకైక విషయం బిబిబిబి**
(1) ఖనిజాలు (2) బొగ్గు (3) సహజ వాయువులు (4) శక్తి

**118. భారతదేశంలో రాగి గనులకు కింది వాటిలో ఏ ప్రదేశం ప్రసిద్ధి?**
(1) ఖేత్రి (2) కుద్రేముఖ్ (3) కోలార్ (4) రత్నగిరి

**119. ఒక విద్యార్థి ఒక సంఖ్యని 5/3 కు బదులుగా పొరపాటున 3/5 తో గుణించెను అయినా లెక్కలో దోషశాతం ఎంత ?**
(1) 34% (2) 44% (3) 54% (4) 64%

**120. ఒక దుకాణదారుడు కొన్ని వస్తువులలో ఒక్కొక్క వస్తువును రూ.35 చొప్పున అమ్మగా వాటి మీద 40% లాభం వచ్చెను. అతను ఒక్కొక్క వస్తువును ఎంతకు అమ్మిన 60% లాభం వచ్చును ? (రూ.లలో)**
(1) 45 (2) 42 (3) 39 (4) 40

**121.ఒక వస్తువు యొక్క కొన్న ధర మరియు ప్రకటిత ధరలు వరుసగా రూ. 720 మరియు రూ. 900. దానిని X% తగ్గింపుకు అమ్మితే వచ్చు లాభం % అయితే ఇ విలువ ఎంత?**
(1) 7 4/7 (2) 8 4/7 (3) 5 5/7 (4) 5 4/7

**122. కొంత సొమ్ముపై 16 2/3% వార్షిక వడ్డీరేటున 3 సంవత్సరాలకు లభించిన చక్రవడ్డీ రూ.6,350. అయిన అదే సొమ్ముపై, అదే వడ్డీరేటున, 5 2/3 సంవత్సరాలకు లభించు బారువడ్డీ ఎంత ? (రూ.లలో)**
(1) 11,400 (2) 7,620 (3) 9,600 (4) 10,200

**123. ఒక కళాశాలలో ఆర్ట్స్, కామర్స్ మరియు సైన్స్ విద్యార్థుల మధ్య నిష్పత్తి 3 : 5 : 8. ఆ విద్యార్థుల సంఖ్య వరుసగా 20%, 40% మరియు 25% పెరిగిన కొత్త నిష్పత్తి ఎంత?**
(1) 18 : 35 : 50 (2) 3 : 10 : 10
(3) 4 : 8 : 5 (4) 33 : 35 : 25

**124.ఒక పరీక్షలో విద్యార్థుల యొక్క సగటు మార్కులు 60. ఆ సగటు చేయునప్పుడు 100 మంది విద్యార్థుల సగటు మార్కులు 30కి బదులుగా 60 తీసుకొనెను. ఆ తప్పులన్నిటినీ సరిచేసినా, విద్యార్థుల యొక్క సగటు మార్కులు 45 అయిన ఎంత మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు?**
(1) 200 (2) 210 (3) 240 (4) 180

**125. P అను వ్యక్తి ఒక పనిని 40 రోజులలో పూర్తి చేయగలడు. అదే పనిని, Q అను మరొక వ్యక్తి 35 రోజులలో పూర్తి చేయగలడు. P, Qలు ఇద్దరు కలిసి 14 రోజులు పని చేసిన తరువాత, P వెళ్ళిపోయాడు. మిగిలిన పనిని పూర్తి చేయడానికి Q తీసుకొనే రోజులు ?**
(1) 12 1/4 (2) 10 1/2 (3) 9 3/4 (4) 8 3/4

**126. సమీర్ తన ఇంటి నుండి రిసార్ట్‌కు 81 కి.మీ/గం వేగంతో ప్రయాణించెను. అదే దారిలో తిరిగి వస్తూ, ట్రాఫిక్ వలన 56 ని॥లు అధికంగా తీసుకొనెను మరియు కేవలం 60 కి.మీ/గం వేగంతో ప్రయాణించెను. ప్రతీ మార్గములో అతను ప్రయాణించిన దూరం ఎంత ? (కి.మీ.లలో)**
(1) 216 (2) 160 (3) 200 (4) 224

**127.100 మరియు 200 మధ్యలో గల 3 గుణిజాల మొత్తం ఎంత ?**
(1) 5000 (2) 4950 (3) 4980 (4) 4900

**128.మూడు సంఖ్యల క.సా.గు 9,570, అయిన ఈ క్రింది వాటిలో ఆ సంఖ్యల యొక్క గ.సా.భా అయ్యే అవకాశం ఉంది ?**
(1) 11 (2) 12 (3) 19 (4) 21

**129. విలువ ఎంత ?**
(1) 0 (2) 4/5 (3) 1 (4) 2


**130. (1, 2) బిందువు గుండా పోతూ, వాలు 1/3 కల్గిన సమీకరణం కనుగొనండి ?**
(1) $x+3y-5=0$ (2) $2x-3y+5=0$
(3) $x-3y+5=0$ (4) ఇంతేకాదు

**సూచన (131-133) :- ఈ దిగువ ఇచ్చిన పట్టిక 2011-2012 నుండి 2015-2016 వరకు నాలుగు ఇంజనీరింగ్ కళాశాలల్లోని విద్యార్థుల ప్రవేశానికి సంబంధించిన వివరాలను తెలుపుతుంది. ఈ సమాచారం ఉపయోగించుకొని క్రింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

**131. ఏ కళాశాలలో ప్రవేశములు ప్రతీ సంవత్సరం పెరుగుతూ ఉన్నాయి ?**
(1) A (2) B (3) C (4) D

**132.. 2013-2014 సంవత్సరంలోని అన్ని కళాశాలల్లోని ప్రవేశములు పరిగణలోకి తీసుకున్నప్పుడు ఆ సంవత్సరం కళాశాల 'A'లో ప్రవేశముల శాతం ఎంత ?**
(1) 20 (2) 25 (3) 30 (4) 35

**133. కళాశాల 'B'లో 2013-2014 సంవత్సరం నందు అంతకు క్రిందట సంవత్సరం కంటే ప్రవేశములు ఎంత శాతం పెరిగినవి?**
(1) 30 (2) 25 (3) 20 (4) 10




**సూచన (134-135) :- ఒక పట్టణం యొక్క జనాభా 40,000. ఈ దిగువ వృత్త రేఖాచిత్రంలో వివిధ రకాల వృత్తులు చేసేవారి సంఖ్యను శాతాలలోసూచించడం జరిగింది. సమాచారాన్ని జాగ్రత్తగా చదివి ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వండి.**

**134. పరిశ్రమలలో ఉన్న వారి సంఖ్య ఎంత ?**
(1) 8400 (2) 11600(3) 8000 (4) 7200

**135. వ్యాపారంలో కంటే రవాణాలో ఎంత మంది ఎక్కువ ఉన్నారు ?**
(1) 1680 (2) 1750 (3) 1800 (4) 1600

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| $x_i$ : | 4 | 3 | 5 | 7 | 2 | 1 |
| $f_i$ : | 1 | 0 | 2 | 1 | 3 | 5 |

**136. ఈ క్రింది దత్తాంశం యొక్క అంకమధ్యమంను కనుగొనండి ?**
(1) 2.66 (2) 7.5 (3) 5.6 (4) 8

**137. అంకమధ్యమం = (3 మధ్యగతం- బాహుళకం)/p అయినా విలువ ఎంత?**
(1) 1/3 (2) 2 (3) 1/2 (4) 1

**138. మొదటి :అః సహజ సంఖ్యల ప్రామాణిక విచలనాన్ని కనుగొనండి ?**
(1) (2) (3) (4)

**139. DABC లో ÐB మరియు ÐC ల సమద్విఖండనలు P వద్ద ఖండించుకొనును. ÐBPC=128° అయినా ÐA విలువ ఎంత ?**
(1) 52° (2) 78° (3) 76° (4) 82°


**140. 4 సెం.మీ. వ్యాసార్థం కలిగిన వృత్తం యొక్క వృత్త కేంద్రంనకు 5 సెం.మీ. దూరంలో ఉన్న బిందువు నుండి వృత్తానికి గీసిన స్పర్శరేఖ పొడవు ఎంత? (సెం.మీ.లలో)**
(1) 5 (2) 5 (3) 3 (4) 3

141. ABC లంబకోణ త్రిభుజంలో జ వద్ద లంబకోణం కలిగిన CD ^ AB మరియు ÐA = 55° అయితే ÐACD = ?
(1) 35° (2) 55°
(3) 60° (4) 45°

**142. కొన్ని త్రిభుజ భుజాలు క్రింది ఇవ్వబడ్డాయి. ఈ క్రింది వాటిలో లంబకోణ త్రిభుజానికి సంబంధించిన భుజాలు ఏవి?**
(a) 7 సెం.మీ, 24 సెం.మీ, 25 సెం.మీ
(b) 3 సెం.మీ, 8 సెం.మీ, 6 సెం.మీ
(c) 50 సెం.మీ, 80 సెం.మీ, 100 సెం.మీ
(d) 17 సెం.మీ, 15 సెం.మీ, 8 సెం.మీ
(1) (b) మరియు (c) (2) (a) మరియు (b)
(3) (a) మరియు (d) (4) (ఖ) మరియు (ఎ)

**143. ఒక క్రమ బహుభుజికి 65 కర్ణాలు కలిగిన వాటి అంతరకోణాలు మొత్తం ఎంత ?**
(1) 18000(2) 16200(3) 19800(4) 14400

**144. ఇచ్చిన పటంలో 'O' అనునది వృత్త కేంద్రము మరియు ÐAOC = 1300 అయినా ÐABC విలువ ఎంత ?**





(1) 500 (2) 650 (3) 1150 (4) 1300

**145. ఒక చతుర్భుజము ABCDలో BD=16 సెం.మీ మరియు AL, CM\T BD మీదకు గీసిన లంబాలు మరియు AL = 9 సెం.మీ మరియు CM = 7 సెం.మీ అయితే ABCD చతుర్భుజం యొక్క వైశాల్యం ఎంత ? (సెం.మీ2 లలో)**
(1) 256 (2) 128 (3) 64 (4) 96

**146.త్రిభుజం ABC లో AB = 5 సెం.మీ, BC = 8 సెం.మీ మరియు ÐABC = 600 అయినా AC విలువ ఎంత ?**
(1) 7 (2) (3) 120 (4)

**147. ఒక త్రిభుజం యొక్క రెండు భుజాలు వరుసగా 10 సెం.మీ మరియు 17 సెం.మీ. మూడవ భుజం అనునది ఒక పూర్ణసంఖ్య అయినా వ్యవస్థితం అయ్యే విభిన్న త్రిభుజాల సంఖ్య ఎంత ?**
(1) 18 (2) 19 (3) 20 (4) 21

**148. ప్రక్క పటంలో x విలువ ఎంత ?**




(1) 210 (2) 220
(3) 230 (4) 240

**149.ఆగస్ట్ 29, 1947వ తారీఖు ఏ వారం అవుతుంది ?**
(1) శుక్రవారం (2) శనివారం (3) ఆదివారం (4) సోమవారం

**150. ఒక రోజులో నిమిషాల ముల్లు మరియు గంటల ముల్లు ఎన్నిసార్లు సరళరేఖా మార్గంలో ఉంటాయి ?**
(1) 44 (2) 48 (3) 88 (4) 92

జవాబులు :
**(91) 2 (92) 1 (93) 2 (94) 1 (95) 4 (96) 3 (97) 2 (98) 4 (99) 4 (100) 2 (101) 1 (102) 1 (103) 1 (104) 4 (105) 4 (106) 4 (107) 3 (108) 1 (109) 3 (110) 4 (111) 1 (112) 2 (113) 1 (114) 2 (115) 1 (116) 4 (117) 4 (118) 1 (119) 4 (120) 4 (121) 2 (122) 4 (123) 1 (124) 1 (125) 4 (126) 1 (127) 2 (128) 1 (129) 3 (130) 3 (131) 3(132) 2 (133) 4 (134) 2 (135) 4 (136) 1 (137) 2 (138) 1 (139) 3 (140) 3 (141) 1 (142) 3 (143) 3 (144) 3 (145) 2 (146) 1 (147) 2 (148) 2 (149) 1 (150) 3**



"మతిభ్రమించిన అతిరథులంతా
గతితర్కాన్నే తిడతారా?
కారల్ మార్క్స్ ఉపదేశాలకు
కాలదోషమని అంటారా?
డెబ్బయ్యేళ్ల త్యాగాలన్నీ
ఇబ్బందుల పద్దుకు జమ కట్టి వర్గ శత్రువుల
దుర్గంధాల వాకిట ముష్టికి వెడతారా?"

- ఆరుద్ర (ఆగస్టు 31: జయంతి)

## విధ్వంస నీతి!

ఆంధ్రమాత ముక్కు పుడకా
దక్షిణదేశపు పారిశ్రామిక పుత్రికా..!

విభజించు.. పాలించు...
అన్న అలనాటి తెల్లవారి మంత్రం
నల్ల ప్రభువుల నాలుకల మీద
విక్రయించు.. భుజించుగా తర్జుమా అయిపోతుంది
అప్రకటితంగా అమలవుతోన్న కమలోద్భవ రాజ్యాంగంలో
గుర్రాల కాళ్లు నరికి
రథ చక్రాల్ని కూల్చి
శత శాపాల కర్ణుడుగా మార్చినా
విదేశాలతో పోటీ పడుతోందని
విధ్వంస యజ్ఞంలో భస్మం చేసేయాలనుకొంటున్నాడు!
అసలు అమ్మ కడుపులో ఉన్నప్పుడే
బొడ్డు పేగు గొట్టానికి
అడ్డుకట్ట వేసేసి
పిండ రూపంలోనే నిర్మూలించాలనుకున్నాడు
నాలుగు దశాబ్దాలుగా
గనులు లేని ఉక్కు కర్మాగారం అంటేనే
కనులు లేని దిక్కు మాలిన జీవితం!
శరీరంలోని అంగాన్ని తెగ్గోసి
అపాత్ర దానం చేసిన శిబి చక్రవర్తిలా
అస్మదీయుడెవడికో
అప్పుడెప్పుడో ఇచ్చిన రాజకీయ వరం
ఇప్పుడు గంగవరమై
ఆర్థికంగా కుంగదీస్తున్నది!
000
తొలిసారి
అత్యవసరం అయితే
ఒక మూత్ర పిండాన్ని అమ్మేశాడు
రెండో పర్యాయం
పాతికేళ్ల పర్వదినం కోసమని
కాలేయాన్ని కోసేసుకొని
కాజేయాలని చూశాడు
ఇంకో పాలి
కాలుష్యమై కాటేసిందని
ఊపిరి తిత్తులు కత్తిరించేశాడు
వర్షసిక్తమై స్తంభించిన ఖనిజశుద్ధితో
ఆకస్మికంగా ఘనీభవించిన కొలుములు
ఆగిపోయిన దేహక్రియగా
విషాదించినప్పుడు
ఇప్పటికే ఓ సారి పాక్షిక పక్షవాతం
అని వైద్య నిర్ధారణ చేసేశాడు..!
ఈ సారి అచేతనా మృతస్థితి
అని చెప్పించెయ్యాలని
అపరిచిత ద్వీపాల నుంచి
అనుభవజ్ఞుల్ని రప్పిస్తున్నాడు....
ఉద్దానం వ్యాధి బాధితులకు
డయాలసిస్‌తో ఆయువు పొడిగింపుకి
ఉన్న అవకాశం కూడా
ఉక్కుకి ఇవ్వనంటున్నాడు
దయార్ద్ర మరణం మినహా..!

- సుదేరా
97013 47080

## యుద్ధమూ - క్షామమూ

ఇజ్రాయెల్! ఇది వీరోచిత కార్యమా?
దారుణ మారణ కాండ ఓ రణన్నినాదమా!
ఉగ్రవాది సాకు చెప్పి
యుద్ధనీతి విడిచి పెట్టి
యావత్ జాతిహననం న్యాయమా!
పాలస్తీనీయుల దేశం
సమూల నాశనం ధ్యేయమా!
ఎలుకలపై పగబడితే
కలుగులు కనిపెట్టాలి
ఆ ఎలుకల పనిపట్టాలి
ఇల్లు తగలబెట్టరాదు
బతుకు పగలగొట్టరాదు

ఓ యూదు రాజ్యమా,
ఆధునిక పనిముట్లతో
అతివాదులను గురి పెట్టగలవు
వేరు చేసి గిరి గీయగలవు
మరి లేవకుండా ఉరి తీయగలవు
ఊరికి శాంతినీయగలవు
అది నాగరికం,
నాగరికత కు మొదటి లక్షణం
ఆ రీతిని విస్మరించి
పౌరులందరినీ వైరులుగా భావించి,
సామూహికం గా ద్వేషించి,
సంహరించ బూనడం,
ఆకలిని ఆయుధంగా మలిచి
నెమనెమ్మదిగా వధించడం
మానవతకు కళంకం
చరిత హీన నియంతల నిర్వాకం
బాధితవయ్యీ ఆ బాట నడువుట హేయం!
(ఇజ్రాయెల్ దాడితో గాజాలో ఐదు లక్షల జనాభా క్షామం బారిన పడినట్లు ఐక్య రాజ్య సమితి అధికారిక ప్రకటన)

- డా.డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ.
94408 36931

## రేపాక రోజుకి ...

పక్షినై ఆకాశానికి ఎగిరిపోతాను
ఎవరికీ అందరానంత ఎత్తు నుంచి
అట్టడుగు జనాల్ని చూస్తాను
నన్నాపే సాహసం
సముద్రం సైతం చేయలేనంత ఎత్తు నుంచి
పాతాళం నుంచి జనాల్ని తోడి తీయాలి

ఒక్కో మెట్టు పైన నోరు తెరుచుకున్న
పైథాన్ల పేరాశల కబళింపుల నుంచి
వాళ్ళని రక్షించే మార్గం నిర్మించాలి
శిఖరాగ్రాల మీద వాలిన మేఘమాల నా ప్రేరణ
నేలపై నుంచి ఆకాశానికెగిరినా
మట్టి తల్లి ఋణాన్ని మరువని గుణం
అన్వేషిస్తే ఎందరిలో కనిపిస్తుందని?

పుట్టిన నేలనే వంచిస్తూ విష రసాయనాలతో
అడుగడుగూ కలుషితం చేస్తున్న వాళ్లెందరో!
వాళ్ళ అడుగు నుంచి బడుగుల్ని కాపాడాలి
రోజంతా వాళ్ళ చాకిరితోనే
తమ అభివృద్ధికి మార్గం నిర్మించుకుంటూ విస్తరిస్తూ
మేడల ముందు నందనవనంలోని పూల మొక్కలకి
వాళ్ల చెమటను తోడిపోస్తూ
పరిమళం ఆఘ్రాణిస్తూ
సుఖ వసంతాల ఋతువులో
పిసరంతైనా గుర్తింపునివ్వని పరిజనులొకరొకర్ని
దోసిళ్ళతో పొదువుకొని పావురాళ్లలా ఎగిరేయాలి
ఆకాశంలో విహరించే పాలగువ్వలకు
రక్షణ కవచంలా
డేగల్ని వెంటాడే రాబందునై కాపలా కాయాలి!

- ఈతకోట సుబ్బారావు
94405 29785

# కవితా వెలుగు రేకల్ని విరజిమ్మిన 'పొద్దు'

పరిచయం



ప్రాచీన కాలంలో కాళిదాస మహాకవి సంస్కృతంలో ఆరు రుతువులు... వసంత, గ్రీష్మ, వర్ష, శరద్, హేమంత, శిశిరాలను వర్ణిస్తూ రాసిన కావ్యం 'ఋతుసంహారం'. ఆధునిక కాలంలో రంధి సోమరాజు ఈ ఆరు రుతువులను 'వోనాకాలం', 'శీతకట్టు', 'ఏసంగి పొద్దులు'గా కుదించి మూడు కావాలను చిత్రిస్తూ రాసిన కావ్యం 'పొద్దు'. ఇది 1972 జూన్‌లో అచ్చయ్యింది. ఈ కావ్యం అప్పట్లో ఎంతో సంచలనం కలిగించింది. కవితా ప్రియుల్ని అలరించింది. ఈ కావ్యం మొత్తం మాండలికంలో రాశారు కవి.

'వోనాకాలం వొత్తే సాలు/ వొల్లు కుందేలు పిల్లనా గెంతులేత్తాది' అంటూ ప్రారంభమవుతుంది వానాకాల వర్ణన. 'జలజల సినుకు లడ్తావుంటే/ సమర్తాడిన గుంటలు/ సెమ్మసెక్క లాడ్తున్నట్టుంటాది' అంటారు సోమరాజు. తిలక్ తన కవితల్ని 'వెన్నెట్లో ఆడుకునే అందమైన ఆడపిల్లలు' అన్నారు. సోమరాజు జలజల రాలే చినుకులు మనలో కలిగించే భావోద్వేగాల్ని చెమ్మచెక్కలాడే ఆడపిల్లలని ఆసరాగా తీసుకుని రూపు కట్టించారు. వానాకాలంలో మబ్బులదే లోకంపై అజమాయిషీ. ఇదే విషయాన్ని చెబుతూ 'సూరీడ్ని సొక్కా జేబులో ఏసి/ సెనంలో మబ్బులు/ నోకాన్ని మూసేత్తయి' సూర్యుణ్ణి మబ్బులు కమ్మడాన్ని అలా చెబుతారు కవి.

'తెల్లార్లు సూరు నుండి/ సిదుకు సిదుకుమని సినుకు లడ్తావుంటే/ నిద్దరేటడద్ది/ సెవికాడ నొకటే ముసిలోల సనుగుడు నాగ', "ఏలెట్టి/ ఆకాశం కంటిలో పొడిస్తే/ కారే నీలలా వొకటే వాన". ఇవి కవితా కాన్వాస్‌పై గీచిన వాన చిత్రాలు. 'తాటేకిళ్లల్లో/ కారే సోటెల్లు/ కడ్వ లోరెట్ట గ్రలు?/ నెత్తి మీద సినుకులు/ సిటుకు సిటుకున మొట్టికాయ లేత్తావుంటే/ కూసోని కునికినాం/ తెల్లార్లూ జాగారమే' వానాకాలం నాటి పేదల బ్రతుకు సహజ చిత్రణ! 'యిల్ల కప్పుల మీద/ దారి తెలియనట్టు/ పొగ నిల్సిపోనాది/ ఏ వూరెల్లాలో మరి/ ఆ పొగపిల్ల'. కట్టెల పొయ్యిపై వంటా వార్పూ చేసే కాలానికి చెందిన కవిత... ఒక సహజ దృశ్యానికి కవితా అందం అద్దారు కవి. 'జోడు నేక వోనల్లో/ అరికాళ్లొరిసిపోయి/ కాలి మండల్నిండ/ జల్లిడి బొక్కలే/ అలాటి కాళ్లతో/ కట్టపడ్తే/ కట్టమే రాలుద్ది మరి'. శ్రామిక జన జీవితాన్ని, వారు పడే కష్టాన్ని నగ్నంగా చిత్రించారు కవి.

వర్షాకాలంలో తడి వాతావరణంలో తలుపు చెక్కలు బిగుసుకుపోవడం, నులక మంచాలు బిర్రబిగుసుకుపోవడం లాంటి విషయాలు ఆ రోజుల్లో సర్వసాధారణం. వాటికి మంచి చమత్కారాన్ని జోడిరచి మరీ చెబుతారు రంధి సోమరాజు. కవికి గల పరిశీలనా దృష్టికి మనం ఆశ్చర్యపోక తప్పదు. 'సూరిబాబు తిన్ననైవోడేటి?/ సెయ్యిచ్చుకు నాగితే/ పట్టపగలే సరసమేటని మబ్బురాణి/ సెయ్యిదిలించుకుందేమో/ చటుక్కున/ ఆకాశం మీద ఐదు రంగుల గాజుముక్క రాలింది' ఎంత అందంగా హరివిల్లుని మన మనస్సులో నిలిపారు కవి. ఎంత చక్కటి ఇమేజరీ... సోమరాజు కవిత కేవలం ఇమేజరీ జరీ వస్త్రం!

సోమరాజు గారి 'శీతకట్టు' వర్ణన చదువుతుంటే ఆ అనుభూతి సాంద్రతకు హృదయం చలిగిలితో చిత్రంగా వొణుకుతుంది. 'పొద్దుటేల ఎండ మాసైతుగా వుంటాది/ బెమపడ్డ ఆడదాని ముందే/ కూసిండిపోయినట్టు/ యెండలో సతికిల పడాలనిపిత్తాది' అంటారు చిలిపిగా కవి. సామాన్యమైన అనుభూతికి రొమాంటిక్ టాన్ ఇచ్చి రస రమ్యభావంగా పలికించారు. 'ఏరుసెనక్కాయిలు తింటూ/ సినేమా కట్టాలు సూసి/ కన్నీలెట్టుకునే కుర్రోలకి/ ఈదిలో గేటు ముందల సలిలో కూసోని/ సెనక్కాయలమ్మే ముసిలి ముద్ద/ వొక్కసారీ కల్లల్లోకి రానే దదేటి సిత్రమో' అంటూ మనిషిలోని హిపోక్రసీని ఎండగడుతున్నాడు కవి. 'సలిలో పడవలు లాగేవోళ్లని సూసి/ సలిదేవుడే / సలెత్తిపోనాడు' అంటారు మరో చోట. చలిరాత్రి చీకట్లో ఎగుడుదిగుడు కాలవ గట్లమీద నడిచే పడవవాళ్లని తలచుకుని దిగులు పడుతున్నాడు కవి ఈ రకంగా. ఈ వాక్యాలు చదువుతుంటే పద్మరాజు గారి ప్రసిద్ధి చెందిన 'పడవ ప్రయాణం' కథ గుర్తుకు రాక మానదు. 'అమ్మ కోసి పెట్టిన జున్నుముక్క/ సలికి గడ్డకట్టిన/ సెందురుడ్నా వుంది' ఎంత మధురమైన ఊహ!

చలిరాత్రి బస్సు ప్రయాణం గురించి చెబుతూ కవి ఇలా అంటున్నారు... 'రేత్రి కూసింత దూరం కూడా ఆపడ్డం నేదు/ కంచు కాగడా లేసుకుని బస్సు/ కత్తి మీద సాము సేతున్నట్టు రోడ్డుమీద జాయిగా పడ్వనా పోతోంది'. తెల్లారగట్ట/ గోదాట్లో/ అరటి దొప్పల్లో ఆడోళ్లొదిలిన దివ్వెలు/ సుక్కలకి తల్లి సుక్క లెట్టిన బువ్వులొరే!' దివ్యమైన ఊహ!

రంధి సోమరాజు శీతకట్టు కవిత ఓ కనికట్టు! రసహృదయులపై చలి పిడుగులు కురిపించింది. 'ఏసంగి పొద్దులు' చుర్రుమనిపించే ఎదురెండలా మొదలవుతుంది' 'అదేటో/ దుడ్డు లోనోడి/ యింటి ముందు/ అయిరాన సేసే/ రాకాసి పన్నుల కలకటేరు నా/ యెగదోసుకొత్తాది యెండ' అంటూ ప్రారంభించారు కవి. పేదవాడి ఇంటికి పన్నులు వసూలు చెయ్యడానికి ఊడిపడ్డ బిల్లు కలెక్టర్‌లా కనిపించింది ఎండ కవికి. 'యెండలో బడి/ తోటకూర కాడల్లాంటి కుర్రోలు/ సినేమా బొమ్మాల్ని/ మొయ్యినేక మొయ్యినేక/ సచ్చి యీదీది తిప్పుతా వుంటే/ అందరి కల్లూ ఆ బొమ్మలేపే/ కుర్రలేపు సూసే కన్నే నేదు' అంటారు ఆ బీదపిల్లలపై జాలి చూపుతూ. 'హొరున సినిమా జనం/ ఆల సరదాల్లో ఆలు/ యికిలింతలు సకిలింతలతో/ ఈదులంట ఎల్లిపోతూ/ ఆల నిద్ర ఈల నిద్ర బందిపోటు దొంగల్లా దోసుకుపోనారు/ ఆలకి లేని కునుకు సుకం/ బైటోల కుండగూడదన్నట్టు!' అంటారు. పాత రోజుల్లో ఇళ్లల్లో ఫ్యానులు కూడా అరుదే. వేసవి రాత్రులు జనం వీధుల్లో మంచాలు వేసుకుని నిద్రించేవారు. సెకెండ్ షో చూసి సినిమా జనం ఇళ్లకెడుతూ పెద్ద గొంతుతో మాట్లాడుతూ బయట పడుకున్న వారి నిద్ర చెడగొట్టేవారు. 'కొలిమికాడ తిత్తూదే కుర్రోడు/ సొమ్మసిలిపోనాడు/ 'అమ్మ' అని కూడ అననేదు' గుండె కలుక్కుమనే మాట! 'సెప్పుల్లేకుండా రోడ్డేసేవోల్ని సూసి/ తారుతో కరిగి/ డబ్బాలోంచి సుక్కలు సుక్కలుగా రాలి/ ఏడ్సింది ఎండ' ఎంత గొప్ప ఊహ!


'అయిసు పూటు అమ్ముతూ సిట్టి తండ్రి/ అమ్మ కడుపులో సిచ్చెట్టి/ వొడదెబ్బకు రాలిపోనాడు'. కవి కేవలం చమత్కారాలకే పరిమితం కాకుండా గుండెల్ని పిండే సన్నివేశాల్ని కూడా ఆవిష్కరించారు. ఈ 'యేసంగి పొద్దులు'ని మొదట ఆకాశవాణి విజయవాడ కేంద్రం ప్రసారం చేసింది. దీన్నే ఆ రోజుల్లో హైదరాబాద్ నుంచి వెలువడే సాహిత్య పత్రిక 'వేకువ' ప్రచురించింది.

ఈ కావ్యంలోని కవితని 'నవ కవిత' అని పేర్కొన్నాడు సోమరాజు. భాషను బట్టి, కొత్త తరహా కవితనే భావించాలి. కావ్యం మొత్తం మాండలికంలో సాగింది. ఇదో విశేషంగానే పరిగణించాలి. ఇందులో కవి వాడిన మాండలికం, విశాఖ ప్రాంతానిది అని కొందరు భావిస్తున్నారు. కాని పూర్తిగా విశాఖ ప్రాంతానిది కాదనిపిస్తోంది. రాజమండ్రి ప్రాంతపు మాండలిక ఛాయలు మనకి కనిపిస్తూనే వుంటాయి. కవికి ఈ రెండు ప్రాంతాలతోనూ అనుబంధం వుంది. మాండలిక ప్రభావం వచనంపై వున్నతంగా కవిత్వంపై కనిపించదు. బహుశా కవిత్వ భాషపై వ్యవహారిక భాష కంటే, సాహిత్య అలంకారిక భాష ప్రభావం ఎక్కువ కావడంవల్ల, మాండలికంలో వచ్చిన కవిత్వం తక్కువే. ఈ రీత్యా చూస్తే సోమరాజు కవిత్వ రచనలో కొత్తదారి తొక్కారని చెప్పుకోవచ్చు. దేవరాజు మహారాజు లాంటి కవులు మాండలికంలో కవిత్వ సాధన చేసినా, వీరి సంఖ్య తక్కువే.

ఈ కావ్యాన్ని చదివిన దాశరథి ... 'ఋతువులపై వివిధ భాషల్లో రాసిన కావ్యాల్ని ఎన్నో చదివానని, కాని సోమరాజు 'సొంత గొంతు వినిపించారు, సొంత శక్తి చూపించారు, చెప్పే తీరులో, వాడే భాషలో, చేసే వర్ణనల్లో కట్టే మాట బొమ్మలో సరికొత్తదనం చూపించారు' అని ప్రశంసించారు. మల్లంపల్లి శరభేశ్వర శర్మ అయితే 'ఇది జానపదుల 'ఋతు సంహారం' కాదు కాదు ఈ జాతి జీవనంలో యిది క్రొంగొత్త పొద్దు' అని పరవశించారు. 'కాలాన్ని వర్ణించడం అంటే వాతావరణాన్ని వర్ణించడం కాదు, ఆయా కాలాల్లో ప్రజలు పడే ఆనందాలను, నిరానందాలను ప్రజలు పొందే ఆశలను, నిరాశలను, వెలుగులను, నీడలను వర్ణించాలి' అంటారు సంజీవ్ దేవ్ తన స్పందనలో. ఈ కావ్యాన్ని చదివిన సి. నారాయణరెడ్డి మురిసిపోతూ 'అబ్బో!... ఏమో అనుకున్న సిన్నోడు కాడీ సోమరాజు. పెద్ద కైతైలోడు (కవిత్వాలవాడు) అంటారు. ఈ కావ్యాన్ని చదవడం ముగించాక మనకీ అలాగే అనిపిస్తుంది.

- ఎస్.హనుమంతరావు
88978 15656

# అరేబియా అలల మీద కళింగాంధ్ర కథ





దశాబ్దాల చరిత్ర కలిగిన తెలుగు చలనచిత్ర దర్శకులలో... సామాన్య ప్రజల బాధలను తెరకెక్కించడంలో దర్శకులు క్రిష్‌ది విభిన్న శైలి. అందుకే తాను దర్శకత్వం వహించినవి తక్కువ సినిమాలే అయినా తెలుగు ప్రేక్షకులలో అధిక శాతం మందిని ఆలోచింపచేశాయి. ఆదరణకు నోచుకుంటున్నాయి.

'కొండపొలం' వంటి బహుమతులు గెల్చుకున్న నవలను చిత్రంగా రూపొందించిన క్రిష్ ... తాజాగా ప్రముఖ కథ, నవల, నాటక రచయిత చింతకింది శ్రీనివాసరావు, బహుమతి పొందిన 'మున్నీటి గీతలు' నవల ఆధారంగా 'అరేబియా కడలి' పేరుతో అమెజాన్ ప్రైమ్ ఒటిటిలో వెబ్ సిరీస్‌గా రూపొందించారు.

ఏళ్ళు గడుస్తున్నా, ఎన్నో పరిష్కారం కాని చిన్న చిన్న సమస్యలతో సతమతమవుతోంది ఉత్తరాంధ్ర. అలాంటి ఉత్తరాంధ్రలో కులవృత్తినే నమ్ముకుని ఎన్ని తరాలు గడిచినా, నిరంతర కష్టాల కడలిలో ఈదులాడుతున్న, సామాజిక వర్గం మత్స్యకారులు. తొంభై శాతం మంది ఈనాటికీ చేపల వేటపైనే ఆధారపడుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలకు తరచూ గురవుతూ ప్రాణ నష్టం, ఆర్థిక నష్టాలకు గురవుతున్న ఈ గంగపుత్రులు, ప్రభుత్వపరమైన ఓ నిర్ణయం తీసుకోక ఎన్నో ఏళ్ళుగా ఊహకే భరించలేని కష్టాలనెదుర్కోవడం, అక్షరబద్ధం చేశారు డా॥ చింతకింది.

ఉత్తరాంధ్రలోని ఒకానొక మత్స్యకార జంట గ్రామాల ప్రజలకు ప్రాణప్రదమైన ఫిషింగ్ హార్బరు (జెట్టీ) నిర్మాణం కాక, ఏకంగా పరాయి దేశం జైళ్ళలో ఏళ్ళ తరబడి మగ్గిపోవడం హృదయాలను ద్రవింపజేసే చరిత్ర. దశాబ్దాలుగా ఎందరో శ్రీకాకుళం తీరప్రాంత మత్స్యకారులు సరైన సాంకేతిక పరిజ్ఞానం లేక, విదేశీ జలాల్లోకి ప్రవేశించడం, ఆ దేశపు నేవీ అధికారుల చేతికి చిక్కడం, అక్కడి జైళ్ళలో కఠిన శిక్షలు అనుభవించడం చర్వితచరణంగా సాగుతోన్న చరిత్ర. కొన్ని సందర్భాల్లో రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు స్పందించడం, అక్కడ జైలుశిక్షలనుభవిస్తున్న మత్స్యకారులను, స్వదేశానికి రప్పించడం జరుగుతోంది. ఈలోగా ఆ మత్స్యకారుల కుటుంబీకుల వ్యథల గాథలు వర్ణనాతీతం.

ఉత్తరాంధ్ర సాహిత్య చరిత్రలో తొలిసారి ఈ దయనీయమైన పరిస్థితిని మొత్తం పరిశీలించి, పరిశ్రమించి నవలగా రూపొందించిన చింతకింది శ్రీనివాసరావు కృషి సఫలీకృతమైంది. అగ్రరాజ్యంలోని తెలుగువారి సాంస్కృతిక సంస్థ 'తానా' తాను నిర్వహించిన నవలల పోటీలో సముచితంగా సత్కరించి గౌరవించింది. బంగారానికి తావి అబ్బినట్లు, ఆ నవల సామాజిక చింతనతో, సాహిత్య స్పృహతో, చిత్రాలను రూపొందించడంలో పేరు ప్రతిష్ఠలున్న 'క్రిష్' దృష్టి ఆ కథనంపై పడింది. చింతకింది శ్రీనివాసరావు ఆలోచనలు, ఆవేదన తెరమీద గొప్ప వెబ్ సిరీస్‌గా నిలిచింది.

భద్రపట్నం జిల్లా సముద్రతీరంలో, రెండు మత్స్యకార గ్రామాలకు చెందిన 13 మంది మత్స్యకారులు గుజరాత్ శేట్‌ల ద్వారా వేటకు ప్రయాణం కావడంతో చిత్రం ప్రారంభమవుతుంది. శేట్‌లకు, మత్స్యకారులకు మధ్య ఒక బ్రోకర్ మత్స్యకారుల నేతలని చెప్పుకుంటూ వారి అమాయకత్వాన్ని దోచుకునే ఒక కుల సంఘం నాయకుడు యథావిధిగా వుంటాడు. అదృష్టమయినా, ఆపదయినా ఎంత తొందరగా మనకు తెలియకుండా మన జీవితాలలో సంభవిస్తాయో... అన్నట్లు, సినిమా ప్రారంభమే... మత్స్యకారులు ఎన్నో కష్టాలకోర్చి (24 గంటలు లారీలో ప్రయాణం) శేట్‌లను కలుసుకుని, రెండు బోట్లు సంపాదించి వేటకు బయలుదేరతారు. చాలా తొందరగా తమ పని పూర్తి చేసుకోవాలనుకునే తాపత్రయంలో వుండగా, తుఫానులో చిక్కుకుని విదేశీ సముద్రపు జలాల్లోకి వెళ్ళిపోతారు. పరాయిదేశం నావికులకు దొరికిపోయి అక్కడి మాందీ జైలులోకి చేర్చబడతారు. అక్కడినుండి వారి కష్టాలు, పాకిస్తాన్ మాందీ జైలు అధికారుల దాష్టీకం... నిజానికి వర్తమాన కాలంలో పాకిస్తాన్‌లోని నేటివిటీని చూడగలగడం ప్రేక్షకుడికి గొప్ప అనుభూతినిస్తుంది. ఆ సైనిక పాలన దేశంలో మానవ హక్కుల సంఘం కృషి, ఇక్కడ దేశంలో నాయిక (మత్స్యకార యువతి) చేసిన పోరాటం... పాకిస్తాన్‌లోని, భారత హై కమీషన్ కార్యాలయాధికారులు చేసే ప్రయత్నాలు, సోషల్ మీడియా సహకారంతో, గంగ ఆవేదనకు దేశ ప్రజల మద్దతు, చివరికి కేంద్ర ప్రభుత్వం స్పందించి, ఆ దేశంతో సంప్రదింపుల ఒత్తిడి తేవడం, దాంతో భద్రపట్నం తీరంలో జెట్టీ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించడంతో కథ సుఖాంతమవుతుంది.

ఆ గ్రామ మత్స్యకార యువకులలో చదువుకున్న, హిందీ భాష తెలిసిన నాయకుడు (బద్రి) గంగల ప్రేమ గెలుస్తుంది. ప్రతి ఫ్రేములోనూ తను ప్రతిభ ప్రతిబింబించేలా వెబ్ సిరీస్‌ను, షో రన్నర్‌గా రూపొందించిన జాగర్లమూడి క్రిష్, దర్శకులు వి.వి.సూర్య కుమార్ అభినందనీయులు. ఈ వెబ్ సిరీస్‌కు కథ, మాటలు, స్క్రీన్ ప్లే అందించిన చింతకింది శ్రీనివాసరావు కీలకమైన, ముఖలింగం పాత్ర సమర్థవంతంగా పోషించడం విశేషం. రచయితే నటుడైతే, తెరపై పండుతుందని మరోసారి ఋజువైంది.

**ముక్తాయింపు :** 80వ దశకంలో, తమిళనాడులో నీటి సమస్య గురించి, మహా దర్శకుడు కె. బాలచందర్ 'తన్నీర్ తన్నీర్' తమిళ చిత్రాన్ని నిర్మించారు. అది ఆ రాష్ట్ర ప్రజలలో పెద్ద సంచలనం కలిగించింది. దానికి భయపడిన ఆనాటి తమిళనాడు ప్రభుత్వం, రాష్ట్రంలో నీటి కొరత తీర్చడానికి, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి, ఓ డాక్యుమెంటరీని ఆ చిత్రం ప్రదర్శించే అన్ని థియేటర్లలో ప్రదర్శిస్తుండేది. అలాగే ఈ 'అరేబియా కడలి' చూసైనా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు శ్రీకాకుళం తీరంలో జెట్టీ నిర్మించాలని ఆశించడం అత్యాశ కాదేమో!

- బి.వి.అప్పారావు,
93470 39294

## రాయలసీమ దీర్ఘ కవితల పోటీ

రాయలసీమ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ప్రతి ఏడాది విభిన్న సాహిత్య ప్రక్రియలలో పోటీలు నిర్వహిస్తున్నాం. ఈ ఏడాదిన రాయలసీమ దీర్ఘ కవితల పోటీ శ్రీ తిమ్మాపురం బాలకష్టారెడ్డి గారి స్మారకంగా నిర్వహిస్తున్నాం. రాయలసీమ నేపథ్యంగా, దీర్ఘ కవితా లక్షణాలతో నవంబర్ 1 లోపు కవితలను పంపాలి. మరిన్ని వివరాలకు 99639 17187కు సంప్రదించవొచ్చు. న్యాయనిర్ణేతల నిర్ణయం మేరకు మొత్తంగా రూ.15 వేల నగదు బహుమతులుగా అందచేస్తాం. వివరాలకు : డా.అప్పిరెడ్డి హరినాథరెడ్డి, రాయలసీమ సాంస్కృతిక వేదిక, అనంతపురము. మొబైల్ : 9963 917187.

- రాయలసీమ సాంస్కృతిక వేదిక

## 25న 'తలపుల పుటలు' ఆవిష్కరణ


కరీంనగర్ ఫిలిం భవన్‌లో ఈ నెల 25న సోమవారం సాయంత్రం బూర్ల వెంకటేశ్వర్లు కవితా సంపుటి 'తలపుల పుటలు' పుస్తక ఆవిష్కరణ సభ జరుగబోతున్నది. సభకు సి.వి.కుమార్ అధ్యక్షత వహిస్తారు. ముఖ్య అతిథిగా అన్నవరం దేవేందర్ హాజరవుతారు. నగునూరి శేఖర్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. తోట నిర్మలా రాణి పుస్తకాన్ని పరిచయం చేస్తారు. అతిథులుగా కొండి మల్లారెడ్డి, కల్వకుంట్ల రామకష్ణ, కందుకూరి అంజయ్య తదితరులు పాల్గొంటారు.

- సి.వి కుమార్, తెరవే, కరీంనగర్.

## 31న 'సాక్ష్యం' కవిత్వ సంపుటి ఆవిష్కరణ

ఫ్రీవర్స్ ఫ్రంట్ ప్రచురించిన దొంతం చరణ్ 'సాక్ష్యం' కవిత్వ సంపుటి ఆవిష్కరణ ఆగస్టు 31న హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఉదయం 10 గంటలకి జరుగుతుంది. ప్రొఫెసర్ జి.హరగోపాల్, శ్రీరాం పుప్పాల, లావణ్య తీగల పాల్గొంటారు. ఇది ఫ్రీవర్స్ ఫ్రంట్ ప్రచురణ.

# టీటీపిట్ట మేలుకొలుపు





జీవిత విమర్శనమే కవిత్వం (poetry is the criticism of life) అన్నాడు ఆర్నాల్డ్. కవిత్వమంటే భావనావ్యక్తీకరణే అని షెల్లీ మహనీయుడు నిర్వచించాడు. కవిత్వం లయాత్మకమైన భావన అని కార్లైల్ నిర్వచించాడు. ఈ నిర్వచనాల పరిధిని దాటి అనిర్వచనీయ అనుభూతుల్ని అసంకల్పితంగా, అలవోకగా కాలానికి నిలబడిన కవిత్వాన్ని రసాత్మకంగా చెక్కారు మన ఎల్.ఎన్.కొల్లి తన 'టీటీ పిట్ట' కవితా సంపుటిలో. గత మూడు దశాబ్దాలుగా పుంఖానుపుంఖాలుగా అనేక అంశాలను స్పృశించి ఆంగ్ల కవిత్వాన్ని ఒంటపట్టించుకున్న కొల్లి గారు మాతృభాషలోనూ అదే మాధుర్యాన్ని అలతి అలతి పదాలతోనే అనల్పార్థాన్ని కలికి చిలుక జోస్యంలా పదచిత్రాలతో పాఠకుడికి చూపించారు.

**'వాన నాలోని ఖాళీని నింపేస్తుంది**
**దాని లయ నా హృదయాన్ని కదిలించే గీతమవుతుంది'–**

అని తన భావుకతను వ్యక్తం చేయడంలో ఎంతటి అమూర్త భావననైనా మూర్తంగా పాఠకుని ముందుంచడంలో కొల్లి గారి అభివ్యక్తి, రసవిద్య మనకు ద్యోతకమౌతుంది. దీనినే టి.ఎస్.ఇలియట్ (TS Eliot) మహాశయుడు ఆబ్జెక్టివ్ కొరిలేటివ్ (objective correlative) అని అన్నారు.ఒక రచయిత భావనా పటిమను తెలిపే కొలమానంగా దీనిని తీసుకోవచ్చు. ఈ కవితా సంపుటిలో 55 మేలుకొలుపులు ఉన్నాయి .ప్రతి మేలుకొలుపూ వాస్తవాలను గుండెల్లోకి సూటిగా దింపినట్లు పాఠకున్ని ఆసాంతం ఏకబిగిన చదివేటట్లు చేస్తుంది. 'స్మృతుల యాత్ర' అన్న కవితా ఖండికలో–

**నేనిప్పుడు /**
**నా అడుగు జాడల్ని వెదుకుతున్నాను/**
**నా ఉనికి ముద్రల్ని గాలిస్తున్నాను/**
**నన్ను నా దోసిట్లోకి పిలుచుకుంటున్నాను/**
**నాకు నేను దొరికిన తర్వాత /**

నా స్మృతుల యాత్ర మళ్లీ మొదలౌతుంది' – అని చెప్పడంలో ఇతనో నిత్య కృషీవలుడని, జీవితం కవిత్వం వేరు కాదని అంతః పరీక్షణతోనే వాక్యాన్ని సానబట్టు కోవాలని పరోక్షంగా చెబుతారు. ఇది కలికాలం, నిదురలేని మనసు, వాయనాడ్ విధ్వంసం లాంటి కవితా ఖండికల్లో వైవిధ్యభరితమైన ఇతివృత్తాలను ఎంచుకొని ఎన్నో ఇరుకలోతుల్ని ఎత్తిచూపడంలో లెక్కకు మిక్కిలి అక్షర తూటాలు సంధించి పాఠకునిలో, సమాజంలో పరివర్తనాన్ని ఆకాంక్షించారు. ఈ భావననే అరిస్టాటిల్ కెథార్సిస్ (catharsis) అని అన్నారు. హృదయాంతరాల నుంచి పెల్లుబికిన ముడి భావోద్వేగాల మూట ఓ గతిశీలక సంభాషణలా తన భావనా బలంతో ఎంతో హృద్యంగా చెక్కారు.

**"డిజిటల్ ప్రపంచంలో/**
**లైక్స్‌తో ముడిపడే అనుబంధాలు/**
**సాంకేతికత వెలుగులో కూడా/**

మన హృదయాలు చీకట్లో జోగుతున్నాయి'– అని పలకడంలో నేటి సమాజపు డొల్లతనం, మనుషుల మధ్యనున్న మిథ్యా అనుబంధాలను ఎండగట్టడంలో కవికి వర్తమాన అంశాలపైనున్న ఎరుకను తెలియజేస్తాయి. ప్రముఖ విమర్శకుడు IA Richards తన Reader Response Theory లో ఇలా పేర్కొన్నాడు : "కవి తన మనోసంద్రంలో చలనశీలతతో కదులుతున్న భావ కెరటాలు పాఠకుని మదిలో కూడా కదలించి పాఠకులు తనదైన రీతిలో పదయదలను అర్థం చేసుకొనేటట్లు చేసి తమ జీవిత సంఘటనలను సైతం ఆపాదించుకొని తన్మయత్వం చెందేటట్లు చేయడంలో కవి యొక్క భావ బలం ద్యోతకమౌతుంది" దీనికి 'గుండె చప్పుళ్లు' కవితలో సుస్పష్టం చేసారు.

**నడి వయసులో చప్పుళ్లు**
**బాధ్యతల మధ్య**
**ఒదిగి కొన్ని ..ఒరిగి కొన్ని**
**రాత్రి మౌనంలో**
**తప్పిన స్వప్నాలు మళ్లీ పలుకుతాయి..**

"నా నషిః కురుతే కావ్యం" అన్నారు మన అలంకారికులు అంటే ఋషికాని వాడు కవి కాలేడు. సమాజాన్ని తీక్షణంగా దర్శించి దానిలోనున్న లోటుపాట్లపై ప్రశ్నల విల్లెక్కుపెట్టడమే కాదు, పరిష్కారాలు అన్వేషించే క్రమంలో, తన భావాలకు ఊపిరి పోయడానికి ఎన్నో పురిటినొప్పులు అనుభవించి ఉంటాడు.

**మరో ప్రపంచం దారుల నిండా/**
**బారులు తీరిన డొల్ల బతుకులు/**
**ఇది మరో ప్రపంచం /**
**మర్మ ప్రపంచం /**
**మృత బంధాల ప్రపంచం/**
**మరణ మృదంగాల ప్రతిధ్వనులు/**

మానవ మృగాల వికత చేష్టలు" అని పలకడానికి కవి పడిన వేదన మనకి కళ్లకు కట్టినట్లు వివరించారు. Writing poetry is not everybody's cup of coffee. కవిత్వం అందరికీ ఒంటబట్టదు. ఇది హృదయ స్పర్శతో, సాధనతో అబ్బే విద్య. ఐతే కవి తన మనసులోని భావ పరంపర వ్యక్తీకరణలో పడే తపన, ప్రతి అక్షరం పాఠకుని మదిలో శిలాక్షరమై నిలిపేందుకు తన కృషి, తన కవితా శైలి అజరామరమై ఉండేందుకు తన అభ్యాసం, సమాజంపై తనకున్న ధోరణి కవి యొక్క నిబద్ధతను తెలియజేస్తాయి.

**"నా నవ్వు నేను నవ్వి**
**స్వచ్ఛమైన నిఖార్సైన**

అసలు సిసలైన నవ్వు నవ్వి/ ఎన్నాళ్లైందో" అన్న పంక్తులే వీటికి తార్కాణం. ఏ రచయితైనా తన చుట్టూ ఉన్న సంస్కృతి సంప్రదాయాలను, కొన్ని మాండలికాలను అప్రయత్నంగానే ఆకళింపు చేసుకుంటాడు. వాస్తవానికి ఈ మాండలికాలే భాషకు జీవగర్ర. ఉత్తరాంధ్ర మాండలిక పదాలతో స్థానిక మహిళలు గురించి ఇలా వర్ణించారు :

**పారమ్మకు తోడుగా గైరమ్మ/**
**అడ్డుగుండారుతో/**
**నీలమ్మ వెన్నంటే దాలమ్మ/**
**మెట్ట ముడేసుకుంటూ"**

కొల్లి వారి కవితా మల్లెతోటలోని భావ పరిమళాన్ని పదాల సుకుమారాన్ని ఆసాంతం ఆఘ్రాణించాలంటే, ఈ 'టీటీ పిట్ట' కవితా సంపుటిని ప్రతి ఒక్కరూ తప్పక చదవాల్సిందే!

- తలగాపు ధనుంజయ రావు
70362 29121



## ప్రకాశం బ్యారేజీకి కొనసాగుతున్న వరద ప్రవాహం

**ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి**

కృష్ణా పరివాహక ప్రాంతంలో జలాశయాలకు వరద ప్రవాహం ఆదివారం కొనసాగింది. ప్రకాశం బ్యారేజీకి ఎగువ నుంచి 3.93 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి దిగువకు 4.72 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. నాగార్జున సాగర్‌కు 4.17 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తుండగా వచ్చిన ప్రాజెక్టు ఉన్న 26 గేట్లను ఎత్తి 4.17 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల విడుదల చేస్తున్నారు. పులిచింతలకు ఎగువ నుంచి 3.92 లక్షల క్యూసెక్కులు వస్తుండగా దిగువకు 3.32 లక్షల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. పులిచింతల నుంచి వచ్చే ప్రవాహంతో పాటు ఖమ్మం, కృష్ణా జిల్లాల నుంచి వచ్చే వరద నీటితో కలిపి ప్రకాశం బ్యారేజీకి 3.93 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.

## శిల్పారామంలో అలరించిన నృత్య ప్రదర్శనలు

**ప్రజాశక్తి - పుట్టపర్తి**

పట్టణ శివారులోని శిల్పారామంలో వారాంతపు సెలవుల్లో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఆదివారం ఆకట్టుకున్నాయని శిల్పారామం ఏఓ భాదర్‌వలి తెలిపారు. శిల్పారామంలో ఆదివారం తమిళనాడుకు చెందిన కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను అలరించాయన్నారు. గురువు హేమామాలిని రామమోహన్ ఆధ్వర్యంలో నాట్య కళాకారులు కూచిపూడి, భరతనాట్యంతో పాటు పలు పాటలకు నృత్యాలు చేశారని తెలిపారు. శిల్పారామం సంస్కృతి, సంప్రదాయాలకు నిలయం అన్నారు. పండగ రోజుల్లోనే కాకుండా వారాంతపు సెలవుల్లో కూడా ప్రజలకు ఆటవిడుపుగా వివిధ కళాకారుల చేత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాకారులు తమ ప్రతిభను చాటుకోవడానికి శిల్పారామం వేదికగా మారడం సంతోషంగా ఉందన్నారు.

# ఎరువులు అందించడంలో ప్రభుత్వం విఫలం

- ఏపి రైతు సంఘం

**ప్రజాశక్తి–అమరావతి బ్యూరో**

ఖరీఫ్ సీజన్‌కు సరిపడా ఎరువులను సిద్ధం చేసుకుని, ప్రణాళికా బద్ధంగా వాటిని రైతులకు అందించడంలో ప్రభుత్వ వర్గాలను ఏపి రైతు సంఘం తీవ్రంగా ఖండించింది. ఈమేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ఎం సూర్యనారాయణ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వర్షాల కారణంగా లక్షలాది ఎకరాల్లో పంట ముంపునకు గురవ్వగా, 14 జిల్లాల్లో బూస్టర్ డోస్‌గా వేసేందుకు వేసే నీట మునిగిన పంటను కాపాడుకునేందుకు రైతులు ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎరువుల కోసం రైతులు పిఎసిఎస్‌ల వద్ద, రైతు సేవ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారని, అయితే అక్కడ నో స్టాక్ బోర్డులే దర్శనమిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేటు వ్యాపారులు కట్టకు రూ.100 నుంచి రూ.200 అధిక ధరలకు విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ సాగు లక్ష్యం 85.25 లక్షల ఎకరాలని, అందుకు అవసరమైన 16.78 లక్షల టన్నుల ఎరువులను సిద్ధం చేయాల్సి ఉన్నా, రాష్ట్ర ప్రభుత్వం ఆ పని చేయలేదన్నారు. కేంద్రం యూరియా వినియోగం 10 శాతం తగ్గించాలని చెబుతూ రాష్ట్రానికి రావాల్సిన యూరియాలో కోత పెట్టగా, రాష్ట్ర ప్రభుత్వం మిన్నకుండిపోయింది తప్ప కేంద్రంపై ఒత్తిడి చేయలేదన్నారు. దీంతో ఎరువుల కొరత ఏర్పడిందని పేర్కొన్నారు.

### ఎత్తిపోతల పథకాలు ప్రైవేటుకు అప్పగించొద్దు

రాష్ట్రంలోని ఎత్తిపోతల పథకాలను ప్రైవేటు చేయాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని ఏపి రైతు సంఘం డిమాండ్ చేసింది. రాష్ట్రంలో 8 లక్షల ఎకరాలకుపైగా సాగునీరందిస్తున్న 999 ఎత్తిపోతల పథకాల నిర్వహణ ఖర్చులు, విద్యుత్ ఛార్జీలు ఉమ్మడి రాష్ట్రం నాటి నుంచి రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తున్నాయని మరో ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే పల్నాడు జిల్లాలో ఈ లిఫ్టులను ప్రైవేటు వ్యక్తులు నిర్వహిస్తూ మిర్చికి ఎకరాకు రూ.5 వేలు, పత్తి తదుపరుకు రూ.4 వేలు, శనగ, మొక్కజొన్నకు రూ.2 వేలు రైతుల నుంచి వసూలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ విధంగా రైతుల నెత్తిన భారం వేయాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని, లేదంటే రైతాంగం ఐక్యంగా ఉద్యమించాల్సి వస్తుందని పేర్కొన్నారు.

# సెల్ఫీ దిగుతూ లోయలోకి..

- తీవ్ర గాయాలతో ఆసుపత్రిపాలైన తమిళనాడు వాసి

**ప్రజాశక్తి- పెనుకొండ**

కొండపై ఓ వ్యక్తి సెల్ఫీ తీసుకుంటూ ప్రమాదవశాత్తు లోయలో జారిపడి తీవ్ర గాయాల పాలైన సంఘటన పెనుకొండలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తమిళనాడులోని చెన్నైకి చెందిన విగ్నేష్... సోమందేపల్లి మండలం గుడిపల్లి సమీపంలో ఉన్న డోంగా హ్వాసుంగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో ఐటి విభాగంలో పని చేస్తున్నారు. స్నేహితుడితో కలసి పెనుకొండ కొండపై ఉన్న పకతి అందాలను తిలకించేందుకు ఆదివారం వచ్చారు. ఈ క్రమంలో సెల్ఫీ తీసుకునేందుకు కొండ లోయ వద్దకు వెళ్లారు. ప్రమాదవశాత్తు కాలు జారి లోయలో పడ్డారు. ఆయనతోపాటు ఉన్న స్నేహితుడు అగ్నిమాపక ఎస్‌ఐ వెంకటేషులకు సమాచారం అందించారు. ప్రమాదం జరిగిన లొకేషన్‌ను వారికి పంపారు. అగ్నిమాపక ఎస్‌ఐ తన సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి తీవ్ర గాయాలపాలైన విగ్నేష్‌ను తాళ్ల సహాయంతో లోయలో నుంచిపైకి చేర్చారు. 108 వాహనంలో పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కాలు, చేయి విరిగి తీవ్ర రక్తస్రావం కావడంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రుడిని అనంతపురానికి తరలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ సెల్ఫీ పిచ్చితో ప్రాణాలు మీదికి తెచ్చుకుంటున్నారని, కొండ చివరకు వెళ్లే సమయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. లోయలో పడడంతో పైకి తీసుకు రావడానికి చాలా ఇబ్బంది పడ్డామన్నారు. స్ట్రక్చర్ లేకపోవడంతో బాధితున్ని తాళ్ల పైనే లోయలోనుంచి బయటకు తీసుకొచ్చామని చెప్పారు. కొండపైన ప్రకృతి అందాలు తిలకించేందుకు వచ్చేవారు జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు.

# 'గేట్' రిజిస్ట్రేషన్ తేదీల్లో మార్పు

**న్యూఢిల్లీ :** దేశంలో ఐఐటిసహా పలు విద్యా సంస్థల్లో ఎంటెక్, పిహెచ్‌డి కోర్సుల్లో ప్రవేశించేందుకు నిర్వహించే గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్ (GATE 2026) పరీక్షకు సంబంధించిన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ల తేదీల్లో మార్పులు చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. నోటిఫికేషన్ ప్రకారం.. ఈ నెల 25 నుండి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉంది. ఈ నెల 28 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఐఐటి గువాహటి ఓ ప్రకటనలో తెలిపింది. ఈ మేరకు బుక్‌లెట్‌లోనూ మార్పులు చేసినట్లు పేర్కొంది. ఆలస్య రుసుంతో అక్టోబర్ 9 వరకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. దరఖాస్తు కోసం ఒక్కో టెస్ట్ పేపర్‌కు మహిళలు/ ఎస్‌సి /ఎస్‌టి/ విభిన్న ప్రతిభావంతులైతే వెయ్యి రూపాయలు, ఇతర కేటగిరీలు, విదేశీ విద్యార్థులు రూ.2000 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది. కేటగిరీ, టెస్ట్ పేపర్, ఎగ్జామ్ సిటీ మార్పు, కొత్త టెస్ట్‌పేపర్ జతచేసుకోవడం, వ్యక్తిగత వివరాలను మార్చుకొనేందుకు అదనపు ఫీజుతో నవంబర్ 6వరకు గడువు ఇస్తున్నట్లు తెలిపింది. అడ్మిట్ కార్డులను జనవరి 2న విడుదల చేయనున్నారు.

వచ్చే ఏడాది ఫిబ్రవరి 7, 8, 14, 15 తేదీల్లో (శని, ఆదివారాల్లో) దేశ వ్యాప్తంగా పలు నగరాల్లో ఈ కంప్యూటర్ ఆధారిత పరీక్షను నిర్వహించనున్నారు. ఫలితాలు మార్చి 19న విడుదల చేయనున్నారు. స్కోర్ కార్డులను మార్చి 27 నుంచి మే 31వరకు ఉచితంగా అందుబాటులో ఉంచుతారు. బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులూ ఈ పరీక్ష రాసేందుకు అర్హులే. అందువల్ల, దరఖాస్తు చేసే ముందు అభ్యర్థులు ఈ పరీక్షకు అర్హతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నారో, లేదో గేట్ అధికారిక వెబ్‌సైట్‌లో నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. ఒక అభ్యర్థి ఒక దరఖాస్తు మాత్రమే చేయాలి. ఒకవేళ రెండు పేపర్లు రాయాలనుకుంటే.. ఒకే ఫారమ్‌లో దాన్ని పేర్కొనాల్సి ఉంటుంది. ఒకటికంటే ఎక్కువ దరఖాస్తులు సమర్పిస్తే తిరస్కరిస్తారు. వాటికి చెల్లించిన ఫీజును రిఫండ్ చేయరు. గేట్ స్కోర్‌ను కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాలకు సైతం పరిగణనలోకి తీసుకుంటారు. ఐఐటీలు గేట్ స్కోర్‌తో నేరుగా పీహెచ్‌డీలో కూడా ప్రవేశాలు కల్పిస్తున్నాయి.

## ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

**ప్రజాశక్తి- విజయనగరం కోట**

విజయనగరంలోని ఎరువుల దుకాణాలపై ఆదివారం విజిలెన్సు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఎరువుల నిల్వలు అధికంగా ఉండడంతో సుమారు రూ.2,70,000 విలువైన ఎరువులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి సింహాచలం మాట్లాడుతూ ఎరువుల అమ్మకాల్లో ఎవరైనా అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ దాడుల్లో ఎడిఎ నాగభూషణరావు, ఎఒ శ్రీనివాస్, ఎఇఒ సుధాకర్ పాల్గొన్నారు. జిల్లాలో ఎరువుల కొరతతో రైతులు ఇబ్బందులు పడడం, ఎరువులతో పాటు వ్యాపారులు పురుగుమందులను కొనాలని షరతు పెట్టడంతో అధికారులు ఈ దాడులు నిర్వహించారు.



# అప్పుల బాధతో ఉద్యోగి ఆత్మహత్య

**ప్రజాశక్తి- రామభద్రపురం (విజయనగరం జిల్లా)**

అప్పుల బాధతో విజయనగరం జిల్లా రామభద్రపురం మండలం దుప్పలపూడి గ్రామానికి చెందిన ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన ప్రకారం... శీర రాఘవ (29) అనే యువకుడు మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం చినగొడభ గ్రామంలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. విలాసవంతమైన జీవితానికి అలవాటు పడి అధిక ఖర్చులు చేస్తుండడంతో అప్పులు పాలయ్యారు. స్వగ్రామానికి వచ్చి జీవితంపై విరక్తి కలిగి శనివారం పాత ఇంట్లో పురుగులు మందు తాగారు. గమనించిన కుటుంబ సభ్యులు ఆరికతోట పిహెచ్‌సికి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం బాడంగి, అక్కడి నుంచి మెరుగైన వైద్య సేవల కోసం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. తండ్రి ఈశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ప్రసాదరావు తెలిపారు.

## 26న విశాఖకు కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

**ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ (విశాఖ)**

కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఈ నెల 26న విశాఖ రానున్నారు. ఈ మేరకు ఆయన పర్యటన వివరాలను అధికారులు ఆదివారం సాయంత్రం వెల్లడించారు. 26వ తేదీ ఉదయం 10.15 గంటలకు ఢిల్లీలోని పాలం ఎయిర్‌పోర్టు నుండి బయలుదేరి 12.30 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 12.35 గంటలకు బయలుదేరి 12.55 గంటలకు నావెల్‌బేస్‌లోని ఐఎన్‌ఎస్ చోళసూట్‌కు వస్తారు.



## సినీ పరిశ్రమకు పూర్తి సహకారం : సిఎం రేవంత్

**ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో**

ప్రభుత్వం నుంచి సినిమా పరిశ్రమకు పూర్తి సహకారం ఉంటుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో ఆదివారం పలువురు సినీ నిర్మాతలు, దర్శకులు కలిశారు. కార్మికుల సమ్మె పరిష్కారానికి సహకరించిన సిఎంకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. 'సినిమా పరిశ్రమలో పని వాతావరణం బాగుండాలి. త్వరలో సినీ కార్మికులను కూడా పిలిచి మాట్లాడతా. పరిశ్రమలోకి కొత్తగా వచ్చే వారికి నైపుణ్యాలు పెంచేలా చర్యలు తీసుకోవాలి. నైపుణ్యాల పెంపు కోసం కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది. స్కిల్ యూనివర్సిటీలో సినీ పరిశ్రమ కోసం కావాల్సిన ఏర్పాట్లు చేస్తాం. పరిశ్రమలో వివాదం వద్దుఅనే కార్మికుల సమ్మె విరమణకు చొరవ చూపించాను' అని అన్నారు. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్ రాజు, నిర్మాతలు అల్లు అరవింద్, డి.సురేష్ బాబు, జెమిని కిరణ్, స్రవంతి కిషోర్, నవీన్ ఎర్నేని, వంశీ, బాపినీడు, డీవీవీ దానయ్య, చెరుకూరి సుధాకర్, సాహు, అభిషేక్ అగర్వాల్, విశ్వప్రసాద్, అనిల్ సుంకర, శరత్ మరార్, ఎస్వీప్రసాద్, దర్శకులు త్రివిక్రమ్ శ్రీనివాస్, బోయపాటి శ్రీను, సందీప్‌రెడ్డి వంగా, వంశీ పైడిపల్లి, అనిల్ రావిపూడి, వెంకీ కుడుముల తదితరులు ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

## పొట్టేలు పందేలపై దాడి

**ప్రజాశక్తి- బొబ్బిలి (విజయనగరం జిల్లా)**

విజయనగరం జిల్లా బొబ్బిలి మండలంలోని పాతపెంట గ్రామ శివారులలో కొంతమంది వ్యక్తులు పొట్టేలు పందేలు ఆడుతున్నట్లు వచ్చిన సమాచారంపై సిఐ కె.సతీష్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్‌ఐలు, సిబ్బంది దాడులు నిర్వహించారు. పది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రెండు గొర్రె పోతులను, రూ.2116 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు



## నిర్వాసితుల ధ్రువీకరణ పత్రాలపై సమీక్ష

**ప్రజాశక్తి- చింతూరు (అల్లూరి జిల్లా)**

పోలవరం నిర్వాసితుల ఆర్‌అండ్‌ఆర్ గ్రామసభ ఆదివారం పాత ప్రభుత్వాస్పత్రి ఆవరణలో నిర్వహించారు. సుమారు 800 కుటుంబాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు లేనందున పెండింగ్ జాబితాను అధికారులు నిర్వాసితులకు చదివి వినిపించారు. పాతరేషన్ కార్డులు, ఓటర్ ఐడి కార్డులు, మ్యారేజ్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డులు, ఇంటి పన్నులు తదితర వివరాలను నిర్వాసితుల నుండి అధికారులు కోరారు. సభకు రంపచోడవరం ఇంఛార్జ్ సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్ హాజరయ్యారు. ప్రజల సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. బృందాల వారీగా అధికారులను ఆయా పోలవరం నిర్వాసిత కుటుంబాలకు సంబంధించిన ధ్రువపత్రాల సేకరణకు నియమించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సుండం శ్రీనివాస్ దొర, విఆర్ఓ రామచంద్రరావు, ఆర్‌అండ్ ఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

## సనాపై ఇజ్రాయిల్ దాడులు

- ఇద్దరు మృతి, ఐదుగురికి గాయాలు

**సనా :** యెమెన్ రాజధాని సనాపై ఇజ్రాయిల్ ఆదివారం దాడులకు తెగబడింది. ఈ దాడుల్లో ఇద్దరు మరణించగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. రెండు రోజుల క్రితం హౌతీ ఉగ్రవాదులు ఇజ్రాయిల్ వైపు క్షిపణులు ప్రయోగించినందుకు ప్రతిగా ఈ దాడులు చేసినట్లు ఇజ్రాయిల్ సైన్యం ధ్రువీకరించింది. అధ్యక్ష భవనం ఉన్న సైనిక ప్రాంగణం, రెండు విద్యుత్ ప్లాంట్లు, ఇంధన నిల్వ స్థలం లక్ష్యంగా ఈ దాడులు జరిపినట్లు తెలిపింది. ఇజ్రాయిల్ దాడులపై హౌతీ తీవ్రంగా స్పందించింది. ఇజ్రాయిల్ ఎన్ని దాడులు చేసినా గాజాలోని పాలస్తీనియన్లకు హౌతీలు సంఘీభావంగానే ఉంటారని హౌతీల సీనియర్ అధికారి అబ్దుల్ ఖాదర్ అల్ ముర్తదా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ఇజ్రాయిల్ తెలుసుకోవాలని స్పష్టం చేశారు.

## ఓటర్ల పత్రాలు సమర్పించిన 98.2 శాతం మంది

- ఆధార్ ఒక్కటే చెల్లుబాటు కాదంటూ బిజెపి అడ్డగోలు వాదనలు

**న్యూఢిల్లీ :** బీహార్‌లో 98.2శాతం మంది కంటే ఎక్కువమంది ఓటర్లు అవసరమైన పత్రాలను సమర్పించినట్లు భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) ఆదివారం తెలిపింది. ఇక ఎనిమిది రోజుల వ్యవధి మాత్రమే మిగిలి ఉందని వెల్లడించింది. ఓటర్ల ముసాయిదా జాబితాలో తప్పులను సరిదిద్దడమే కాకుండా, వారి గణన ఫారమ్‌లతోపాటు అవసరమైన పత్రాలను కూడా సమర్పించవచ్చని తెలిపింది. బీహార్ సిఇఒ కార్యాలయం సమాచారం ప్రకారం.. జూన్ 24 నుండి ఆగస్ట్ 24 వరకు, 60 రోజుల్లో 98.2శాతం మంది తమ పత్రాలను సమర్పించినట్లు తెలిపింది. రోజుకు సగటున 1.64 శాతం పత్రాలు సమర్పించారని, ఇంకా ఎనిమిదిరోజులు ఉన్నాయని పేర్కొంది. 7.24 కోట్ల మంది ఓటర్లలో 1.8 శాతం ఓటర్లు మాత్రమే పత్రాలను సమర్పించాల్సి ఉందని తెలిపింది. బీహార్‌లో ముసాయిదా ఓటర్ల జాబితాలో తమ పేర్లు లేనివారు వాటిని చేర్చాలని కోరుతూ ఆన్‌లైన్ ద్వారా కూడా దరఖాస్తులు అందజేయవచ్చని సుప్రీంకోర్టు పేర్కొంది. వ్యక్తిగతంగా దరఖాస్తులు అందజేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఆ దరఖాస్తుతోపాటు ఎన్నికల కమిషన్ పేర్కొన్న 11 పత్రాల్లో ఏ ఒక్కదాన్నైనా లేదా ఆధార్ కార్డు కాపీని అందజేయవచ్చని కోర్టు పేర్కొంది.

**బిజెపి అడ్డగోలు వాదనలు**

ఆధార్ ఒక్కటే చెల్లుబాటయ్యే పత్రంగా సుప్రీంకోర్టు చెప్పలేదని, ఇతర పత్రాలతోపాటు ఆధార్‌ను సమర్పించవచ్చునని చెప్పిందని బిజెపి ఐటిసెల్ అధిపతి అమిత్ మాలవీయ అన్నారు. ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఎక్కడా ఎస్ఐఆర్‌లో చెల్లుబాటయ్యే పత్రంగా ఆధార్‌ను ఉపయోగించాలని సూచించలేదని చెప్పారు. బిజెపి అడ్డగోలు వాదనలపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.




## ట్రంప్ అభ్యంతరాలను సీరియస్‌గా తీసుకోవాలి

- భారత్‌కు నిక్కీ హేలీ సూచన

**న్యూయార్క్ :** రష్యా నుంచి చమురు కొనుగోళ్ల విషయంలో ట్రంప్ లేవనెత్తిన అభ్యంతరాలను సీరియస్‌గా తీసుకోవాలని అమెరికా రిపబ్లికన్ నాయకురాలు నిక్కీ హేలీ భారత్‌కు సూచించారు. భారత్‌- అమెరికా మధ్య వాణిజ్య విబేధాలను ఉద్దేశించి ఎక్స్‌లో ఆమె పోస్ట్ చేశారు. మాస్కో నుంచి చమురు దిగుమతుల విషయంలో ట్రంప్ లేవనెత్తిన అభ్యంతరాలను భారత్ సీరియస్‌గా తీసుకోవాలని, పరిష్కారం కోసం వీలైనంత త్వరగా అమెరికాతో కలిసి పనిచేయాలని సూచించారు. దశాబ్దాలుగా రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాల మధ్య ఉన్న స్నేహం, విశ్వాసమే ప్రస్తుత ఒడిదుడుకులను దాటేందుకు బలమైన పునాదిగా ఉపయోగ పడుతుందని తెలిపారు. రష్యా చమురుపై అభిప్రాయభేదాలు వంటివి పరిష్కరించుకోవడానికి బలమైన చర్చలు, సంప్రదింపులు చాలా అవసరమని అన్నారు. ఆంక్షలు విధించి న్యూఢిల్లీని వాషింగ్టన్ దూరం చేసుకోవడంపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. చైనాను ఎదుర్కోవాలన్న వ్యూహాత్మక లక్ష్యాల సాధనకు ట్రంప్ నిర్ణయాలు విపత్కరంగా మారాయని ఆమె తెలిపారు. ఇటీవల ఓ పత్రికకు రాసిన కాలమ్‌లో ఆ విషయాన్ని ప్రస్తావించారు. ప్రపంచంలో ఆరో వంతు జనాభాకు కేంద్రం భారత్ అని, అత్యంత వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థ అని పేర్కొన్నారు.

## రాష్ట్రాల స్వతంత్రతకు ముప్పు

- బులా బిల్లుపై పీపుల్స్ కమిషన్ ఆందోళన

**న్యూఢిల్లీ :** నియంత్రణ లేని రుణ కార్యకలాపాలను నిషేధించేందుకు ఉద్దేశించిన ముసాయిదా బిల్లు 'బులా' రాష్ట్ర ప్రభుత్వాల స్వతంత్రతకు ముప్పుగా పరిణమిస్తుందని పీపుల్స్ కమిషన్ ఆన్ పబ్లిక్ సెక్టార్ అండ్ పబ్లిక్ సర్వీసెస్ (పిసిపిఎస్‌పిఎస్) ఆందోళన వ్యక్తం చేసింది. ప్రముఖ విద్యావేత్తలు, న్యాయ నిపుణులు, మాజీ అధికారులు, సామాజిక కార్యకర్తలతో ఏర్పడిన పీపుల్స్ కమిషన్ ఒక ప్రకటన విడుదల చేస్తూ పేద ప్రజలు రుణ ఊబిలో పడకుండా నివారించడంలో ఈ బిల్లు పాత్ర చాలా తక్కువేనని వ్యాఖ్యానించింది. రుణ దోపిడీలను అడ్డుకోవడానికి కొన్ని రాష్ట్రాలలో అమలులో ఉన్న చట్టాల మాదిరిగా బలమైన నమూనా చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేసింది. 'రుణదాతలు ఎన్‌బిఎఫ్‌సిలుగా నమోదు కావాలని, ఆన్‌లైన్ డేటాబేస్‌ను నిర్వహించాలని మాత్రమే ఈ బిల్లు కోరుతోంది.

వేధింపులు, మరణాలకు సంబంధించిన అనేక కేసులు అధీకృత ఎన్‌బిఎఫ్‌సితో అనుసంధానమై ఉన్నాయి. అంటే అవి బిల్లు పరిధిలో ఉండవు. వడ్డీ రేట్లపై పరిమితిని విధించడం, రికవరీ పద్ధతులను నియంత్రించడం, పటిష్టమైన ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఏర్పాటు చేయడం వంటి విషయాల ప్రస్తావన ఈ బిల్లులో లేదు' అని పీపుల్స్ కమిషన్ తెలిపింది. రుణదాతల దోపిడీ ఉచ్చులో పడకుండా పేదలను కాపాడడానికి ప్రభుత్వ రంగ బ్యాంకుల శాఖలను గ్రామీణ, సెమీ-అర్బన్ ప్రాంతాలకు విస్తరించాలని డిమాండ్ చేసింది. సాధారణ వడ్డీ పరిమితిని 18 శాతంగా ఆర్‌బీఐ నిర్ణయించాలని, బలహీన వర్గాలకు బ్యాంకులు 4 శాతం వడ్డీకి రుణాలు అందించేలా నిబంధనలు రూపొందించాలని సూచించింది.

# గగన్‌యాన్ దిశగా మరో అడుగు

- తొలి ఎయిర్ డ్రాప్ టెస్టు విజయవంతం

**చెన్నై :** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గగన్‌యాన్ మిషన్‌లో మరో కీలక ఘట్టం చోటుచేసుకుంది. గగన్‌యాన్ ప్రాజెక్టు కోసం తొలి ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డ్రాప్ టెస్టు (ఐఎడిటి-1)ను ఇస్రో ఆదివారం విజయవంతంగా నిర్వహించింది. ఈ విషయాన్ని ఇస్రో తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించింది. 'గగన్‌యాన్ మిషన్ కోసం పారాచూట్ ఆధారిత డిసిలరేషన్ సిస్టమ్ పూర్తి పనితీరును పరీక్షించడంలో భాగంగా జరిపిన మొదటి ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డ్రాప్ టెస్టు (ఐఎడిటి-01)ను విజయవంతంగా పూర్తి చేశాం' అని ఇస్రో ప్రకటించింది. ఐఎడిటి అనేది ఒక ప్రత్యేక ట్రయల్. గగన్‌యాన్ వంటి మానవ సహిత అంతరిక్ష యాత్రల్లో సిబ్బంది భూ వాతావరణంలోకి తిరిగి ప్రవేశించడానికి ఇలాంటి పరికరాలను వినియోగిస్తారు. ఇది భూవాతావరణంలో ప్రవేశించిన తరువాత దీని వేగ నియంత్రణ, ల్యాండింగ్ విషయంలో పారాచూట్ ఆధారిత డిసిలరేషన్ సిస్టమ్ చాలా కీలక పాత్ర పోషిస్తుంది. ఇది సక్రమంగా పనిచేస్తుందా..



లేదా.. అనే విషయాన్ని నిర్ధారించడానికి ఈ పరీక్ష నిర్వహిస్తారు. ఆదివారం జరిపిన పరీక్షలో దాదాపు ఐదు టన్నుల బరువున్న డమ్మీ క్రూ క్యాప్సూల్‌ను గాలిలో కొన్ని కిలోమీటర్లు పైకి తీసుకుని వెళ్లి, తరువాత దాన్ని చినూక్ హెలికాప్టర్ ద్వారా జారవిడిచారు. అది కొన్ని కిలోమీటర్ల పై నుంచి కిందకి సురక్షితంగా దిగడం కోసం, దాని వేగం తగ్గించడం కోసం దానికి అమర్చిన పారాచూట్లను నిర్దిష్ట క్రమంలో తెరిచారు. దీంతో ఇది సురక్షితంగా సముద్రంలోకి దిగింది. గగన్‌యాన్ మిషన్‌లో ఆరోహణ, అవరోహణ దశలు వ్యోమగాములకు అత్యంత ప్రమాదకరంగా భావిస్తున్నారు. ఈ ఐఎడిటి-1 పరీక్ష విజయవంతం చాలా ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఆదివారం పరీక్షా సమయంలో భారత వైమానిక దళం, రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఒ), భారత నౌకాదళం, కోస్ట్‌గార్డ్ సంయుక్తంగా ఇస్రోకు సహకారం అందించాయి.

భారత వ్యోమగాములను అంతరిక్షంలోకి తీసుకుని వెళ్లే గగన్‌యాన్ మిషన్ 2027 మొదటి త్రైమాసికంలో జరుగుతుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ గతవారం లోక్‌సభలో మాట్లాడుతూ గగన్‌యాన్ కోసం సన్నాహక పనులు ఇప్పటికే పూర్తయ్యాయని తెలిపారు.



కుంగిన భారీ వంతెన

# ముంచెత్తుతున్న వానలు

- కాశ్మీర్‌లో కుంగిన భారీ వంతెన
- జమ్మూకాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్‌లో భారీ వర్షాలు

**శ్రీనగర్ :** ఉత్తరాది రాష్ట్రాల్లో వానలు ముంచెత్తుతున్నాయి. జమ్ముకాశ్మీర్‌లో భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి. వరద ఉధృతికి లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. సహర్ ఖడ్ నది ఉప్పొంగడంతో జమ్మూ - పఠాన్‌కోట్ జాతీయ రహదారిపై ఉన్న ప్రధాన వంతెన దెబ్బతింది. జమ్మూలో గత 24 గంటల్లో 19 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు. భారీ వర్షాల ధాటికి నదులు, కాలువలు ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయి.

**45 మంది విద్యార్థులను రక్షించిన ఎస్‌డిఆర్‌ఎఫ్**

పలు ప్రాంతాల్లో వరదనీరు ఇళ్లలోకి చేరింది. డజన్లకొద్దీ వాహనాలు వరద ఉధృతికి కొట్టుకుపోయాయని అధికారులు తెలిపారు. ఎడతెగని వర్షాలతో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటిగ్రేటివ్ మెడిసిన్ (ఐఐఐఎం) వసతి గృహంలోకి వరద చేరగా 45 మంది విద్యార్థులు అక్కడ చిక్కుకున్నారు. హాస్టల్ గ్రౌండ్ ఫ్లోర్ వరదనీటితో మునిగిపోయిందని అధికారులు చెప్పారు. ఐఐఐఎం వద్దకు చేరుకున్న పోలీసులు, ఎస్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది ఐదు గంటలపాటు శ్రమించి బోట్ల ద్వారా విద్యార్థులందరనీ సురక్షిత ప్రాంతానికి తరలించారు. "వర్షాలు పడతాయని ముందే ఊహించాం. వర్షం ప్రారంభమైన వెంటనే శాస్త్రీయ విభాగంలోని నాలుగు బ్లాక్‌ల గ్రౌండ్ ఫ్లోర్ నుంచి విద్యార్థులను ఇప్పటికే తరలించారు. వర్షాలు ఆగకపోవడంతో మొత్తం ప్రాంతం మునిగిపోయింది. వరదలకు కారణం తెలియదు. స్థానికంగా ఉన్న చెరువు కూడా నిండిపోయింది. విద్యార్థుల బస, ఆహారం కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం" అని ఐఐఐఎం డైరెక్టర్ డా.జబీర్ అహ్మద్ వెల్లడించారు.

## 30 రోజుల్లో ప్రతిపక్ష ప్రభుత్వాల కూల్చివేతే బిజెపి లక్ష్యం

- అందుకే 130వ రాజ్యాంగ సవరణకు బిల్లులు
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

**న్యూఢిల్లీ :** ముందు ఓట్లు చోరీ చేసి, ఆ తరువాత అధికారాన్ని చోరీ చేసే పనిలో బిజెపి నిమగ్నమైందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. ప్రతిపక్ష ప్రభుత్వాలను 30 రోజుల్లో కూల్చి వేసేందుకే కేంద్రం 130వ రాజ్యాంగ సవరణ బిల్లును తీసుకొచ్చిందని ఆయన విమర్శించారు. ఢిల్లీలో నిర్వహించిన హర్యానా, మధ్యప్రదేశ్‌లో నూతనంగా నియమితులైన డిసిసి అధ్యక్షుల శిక్షణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ద్వారా ఓట్లను తొలగించే ప్రక్రియను బిజెపి మున్ముందు కొనసాగిస్తుందని, వాటి పట్ల జిల్లా అధ్యక్షులు అప్రమత్తంగా ఉండాలని ఖర్గే సూచించారు. రాహుల్ గాంధీ చేపడుతున్న 'ఓటు అధికార్ యాత్ర' నుంచి ప్రజలను పక్కదోవ పట్టించేందుకు ప్రధాని మోడీ చొరబాటుదారుల అంశాన్ని లేవనెత్తారని విమర్శించారు. అవినీతి గురించి మాట్లాడుతున్న ప్రధాని అక్రమాలు చేసిన వారందరినీ పార్టీలో చేర్చుకొని మంత్రులను చేశారని చెప్పారు. ఏదైనా కేసులో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, మంత్రులు అరెస్టయి వరుసగా 30 రోజులపాటు జైలులో ఉంటే, వారు పదవి కోల్పోయేలా కేంద్రప్రభుత్వం ఇటీవల లోక్‌సభలో ప్రవేశపెట్టిన మూడు బిల్లులపై ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు.

# ఓ వైపు ఆకలి చావులు... మరోవైపు దాడులు

- బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్న పాలస్తీనియన్లు
- కొనసాగుతున్న ఇజ్రాయిల్ మారణకాండ

**గాజా స్ట్రిప్ :** ఓ వైపు ఆకలి చావులు... మరోవైపు భీకర దాడులు. గాజా స్ట్రిప్‌లో అనునిత్యం కన్పిస్తున్న దృశ్యాలివి. మహిళలు, చిన్నారులు, వృద్ధులు ఆకలిలో విలవిలలాడిపోతుంటే మరోవైపు ఇజ్రాయిల్ సైనికులు ఏ మాత్రం కనికరం చూపకుండా అమానుషంగా దాడులు చేస్తూనే ఉన్నారు. సహాయ పంపిణీ కేంద్రాల వద్ద బారులు తీరిన అన్నార్తులు, సామాన్య ప్రజలను కూడా వదలడం లేదు. గాజాను బలవంతంగా ఖాళీ చేయించడమే ఇజ్రాయిల్ ఉద్దేశం. అదే జరిగితే పది లక్షల మంది నిరాశ్రయులవుతారు. వేలాదిమంది ప్రజలు ఇప్పటికే ప్రాణభయంతో పరుగులు తీస్తున్నారు. నగర శివారులో జనసమ్మర్దం అధికంగా ఉండే సబ్రా, తుఫా వంటి ప్రాంతాలు బాంబుల మోతతో దద్దరిల్లిపోతున్నాయి. గాజా నగరంలో సేవలు అందిస్తున్న వైద్య సిబ్బందిని సైతం బహిష్కరించాలని ఇజ్రాయిల్ ప్రయత్నిస్తోంది. 2023 అక్టోబరులో ఇజ్రాయిల్ దాడులు మొదలైనప్పటి నుంచి నేటి వరకూ ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 62,686కు చేరింది. 1,57,951 మంది గాయాల పాలయ్యారు. గత నెల రోజులుగా ఇజ్రాయిల్ ముమ్మరంగా దాడులు చేస్తోంది. మృతులు, క్షతగాత్రుల్లో అత్యధికులు చిన్నారులు, మహిళలేనని స్వచ్ఛంధ సంస్థలు అంచనా వేస్తున్నాయి. ఆదివారం నెట్‌జారిమ్ కారిడర్ ప్రాంతంలో ఇజ్రాయిల్ సైన్యం చేసిన దాడుల్లో మరో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. గాజా హ్యుమానిటేరియన్ ఫౌండేషన్ (జిహెచ్‌ఎఫ్) నిర్వహిస్తున్న సహాయ పంపిణీ కేంద్రం వద్ద వేచిచూస్తున్న పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ సైన్యం విచక్షణారహితంగా





కాల్పులు జరిపిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

**గాజా ప్రజలకు కాళరాత్రులే**

గాజా ప్రజలు భయంతో నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తోంది. ఇజ్రాయిల్ సైన్యం దాడులతో నిరంతరాయంగా పేలుడు శబ్దాలు వినిపిస్తూనే ఉన్నాయి. గాయాల పాలైన వారితో ఆస్పత్రులు నిండిపోతున్నాయి. పేలుళ్ల ధాటికి గాలిలో దట్టమైన పొగ వ్యాపిస్తోంది. ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. చాలా మంది ఊపిరి అందక బాధపడుతున్నారు. ఆకలికి తాళలేక ఇప్పటి వరకూ 289 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారని గాజా స్ట్రిప్‌లోని ఆరోగ్య మంత్రిత్వ శాఖ డైరెక్టర్ మునిర్ అల్-బర్ష్ తెలిపారు. వీరిలో 115 మంది చిన్నారులే. గత 24 గంటల్లో 64 మృతదేహాలను ఆస్పత్రులకు తీసుకొచ్చారు. అనారోగ్యాల బారిన పడిన వారికి వైద్య సేవలు కూడా అందడం లేదు. పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులు కూడా ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. నవజాత శిశువులు, చంటిపిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**కళ్ల ఎదుటే ప్రాణాలు విడుస్తున్న చిన్నారులు**

గర్భిణులకు అవసరమైన పోషకాహారం లభించకపోవడంతో వారికి పుట్టిన పిల్లలు కూడా అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఆకలికి తాళలేక చిన్నారులు కళ్ల ఎదుటే ప్రాణాలు విడుస్తున్నా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో తల్లిదండ్రులు ఉండిపోతున్నారు. నగరంలోని సహాయ గిడ్డంగులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఇజ్రాయిల్ ఆంక్షల కారణంగా ఆహారం, మందులు, ఇతర అత్యవసర సామగ్రి సరఫరాలు నిలిచిపోయాయి.

**వివిధ దేశాల్లో నిరసనలు**

గాజా నగరంలో ఇజ్రాయిల్ సృష్టించిన క్షామాన్ని నిరసిస్తూ ప్రపంచవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతోంది. గాజాలో మారణహోమాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఆస్ట్రేలియాలోని 20 నగరాల్లో ప్రదర్శనలు నిర్వహించారు. బ్రిస్బేన్‌లో జరిగిన ప్రదర్శనలో పాల్గొన్న వేలాది ప్రజలు గాజాలోని అన్నార్తులకు తక్షణమే సాయం అందించాలని, కాల్పుల విరమణ ప్రకటించాలని నినాదాలు చేశారు. ఇజ్రాయిల్‌లో కూడా నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. యుద్ధాన్ని ఆపాలంటూ టెల్ అవీవ్‌లో వేలాది మంది ర్యాలీ తీశారు. అనేక యూరోపియన్ నగరాలలో కూడా ఇజ్రాయిల్ చర్యలను నిరసిస్తూ ప్రదర్శనలు నిర్వహించారు.

# చట్టవిరుద్ధ పనుల్లో అస్సాం సిఎం

- ఆదివాసీల భూములు అదానీ వంటి కంపెనీలకు
- సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ విమర్శ

**న్యూఢిల్లీ :** అస్సాం సిఎం హిమంత బిశ్వశర్మ చట్టవిరుద్ధమైన కార్యక్రమాల్లో నిమగ్నమై ఉన్నారని, ఆ దోపిడీని బాహ్య ప్రపంచం నుంచి దాచేందుకు ప్రయత్నిస్తున్నారని ప్రముఖ సీనియర్ నాయ్యవాది, సామాజిక కార్యకర్త ప్రశాంత్ భూషణ్ అన్నారు. ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడుతూ "హిమంత బిశ్వశర్మ నేతృత్వంలోని అస్సాం రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ ఒక్క చట్టవిరుద్ధమైన, అక్రమ కార్యకలాపాల్లో ఉంటున్నది. ప్రత్యేకించి పౌరులను అక్రమంగా బంగ్లాదేశ్‌కు, దేశం బయటకు పంపించివేస్తున్నది. ప్రజలను తమ సొంత భూముల నుంచి తరలించేస్తున్నది. వారి ఇళ్లను కూల్చివేస్తున్నది. వ్యవసాయపరంగా మంచి ఉత్పాదకతను అందించే ఆదివాసీల భూములను అదానీ గ్రూపుతోపాటు ఇతర కంపెనీలకు అక్రమంగా కట్టబెట్టేందుకు యత్నిస్తున్నది.





రాష్ట్రంలో పూర్తిగా దోపిడీ జరుగుతోంది. దానిని సిఎం దాచాలనుకుంటున్నారు. అందుకే స్వతంత్ర వ్యక్తులను ఆయన నిరోధిస్తున్నారు" అని అన్నారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్ వంటి విదేశీ శక్తులతో కలిసి రాష్ట్రాన్ని బలహీనపర్చేందుకు ప్రయత్నిస్తున్నారంటూ ప్రశాంత్‌భూషణ్‌తోపాటు కాంగ్రెస్, జమాత్ - ఎ- ఇస్లామీ- హింద్, మేధావులు హర్ష మందర్, వజాహత్ హబీబుల్లాతోపాటు పలువురిపై అంతకుముందు హిమంత బిశ్వ శర్మ విమర్శలు గుప్పించారు. దీనిపై స్పందించిన ప్రశాంత్ భూషణ్.. రాష్ట్రంలో ఏం జరుగుతోందో తెలుసుకోవడానికి వస్తున్న ఇలాంటి వారిని చూసి హిమంత సర్కారు ఎందుకు భయపడుతోందని ఆయన ప్రశ్నించారు. సీనియర్ జర్నలిస్టులపై రాష్ట్రప్రభుత్వం దేశద్రోహం కేసులు బనాయించటాన్ని విమర్శించారు.

## అమెరికా డిమాండ్లకు తలొగ్గం : ఖమేనీ

**టెహ్రాన్ :** అమెరికాపై ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరోసారి మండిపడ్డారు. తమను లొంగదీసుకోవడానికి అమెరికా ప్రయత్నాలు చేస్తోందని, దీనిని ఎదుర్కొనేందుకు కలిసి కట్టుగా పోరాడదామని భాగస్వామ్య పక్షాలకు పిలుపునిచ్చారు. ఎట్టిపరిస్థితుల్లోనూ అమెరికాకు తలొగ్గే ప్రసక్తే లేదని అయతొల్లా స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి అధికారిక వెబ్‌సైట్‌లో ఓ ప్రకటన చేశారు.జూన్‌లో తమ అణు కేంద్రాలను లక్ష్యంగా ఇజ్రాయిల్, అమెరికాలు దాడి చేయడం ప్రతీకార చర్యను ప్రేరేపించిందన్నారు. టెహ్రాన్‌ను అస్థిరపరిచేందుకే అమెరికా ప్రణాళిక రూపొందించిందని ఖమేనీ ఆరోపించారు. ఇటీవల యుద్ధం ప్రారంభంలో.. ఇజ్రాయిల్ దాడి చేసిన మరుసటి రోజు అమెరికన్ ఏజెంట్లు యూరప్‌లో భేటీ అయ్యారని, ఇరాన్‌ను తదుపరి ఏ ప్రభుత్వం పాలించాలి అనే విషయంపై చర్చించారని అన్నారు. అంతిమంగా ఇరాన్ విధేయతగా ఉండాలని అమెరికా కోరుకుంటోందని చెప్పారు. ఇజ్రాయిల్ దాడిని ప్రస్తావించిన ఖమేని. ప్రభుత్వం సహా ఇరాన్ మొత్తం తమ సైన్యానికి అండగా నిలబడిందన్నారు. ఈ క్రమంలో శత్రువులను దెబ్బతీశామన్నారు. అంతర్గత విభేదాలపై హెచ్చరించిన ఆయన.. విదేశీ శక్తులు రెచ్చగొడుతున్నాయన్నారు.

## అంతరిక్షం నుంచి ఎంతో అందంగా...

- భారత్ - హైదరాబాద్ సూర్యోదయాన్ని 16సార్లు చూశా
- యాక్సియం- 4 మిషన్‌పై శుభాంశు శుక్లా



**న్యూఢిల్లీ :** అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నుంచి భారత్ చాలా అందంగా కనిపించిందని భారతీయ వ్యోమగామి శుభాంశు శుక్లా చెప్పారు. ప్రపంచంలోని ప్రత్యేక స్థానంలో, విశిష్ట ఆకారంలో ఉన్నందు వల్లే మన దేశం అలా కనిపించి ఉండొచ్చన్నారు. తాను భారతీయుడిని అయినందున ఈ మాట చెప్పడం లేదని, ఐఎస్ఎస్‌లోని ఏ వ్యోమగామిని అడిగినా ఈ విషయాన్నే చెబుతారని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేకించి రాత్రి సమయంలో హిందూ మహాసముద్ర మార్గంలో దక్షిణ దిశ నుంచి ఉత్తర దిశకు ఐఎస్ఎస్ వెళ్లేటప్పుడు, భారత్ చాలా అద్భుతంగా కనిపిస్తుందన్నారు.గగన్‌యాన్ మిషన్ కోసం ఎంపికైన నలుగురు గగన్ యాత్రీలను సత్కరించేందుకు భారత వాయుసేన (ఐఎఎఫ్) ఆదివారం న్యూఢిల్లీలోని సుబ్రతో పార్క్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా నలుగురు గగన్ యాత్రికులు శుభాంశు శుక్లా (గ్రూప్ కెప్టెన్), పివి నాయర్ (గ్రూప్ కెప్టెన్), అజిత్ క్రిష్ణన్ (గ్రూప్ కెప్టెన్), అంగద్ ప్రతాప్ (గ్రూప్ కెప్టెన్)లను రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సన్మానించారు. ఈ సందర్భంగా శుభాంశు శుక్లా మాట్లాడుతూ, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి తాను రికార్డ్ చేసిన భారతదేశం వీడియోను చూపిస్తూ, భూమి ఎగువ వాతావరణంలో ఆక్సిజన్ ఆకుపచ్చ కాంతి, నక్షత్రమయ ఆకాశం ఉన్నాయన్నారు. హైదరాబాద్, బెంగళూరు నగరాల్లో సూర్యోదయం కావడాన్ని ఐఎస్ఎస్‌లోని వ్యోమగాములు ఒక రోజులో ఏకంగా 16 సార్లు చూడగలుగుతారని, అయినా ఏ ఒక్కసారి కూడా బోర్ కొట్టదన్నారు. కొన్ని నెలల క్రితమే అమెరికాకు చెందిన యాక్సియం- 4 మిషన్ ద్వారా శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాని(ఐఎస్ఎస్)కు వెళ్లొచ్చారు. రాకేశ్ శర్మ అంతరిక్ష యాత్ర గురించి చిన్నప్పుడు కథలు వినేవాడినని, అటువంటి తనను భారత వాయుసేన ఈ స్థాయికి తీసుకొచ్చిందని శుక్లా చెప్పారు. నాలో ఈ గొప్ప మార్పునకు వాయుసేనే కారణం. విమానంలోని కాక్‌పిట్ నా గొప్ప గురువు. ఈ యూనిఫామ్‌కు నేను రుణపడి ఉంటాను. భారత వాయుసేనకు నా ధన్యవాదాలు. ఎయిర్‌ఫోర్స్‌లో చేరే ప్రతీ ఒక్కరికి ఇదే విధమైన బాధ్యతాయుత ప్రవర్తన అలవడుతుంది" అని వ్యోమగామి శుభాంశు శుక్లా చెప్పారు.

**గగన్ యాత్రికులను చూసి భారత్ గర్విస్తోంది : రాజ్‌నాథ్**

గగన్ యాన్ మిషన్‌కు వెళ్లనున్న నలుగురు గగన్ యాత్రికులు భారతదేశానికే గర్వకారణమని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఇందుకోసం వారు చాలా కఠినమైన శిక్షణను పొందారని చెప్పారు. అంతరిక్ష అన్వేషణలో భారత్ పెట్టుకున్న లక్ష్యాల సాకారంలో ఈ గగన్ యాత్రికులు కీలక పాత్ర పోషించబోతున్నారని ఆయన తెలిపారు. ఆ టీమ్‌లోని శుభాంశు శుక్లా, పివి నాయర్, అజిత్ క్రిష్ణన్, అంగద్ ప్రతాప్ భారతమాత ముద్దుబిడ్డలని, వారిని చూసి గర్విస్తున్నామని రాజ్‌నాథ్ చెప్పారు.

## నా పేరుతో బినామీ రుణాలు

- ఐద్వాతో కలిసి పోరాటం
- ఢిల్లీ ప్రజా విచారణలో నాంచారమ్మ

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**



నా పేరుతో తీసుకున్న బినామీ రుణాలపై ఐద్వాతో కలిసి పోరాటం చేశాను' అని రేపల్లెకు చెందిన నాంచారమ్మ.. ఐద్వా ఆధ్వర్యాన ఢిల్లీలో జరుగుతున్న ప్రజా విచారణలో వెల్లడించారు. మైక్రో ఫైనాన్స్ వల్ల దోపిడీకి గురైన బాధితులపై శని, ఆదివారాల్లో ఢిల్లీలో ప్రజా విచారణను ఐద్వా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ విచారణకు రాష్ట్రం నుంచి హాజరైన నాంచారమ్మ తనకు జరిగిన మోసాన్ని, న్యాయం కోసం చేసిన పోరాటాన్ని ఈ విచారణలో వివరించారు. రేపల్లెలో మెప్మా అధికారులు, బ్యాంకు అధికారులతో కలిసి రిసోర్స్ పర్సన్ ముంతాజ్ బేగం అనే వ్యక్తి పొదుపు గ్రూపుల మహిళల ఆధార్ కార్డులు, సంతకాలతో 18 నకిలీ స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేశారని తెలిపారు. 150కు పైగా మహిళల పేర్లతో రూ.1.64 కోట్ల రుణం తీసుకున్నారని పేర్కొన్నారు. ఈ నకిలీ సంఘాల్లో ఒకదానిని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకులో యాసీన్ గ్రూప్ పేరుతో సృష్టించారని చెప్పారు. బేగమ్ తన కుటుంబ సభ్యులు, బ్యాంకు అధికారులతో డబ్బు దోచుకున్నారని తెలిపారు. తాను కెనరా బ్యాంకులో నడుస్తున్న ఉస్నే జాహ అనే సంఘంలో సభ్యురాలిని అని పేర్కొన్నారు. జగనన్న కాలనీలో ఇల్లు కట్టుకునే సమయంలో రుణం కావాలని ముంతాజ్ బేగాన్ని సంప్రదించానని తెలిపారు. ఆమె రూ.20 వేల రుణం వస్తుందని, కానీ 10 మంది మహిళలతో గ్రూపు ఏర్పాటు చేయాలని చెప్పినట్లు పేర్కొన్నారు. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ఉద్యోగితో తన ఇంటికి వచ్చి బేగమ్ సంతకాలు తీసుకున్నారని, తర్వాత బ్యాంకుకు తీసుకెళ్లారని వివరించారు. బ్యాంకు ఇచ్చిన రూ.9 లక్షలను తమకు చెప్పకుండా బేగం తన కుటుంబ సభ్యులతో కలిసి తీసుకెళ్లారని పేర్కొన్నారు. తమకు రూ.20 వేల రుణం చూపించేలా నకిలీ పాస్‌బుక్ ఇచ్చి నెలకు రూ.1000 చెల్లించాలని చెప్పడంతో క్రమం తప్పకుండా చెల్లించినట్లు వివరించారు. 2023 జులైలో రుణాలు చెల్లించాలని బ్యాంకులు తమకు నోటీసులు పంపినట్లు తెలిపారు. బ్యాంకు సిబ్బందిని ప్రశ్నించగా.. తమ పేరుతో రూ.1.5 లక్షల వరకు రుణాలు తీసుకున్నట్లు బయటపడిందన్నారు. ఈ మోసంపై జిల్లా కలెక్టరుతో మెప్మా, పోలీస్ అధికారులకు అనేక సార్లు ఫిర్యాదు చేయడంతో ఆమెను అరెస్టు చేశారని తెలిపారు. తర్వాత డ్వాక్రా రుణం కోసం దరఖాస్తు చేసుకున్న సమయంలో బ్యాంకులు తమకు నో డ్యూ సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయని పేర్కొన్నారు. చివరికి ఐద్వాతో కలిసి పోరాటం చేయడం వల్ల హెచ్‌డిఎఫ్‌సి సర్టిఫికెట్ ఇచ్చి, తమకు కొత్త రుణం మంజూరు చేసిందని తెలిపారు. మహిళల పేరుతో బేగం తీసుకున్న రూ.1.64 కోట్లలో మహిళలకు కేవలం రూ.20.55 లక్షలు చేరాయని పేర్కొన్నారు. చాలా మంది మహిళల పేర్లతో నకిలీ రుణాలు కొనసాగుతూనే ఉన్నాయని తెలిపారు.

## అనిల్ అంబానీ మోసగాడు

- రిలయన్స్ కమ్యూనికేషన్స్ ఫ్రాడ్
- ప్రకటించిన బ్యాంక్ ఆఫ్ ఇండియా

**ముంబయి :** పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ కంపెనీ రిలయన్స్ కమ్యూనికేషన్ అకౌంట్లు మోసపూరితమని బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటించింది. అంతకుముందు ఎస్‌బిఐ ఇదేవిధంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. మాజీ డైరెక్టర్, పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ పేరు సైతం ఈ కేసులో చేర్చింది. రెగ్యులేటరీ ఫైలింగ్స్ ప్రకారం.. బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా ఈ రుణ ఖాతాను మోసపూరితంగా ప్రకటించింది. 2016లో నిధుల దుర్వినియోగం జరిగిందని ఆరోపించింది. ప్రభుత్వ యాజమాన్యంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆగస్టు 2016లో రిలయన్స్ కమ్యూనికేషన్స్‌కు మూలధనం, నిర్వహణ వ్యయాన్ని అవసరాలను తీర్చడానికి రూ.700 కోట్ల రుణాన్ని మంజూరు చేసింది. ఆర్ కామ్, రిలయన్స్ టెలికామ్, అంబానీ అకౌంట్లను ఫ్రాడ్ అకౌంట్లుగా నిర్ధారించింది. మంజూరు చేసిన రుణాలను ఇతర మార్గాలకు మళ్లించడం, నిబంధనలు పాటించలేదని పేర్కొంది. ఈ కంపెనీతో సంబంధాలు ఉన్న కొంతమందికి నోటీసులు పంపించినట్టు తెలిపింది. ఈ నెల 22న ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో రిలయన్స్ కమ్యూనికేషన్స్ ఈ విషయాలను వెల్లడించింది. ఈ నెల 8వ తేదీన తమకు నోటీసులు అందినట్లు తెలిపింది. నోటీసుల ప్రకారం.. రూ.724.78 కోట్ల రుణాలకు సంబంధించి రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ లోన్ అకౌంట్లు, అనిల్ ధీరూభాయ్ అంబానీ, మంజారి ఆశిష్ కాకెర్‌లను ఫ్రాడ్‌గా పేర్కొంది. 2017, జూన్ 30 నాటికే నిరర్థక ఆస్తులుగా నిర్ణయం తీసుకున్నారని.. ఈ విషయంపై రుణ గ్రహీతలు, గ్యారెంటీ ఇచ్చిన వారికి సమాచారం అందిస్తూ వచ్చామని, వారు పట్టించుకోలేదని తెలిపింది. ఈ ఏడాది జూన్‌లో ఎస్‌బిఐ సైతం ఈ సంస్థ అకౌంట్లను మోసపూరితమని ప్రకటించిన విషయం తెలిసిందే. రుణాల నిబంధనలు ఉల్లంఘించడం ద్వారా బ్యాంకు నిధులను దుర్వినియోగం చేశారు.

ఎస్‌బిఐ ఫిర్యాదు మేరకు సిబిఐ శనివారం రిలయన్స్ కమ్యూనికేషన్, అంబానీ నివాసానికి సంబంధించిన ప్రాంగణాల్లో సోదాలు నిర్వహించింది. రిలయన్స్ కమ్యూనికేషన్స్ కంపెనీకి ఎస్‌బిఐ రూ.2,227.64 కోట్లు రుణాలు ఇచ్చింది. 2016 ఆగస్టు 26 నుంచి వడ్డీ, ఖర్చులు అదనం కాగా.. రూ.786.52 కోట్ల బ్యాంక్ గ్యారెంటీ సైతం ఉన్నది. ఈ క్రమంలో ఆ కంపెనీని, ప్రమోటర్ అనిల్ అంబానీ అకౌంట్లను ఫ్రాడ్‌గా ఎస్‌బిఐ ప్రకటించింది.

## యుపిలో దళిత ఇంజినీర్‌పై షూతో దాడి

- కులం పేరుతో దూషించి భౌతికదాడికి తెగబడ్డ బిజెపి నాయకుడు

**లక్నో :** ఉత్తర ప్రదేశ్‌లో దళిత ఉద్యోగులకు సైతం రక్షణ కరువైంది. ఓ దళిత ఇంజినీర్‌ను ఆయన ఆఫీసులోకే వెళ్లి మరీ షూతో కొట్టాడు ఓ బిజెపి నాయకుడు. బాధితుడిని కులం పేరుతో దూషించి, భౌతికదాడికి దిగి గాయపర్చాడు. యుపిలోని బల్లియాలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. బాధితుడు లాల్ సింగ్ ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్‌లో సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. ఎలాంటి అనుమతి లేకుండానే బిజెపి నాయకుడు, నిందితుడు మున్నా బహదూర్ తన అనుచరులతో కలిసి లాల్‌సింగ్ కార్యాలయంలోకి వెళ్లాడు. లాల్‌సింగ్‌తో తీవ్ర వాగ్వాదానికి దిగాడు. కులం పేరుతో బూతులు తిట్టాడు. పిడిగుద్దులు గుద్ది గాయపర్చాడు. అంతటితో ఆగకుండా షూతో లాల్‌సింగ్‌ను కొట్టాడు. ఆఫీసులో ఉన్న కొన్ని కీలకమైన ఫైళ్లను మున్నా బహదూర్, అతని అనుచరులు చించేశారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే నిన్ను, నీ కుటుంబాన్ని చంపేస్తామని బెదిరించి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. తనపై దాడికి సంబంధించి లాల్‌సింగ్.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. మున్నా బహదూర్‌ను అరెస్ట్ చేశామని, దర్యాప్తు కొనసాగుతోందని పోలీసు ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీతో పాటు బిఎన్‌ఎస్‌లోని పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితులపై తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి) అధినేత అఖిలేష్ యాదవ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దాడి ఘటనను ఖండించారు. మున్నా బహదూర్ తమ పార్టీ వ్యక్తే అని బిజెపి జిల్లా అధ్యక్షుడు సంజయ్ మిశ్రా తెలిపారు.

## ఆధునిక ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ విజయవంతం

- పరీక్షించిన డిఆర్‌డిఒ

**భువనేశ్వర్:** అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్ వెపన్ సిస్టమ్ (ఐఎడిడబ్ల్యుఎస్) తొలి విమాన పరీక్షలను రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఒ) విజయవంతంగా నిర్వహించింది. దేశీయంగా అభివృద్ధి చేసిన వాయు రక్షణ వ్యవస్థను శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు ఒడిశా తీరంలో పరీక్షించింది. వివిధ పొరలతో కూడిన వాయు రక్షణ వ్యవస్థ ఐఎడిడబ్ల్యుఎస్.. ఉపరితలం నుంచి గగనతలానికి క్షిపణులు, వాయు రక్షణ వ్యవస్థ క్షిపణులు, అధిక శక్తిగల లేజర్ ఆధారిత డైరెక్ట్ ఎనర్జీ వెపన్స్ వ్యవస్థను కలిగి ఉంది. ఈ నేపథ్యంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ డిఆర్‌డిఒ, సాయుధ దళాలను ఎక్స్ వేదికగా అభినందించారు.

# జవాబుదారీతనం రావాలి

- స్టాఫ్ సెలక్షన్ కమిషన్‌కు వ్యతిరేకంగా ఢిల్లీలో ఆందోళన
- వేల సంఖ్యలో పాల్గొన్న విద్యార్థులు, టీచర్లు



ఢిల్లీలో ఆందోళన చేస్తున్న నిరుద్యోగులను అడ్డుకుంటున్న పోలీసులు

**న్యూఢిల్లీ :** స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్‌ఎస్‌సి) నియామకాల్లో జవాబుదారీతనంతో పనిచేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో నిరుద్యోగులు ఆందోళన చేశారు. ఎస్‌ఎస్‌సి అభ్యర్థులు ఛాత్ర మహా ఆందోళన్ ఆధ్వర్యాన రామ్‌లీల మైదాన్ వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాది మంది విద్యార్థులు, టీచర్లు పాల్గొన్నారు. నియామకాల్లో ఎస్‌ఎస్‌సి తీరు పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జవాబుదారీ తనం పెరగాలని డిమాండ్ చేశారు. నియామక ప్రక్రియలో మార్పులు తేవాలన్నారు. వ్యవస్థలో అనేక లోపాలున్నాయనీ, వాటిని సరిదిద్దాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు.

ప్రతి ఏడాదీ ఎస్‌ఎస్‌సి భర్తీ చేసే పోస్టులకు లక్షలాది మంది అభ్యర్థులు పోటీ పడుతుంటారు. పేపర్ లీక్‌లు, పరీక్షల వాయిదాలు, ప్రశ్నాపత్రాల్లో లోపాలతో అభ్యర్థుల నుంచి ఇప్పటికే తీవ్ర ఆగ్రహజ్వాలలు వెల్లువెత్తాయి. పరీక్షల నిర్వహణ, ఫలితాల ప్రక్రియపై అభ్యర్థులు అసంతృప్తి వ్యక్తం చేశారు. వ్యవస్థాగతమైన సంస్కరణలు తీసుకురావాలని, మెరుగైన పర్యవేక్షణ, ప్రశ్నాపత్ర లోపాలు, మెరిట్ ప్రచురణలో జాప్యం వంటి సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను నెరవేర్చకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఆందోళనకారులు హెచ్చరించారు.

ఎస్‌ఎస్‌సి వ్యవస్థలో మెరుగుదల రాకపోతే దాని విశ్వసనీయత ప్రమాదంలో పడుతుందని తెలిపారు. నిరసనకారుల ఆందోళనకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.



అఖిల భారత స్పీకర్ల సమావేశం సందర్భంగా పార్లమెంటరీ వ్యవస్థకు చెందిన అరుదైన చిత్రాలు, పత్రాల ప్రదర్శనను ప్రారంభిస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా

## ప్రజల సమస్యలను లేవనెత్తడానికి సభ వేదిక కావాలి

- అఖిల భారత స్పీకర్ల సమావేశంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

దేశ ప్రజల సమస్యలను లేవనెత్తడానికి సభ నిష్పాక్షికమైన వేదిక కావాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. కేంద్ర శాసనసభ మొదటి స్పీకరుగా విఠల్‌భాయ్ పటేల్ ఎన్నికై శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఢిల్లీ అసెంబ్లీలో రెండు రోజులపాటు నిర్వహించే అఖిల భారత స్పీకర్ల సమావేశాన్ని అమిత్ షా ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీయ ఆలోచనల ఆధారంగా దేశాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా నడపడానికి పునాది వేసే పని విఠల్‌భాయ్ పటేల్ చేశారని అన్నారు. నిబంధనల ప్రకారం సభ సక్రమంగా జరిగేలా చూసుకోవడం ప్రతి సభ్యుని బాధ్యతని పేర్కొన్నారు. సభల్లో ప్రభుత్వం, ప్రతిపక్షాలు నిష్పాక్షిక వాదన చేయాలని అన్నారు. దేశ సుదీర్ఘ చరిత్రలో అసెంబ్లీలు తమ గౌరవాన్ని కోల్పోయినప్పుడల్లా, మనం భయంకరమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు.

పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో పార్లమెంటు, అసెంబ్లీలు కేంద్ర బిందువులని, రెండూ సరిగ్గా పనిచేయకపోతే, ప్రజాస్వామ్యంపై ప్రశ్నలు తలెత్తుతాయని అన్నారు. వ్యతిరేకతకు, అడ్డంకికి మధ్య వ్యత్యాసం ఉందని, ప్రతిపక్షం సభ పనితీరుకు అంతరాయం కలిగించలేదని అన్నారు. ఎఐ ఆధారిత సాధనాలు వంటి డిజిటల్ ఆవిష్కరణలపై ప్రత్యేక దృష్టి సారించి, చట్టాల నిర్మాణంలో పారదర్శకత, సామర్థ్యం బలోపేతం చేయడం ఈ సమావేశం లక్ష్యమని అన్నారు. శాసనసభల పనితీరు కోసం కొత్త విధానాలను అన్వేషించడానికి ఒక అర్థవంతమైన వేదికను అందిస్తాయని భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనా, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకరు చింతకాయల అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకరు రఘురామ కృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు విఠల్‌భాయ్ పటేల్, పార్లమెంటరీ సంస్థల పరిణామానికి సంబంధించిన ఆర్కైవల్ రికార్డులు, ఛాయాచిత్రాలు, పత్రాలను ప్రదర్శించే ప్రత్యేక ప్రదర్శనను అమిత్ షా ప్రారంభించారు. ఆయన జీవితం ఆధారంగా ఒక స్మారక తపాలా బిళ్లను విడుదల చేశారు.

## గవర్నర్ ప్రమాణ స్వీకార ఆహ్వానం తిరస్కరణ

- ఐదు నాగాలాండ్ గిరిజన సంఘాల ప్రకటన

**కోహిమా :** నాగాలాండ్ నూతన గవర్నర్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరు కావాలని వచ్చిన ఆహ్వానాన్ని ఐదు నాగాలాండ్ గిరిజన సంఘాలు తిరస్కరించాయి. సోమవారం జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొనబోమని ప్రకటించాయి. రాష్ట్రంలో రిజర్వేషన్ విధానాన్ని సమీక్షించాలనే డిమాండ్‌లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆదివారం ప్రకటించాయి. అంగామి పబ్లిక్ ఆర్గనైజేషన్, ఆవో సెండెన్, లోథా హోహో, రెంగ్మా హోహో, సుమి హోహో అనే ఐదు గిరిజన సంఘాలకు చెందిన కమిటీ ఆన్ రివ్యూ ఆఫ్ రిజర్వేషన్ పాలసీ (సిఒఆర్ఆర్‌పి) ఈ నిర్ణయాన్ని వెల్లడించింది. మాజీ ఐఎఎస్ అధికారి నేతృత్వంలో ఏడుగురు సభ్యులతో ఉద్యోగ రిజర్వేషన్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలనే నాగాలాండ్ మంత్రివర్గ నిర్ణయాన్ని ఈ కమిటీ ఖండించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న రిజర్వేషన్ కోటా విధానంతో ప్రయోజనం పొందుతున్న తెగలకు అనుకూలంగానే ప్రభుత్వ నిర్ణయం ఉందని కమిటీ విమర్శించింది. 'పదేపదే గుర్తు చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం తమ చట్టబద్ధమైన డిమాండ్లను విస్మరిస్తూనే ఉన్నందున ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మేం హాజరుకావడం లేదు' అని సిఒఆర్ఆర్‌పి కన్వీనర్ టెసిన్లో సెమీ ఒక ప్రకటనలో తెలిపారు.

నాగాలాండ్ గవర్నర్ గణేషన్ కొన్ని రోజుల క్రితం ఆకస్మికంగా మరణించిన సంగతి తెలిసిందే. దీంతో మణిపూర్ గవర్నర్ అజయ్ కుమార్ భల్లాకు నాగాలాండ్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. సోమవారం భల్లా కోహిమాలో జరిగే కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు.



## త్వరలో కామన్ మ్యానిఫెస్టో

- బీహార్‌లో మంచి ఫలితాలు సాధిస్తాం
- మీడియా సమావేశంలో రాహుల్‌గాంధీ

**పాట్నా :** ఇండియా వేదిక పార్టీలు ఐక్యంగా పనిచేస్తున్నాయని, బీహార్‌లో మంచి ఫలితాలు సాధిస్తామని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ అన్నారు. త్వరలో కామన్ మ్యానిఫెస్టో విడుదల చేస్తామని తెలిపారు. ఆయన అరారియాలో ఆర్‌జెడి నేత తేజస్వియాదవ్‌తో కలిసి మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజెపికి సహాయం చేయడానికి, ఓట్లను చోరీ చేయడానికి ఎన్నికల కమిషన్ చేసిన ప్రయత్నమే బీహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) అని అన్నారు. ఓట్లు చోరీ చేసేందుకు అనుమతించబోమని అన్నారు. 'ఓటర్ అధికార్ యాత్ర'లో భాగంగా బీహార్‌లో పర్యటిస్తున్న ఆయన ఎనిమిదో రోజు పూర్ణియా జిల్లా అరారియాలో తేజస్వీ యాదవ్‌తో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. వీధుల్లో మోటారు సైకిల్ నడిపారు. వీరిని చూడటానికి జనం భారీ సంఖ్యలో బారులు తీరారు. ఈ నెల 17న రాహుల్ గాంధీ ప్రారంభించిన ఓటర్ అధికార్ యాత్ర, 1300 కిలోమీటర్ల మేర కొనసాగనుంది. ఈ యాత్ర 16 రోజుల పాటు 20 జిల్లాలకు పైగా కొనసాగి, సెప్టెంబర్ 1న పాట్నాలో నిర్వహించే భారీ సభతో ముగియనుంది.

## పింఛను తొలగింపుతో దంపతుల ఆత్మహత్య

(మొదటి పేజీ తరువాయి)

అందజేశారు. ఇప్పటికే ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న అప్పారావు, వచ్చే నెల నుంచి పింఛను ఆగిపోతుందని, ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న కుమార్తె దేవి ఫీజు కూడా కట్టలేనని దిగులు చెందారు. మరోవైపు కుటుంబసభ్యులతో స్థిరాస్తి తగాదాలు కూడా ఉండడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి కుమార్తె నిద్ర పోయాక భార్య లలితతో కలిసి ఫినాయిల్, ఎలుకల మందు, క్లీనింగ్ యాసిడ్ కలిపి తాగారు. ఆదివారం ఉదయాన కుమార్తె దేవి నిద్ర లేచేసరికి తల్లిదండ్రులు మృతి చెంది ఉన్నారు. వారి పక్కనే గ్లాసులో కొంత ద్రావణం ఉండడంతో, దాన్ని దేవి తాగి తల్లిదండ్రుల మృతదేహాల వద్ద రోదించింది. దీంతో, అక్కడకు చేరుకున్న స్థానికులు జరిగింది తెలుసుకుని అంబులెన్స్‌లో దేవిని శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆమె కోలుకుంటోంది. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఆస్పత్రిలో దేవిని పరామర్శించి, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అర్హుల పింఛన్ల తొలగింపు ఉండదని, అపోహలు నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**కుటుంబ వివాదాలే కారణం : అధికారులు**

అప్పారావు, ఆయన భార్య ఆత్మహత్యకు కుటుంబ ఆస్తి వివాదాలే కారణమని, పింఛను నిలిపివేయడం వల్ల కాదని కలెక్టర్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. గార తహశీల్దార్ విచారణలో ఇదే విషయం బయటపడిందని, మృతుల కుమార్తె పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలోనూ ఇదే విషయాన్ని పేర్కొన్నారని తెలిపారు.

## ప్రజారోగ్య బాధ్యత ప్రభుత్వానిదే

(మొదటి పేజీ తరువాయి)

వైద్యానికి ఖర్చు పెట్టే కుటుంబాలు దేశంలో 7 శాతం, 10 శాతం ఖర్చు పెట్టే కుటుంబాలు 17 శాతం ఉన్నాయని వివరించారు. ఈ వైద్య ఖర్చులు పెరగడం వల్ల ఆయా కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో శస్త్ర చికిత్సల కోసం 40 శాతం కుటుంబాలు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని, ఇది చాలా ప్రమాదకరమని అన్నారు. యూనివర్సల్ హెల్త్ కేర్ సర్వీస్ దేశంలో 60 శాతం ఉందని, ప్రాథమిక వైద్యం ప్రభుత్వ రంగంలో ఉండటం వల్లే ఇది సాధ్యమని తెలిపారు. వైద్యరంగం ప్రైవేటీకరణ ద్వారా సాధారణ ప్రజానీకానికి మెరుగైన వైద్యం అందినట్లుగా ప్రపంచంలో ఎక్కడా రుజువు కాలేదని చెప్పారు. ప్రాథమిక వైద్యం ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉంటేనే పేదలకు అయ్యే వైద్యం ఖర్చు తగ్గుతుందని తెలిపారు. కేన్సర్ వ్యాప్తి పెరుగుదల-నివారణ పద్ధతులు' అనే అంశంపై కేన్సర్ వైద్య నిపుణులు డి రఘునాథరావు మాట్లాడుతూ.. దేశంలో కేన్సర్ కేసులు విపరీతంగా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేన్సర్ బారిన పడటానికి ప్రధాన కారణం పొగాకు వినియోగమన్నారు. పొగాకును దూరం చేయడం, ఎత్తుకు తగిన బరువు ఉండడం, ఊబకాయాన్ని నివారించుకోవడం, శారీరక వ్యాయామం చేస్తే కేన్సర్ వచ్చే అవకాశాన్ని తగ్గించుకోవచ్చని చెప్పారు. మహిళల్లో వచ్చే రొమ్ము, గర్భాశయ కేన్సర్లపై వైద్యులు డి లీల ప్రసంగించారు. ముఖద్వార కేన్సర్‌ను గుర్తించాలంటే 40 ఏళ్లు దాటిన ప్రతి మహిళ మూడేళ్లకోసారి కేన్సర్ స్క్రీనింగ్ పరీక్ష చేయించుకోవాలని చెప్పారు. కార్యక్రమానికి ముందు ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యాన షుగర్ వ్యాధి అవగాహనపై 'తియ్యటి ముప్పు' అనే నాటికను ప్రదర్శించారు.

ప్రజారోగ్య వేదిక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవి రమణయ్య, టి కామేశ్వరరావు మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ఎంఎన్‌జె కేన్సర్ రీసెర్చ్ సెంటర్ ఉందన్నారు. రాష్ట్ర విభజన జరిగి 11 ఏళ్లు గడిచినా రాష్ట్రంలో ఇలాంటి ఆస్పత్రిని ఏర్పాటు చేయలేదన్నారు. రాష్ట్రంలో కేన్సర్ కేసుల పెరుగుదల వేగం ఎక్కువగా ఉండటం వల్ల ప్రభుత్వ రంగంలో కేన్సర్ వైద్యశాల ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, ఎంఎన్‌జె వంటి సంస్థలను రాష్ట్రంలో ఏర్పాటు కోసం ప్రజారోగ్య వేదిక ఉద్యమించబోతుందన్నారు. పి-4 పద్ధతిలో మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేయడం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయడమే కాకుండా ప్రజలకు వైద్యాన్ని దూరం చేయడమవుతోందన్నారు. ఈ సదస్సులో ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి విజయ్ ప్రకాష్, మాకినేని కిరణ్, సిద్ధార్థ అకాడమీ ఉపాధ్యక్షులు వెల్లంకి నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కోసం పడిగాపులు

(మొదటి పేజీ తరువాయి)

9,600 మెట్రిక్ టన్నుల యూరియాలో నాలుగు వేలు టన్నులు మాత్రమే వచ్చాయి. ఆగస్టుకు సంబంధించి ప్రభుత్వం 12 వేల మెట్రిక్ టన్నులను సరఫరా చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 2,500 మెట్రిక్ టన్నులే చేరాయి. అందులో ప్రైవేట్ డీలర్లకు 50 శాతం చేరాయి. బస్తా యూరియాను

ప్రభుత్వం రూ.275కు అందిస్తుండగా, ప్రైవేట్ వ్యాపారులు రూ.500కు విక్రయిస్తున్నారు. డిఎపిని ప్రభుత్వం రూ.1350కి విక్రయిస్తుండగా, ప్రైవేటు వ్యాపారులు రూ.1600 పైబడి అమ్ముతున్నారు.

- ఏలూరు జిల్లాకు 33,762 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని అంచనా వేశారు. ఇప్పటి వరకూ 24 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయినట్లు అధికారులు చెబుతున్నారు.
- పశ్చిమగోదావరి జిల్లాకు 21,270 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవ్వం కాగా, 18 వేల మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు చేరినట్లు అధికారులు తెలిపారు.
- వైఎస్ఆర్ కడప జిల్లాలో కెసి కెనాల్, తెలుగుగంగ, ఇతర సాగునీటి ప్రాజెక్టుల ఆధారిత ఆయకట్టు ప్రాంతాల్లో ప్రైవేట్ వ్యాపారులు యూరియా బస్తాపై వంద రూ.100 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు.

**కర్ణాటకకు తరలించి అధిక ధరకు విక్రయం**

అనంతపురం జిల్లాలో వర్షాభావంతో ఖరీఫ్ సీజన్‌లో ఆశించనంత సాగు జరగలేదు. 9.78 లక్షల ఎకరాల్లో సాగవ్వాల్సి ఉండగా, 5.07 లక్షల ఎకరాల్లో పంటలు వేశారు. 26,839 మెట్రిక్ టన్నులు యూరియా అవసరం ఉందని అధికారులు ముందుగా అంచనా వేశారు. 27,226 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు వచ్చినట్లు అధికారులు చెప్తున్నారు. అయినా, రైతులకు పూర్తి స్థాయిలో యూరియా సరఫరా అందడం లేదు. రాష్ట్రంలో యూరియా బస్తా ధర రూ.267 కాగా, పక్కనున్న కర్ణాటకలో రూ.567 ఉంది. కొందరు అధికార పార్టీ నేతలు, ప్రయివేట్ వ్యాపారులు ఎరువులను అక్రమంగా కర్ణాటకకు తరలించి అధిక ధరకు అమ్ముకున్నారని, అందుకే జిల్లాలో ఎరువుల కొరత ఉందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కలెక్టర్ వినోద్‌కుమార్ ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు జరిగిన యూరియా అమ్మకాలపై తనిఖీలకు ప్రత్యేకంగా మూడు బృందాలను నియమించారు. ఈ బృందాలు క్షేత్ర స్థాయిలో పరిశీలించి నివేదికివ్వాలని ఆదేశించారు. ఈ బృందాల విచారణ కొనసాగుతోంది.

- విజయనగరం జిల్లాకు 32,600 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ఆగస్టు ప్రారంభం నాటికి 24,360 మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చాయి. వీటిలో 50 శాతం అంటే దాదాపు 12,180 మెట్రిక్ టన్నుల వరకు ప్రైవేటు డీలర్లకు వెళ్లింది.
- కృష్ణా జిల్లాకు 38,333 టన్నుల యూరియా అవసరం కాగా, ఇప్పటివరకు 20,283 టన్నులు వచ్చినట్లు అధికారులు చెప్తున్నారు. గత రబీలో మిగిలిన ఎనిమిది వేల టన్నుల యూరియాతో మొత్తం 28,283 టన్నులు రైతులకు అందుబాటులో ఉందని తెలిపారు.
- గుంటూరు జిల్లాకు 24 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ఇప్పటి 11,380 మెట్రిక్ టన్నులు వచ్చాయి.
- పల్నాడు జిల్లాలో ఆశించిన స్థాయిలో సాగు జరగలేదు. దీంతో, ఇక్కడి నుంచి ఎరువులను తెలంగాణకు తరలించి అమ్ముకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం**

యూరియా కొరత వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఐదు రోజుల క్రితం తాళ్లరేవు సొసైటీకి వెళ్లి యూరియా కావాలని అడిగాను. ఇంకా రాలేదని, వచ్చిన వెంటనే తెలియజేస్తామని అక్కడి సిబ్బంది చెప్పారు. ప్రయివేటు దుకాణాల్లోనూ యూరియా అందుబాటులో లేదు.

**కడలి సింహాచలం, రైతు, పోలేకుర్రు, తాళ్లరేవు మండలం, కాకినాడ జిల్లా**



గాంధీ ఆస్పత్రికి సురవరం భౌతికకాయాన్ని అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు



నివాళులర్పిస్తున్న బివి రాఘవులు



నివాళులర్పిస్తున్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు

# స్ఫూర్తివంతం... సురవరం

(మొదటి పేజీ తరువాయి)

అనుసరించాయి. గాంధీ మెడికల్ కళాశాల వరకు అంతిమయాత్ర సాగింది. 'సురవరం అమర్ రహే... రెడ్ సెల్యూట్ సుధాకర్ రెడ్డి... వామపక్షాల ఐక్యత వర్ధిల్లాలి' అంటూ నినాదాలతో ఆ మార్గం మార్మోగింది. ఆర్‌టిసి క్రాస్‌రోడ్ సిపిఎం రాష్ట్ర కార్యాలయం వద్ద తెలంగాణ సిపిఎం నేతలు జాన్ వెస్లీ, భూపాల్ తదితరులు సురవరానికి పుష్పాంజలి ఘటించి అంతిమయాత్రను అనుసరించారు. సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో సిపిఎం, సిపిఐ నాయకుల సమక్షంలో సురవరం భౌతికకాయాన్ని గాంధీ మెడికల్ కళాశాలకు కుటుంబ సభ్యులు అందజేశారు. ప్రజలకు స్ఫూర్తివంతంగా నిలుస్తున్న కమ్యూనిస్టు పార్టీలకు, సురవరం కుటుంబ సభ్యులకు కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిర ధన్యవాదాలు తెలిపారు.

**సురవరం సేవలు గుర్తుండేలా త్వరలో నిర్ణయం : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్**

సురవరం సుధాకర్‌రెడ్డి సేవలు చరిత్రలో నిలిచిపోయేలా త్వరలో తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. మఖ్దూం భవన్‌లో సురవరం భౌతికకాయానికి పూలమాలతో ఆయన శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ ప్రజలకు ఆదర్శంగా నిలిచిన వారిని తమ ప్రభుత్వం మరిచిపోదన్నారు. పేదలు, బహుజనుల కోసం పోరాడిన గొప్ప నేత సుధాకర్‌రెడ్డి అని కొనియాడారు. విద్యార్థి దశ నుంచి జాతీయ స్థాయి నేతగా ఎదిగారని, పాలమూరు జిల్లా బిడ్డ జాతీయ స్థాయి నేతగా ఎదగడం గర్వకారణమని, అధికారం ఉన్నా లేకున్నా తన సిద్ధాంతాలను ఎప్పుడూ వీడలేదని, జీవితాంతం రాజీపడని నిరాడంబర జీవితాన్ని గడిపారని, ఆయన కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. సురవరం మరణం తెలంగాణకు తీరని లోటని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు రేవంత్‌రెడ్డి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

**దేశానికి తీరనిలోటు : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**

సురవరం సుధాకర్‌రెడ్డి మరణం దేశానికి తీరని లోటని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో సురవరం భౌతికకాయానికి ఆయన నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, సుధాకర్‌రెడ్డి దేశ రాజకీయాల్లో ప్రముఖ పాత్ర పోషించారన్నారు. ఢిల్లీలో వివిధ ప్రభుత్వాలు ఏర్పాటు చేసినప్పుడు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేసిన ఉద్యమంలో సురవరంతో కలిసి నడిచానని గుర్తు చేశారు. ఆయన మరణం సిపిఐకి ఎంత నష్టమో, సమాజానికీ అంతే నష్టమని పేర్కొన్నారు. ఆయన పేదల కోసం చేసిన సేవలు చరిత్రలో గుర్తుంటాయన్నారు. గతంలో సుధాకర్‌రెడ్డితో కలిసి ప్రజాసమస్యలపై పోరాటాలు చేశానని వివరించారు. 'నేనంటే ఆయనకు ప్రత్యేక అభిమానం ఉండేది. ఆయనను జీవితంలో ఎప్పుడూ మరచిపోలేను. వ్యక్తిగతంగా నేను చేసే పనులను ఆయన ప్రోత్సహించేవారు' అని సురవరంతో ఉన్న అనుబంధాలను చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. సురవరం సుధాకర్‌రెడ్డి గొప్ప మానవతావాదని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. ఆయన భౌతికకాయానికి నివాళులర్పించిన అనంతరం మాట్లాడుతూ చివరి వరకు పేదల కోసం పని చేసిన గొప్ప వ్యక్తని కొనియాడారు.

**కార్మిక, ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు : సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ**

సురవరం సుధాకర్‌రెడ్డి మృతి కార్మిక, ప్రజాఉద్యమాలకు తీరని లోటని సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ అన్నారు. మఖ్దూం భవన్‌లో సురవరానికి పుష్పాంజలి ఘటించిన అనంతరం ఆయన మాట్లాడారు. తెలంగాణను కార్మిక ఉద్యమాలకు బలమైన శక్తిగా తయారు చేయడంలో సురవరం ఎంతో కృషి చేశారన్నారు. నల్గొండ నుంచి రెండు పర్యాయాలు లోక్‌సభకు ఎన్నికైన సురవరం... శ్రామికవర్గ సమస్యలపై ప్రధానంగా మాట్లాడేవారని గుర్తు చేశారు. ఢిల్లీలో సిపిఎం కార్యాలయంలో జరిగిన వామపక్ష సమావేశాలకు సిపిఐ బృందానికి నాయకత్వం వహించారని తెలిపారు. ప్రజా సమస్యలపై లోతుగా అధ్యయనం చేసి పరిష్కార మార్గాలు చూపేవారన్నారు. నిరాడంబరత, విషయ పరిజ్ఞానంతో చివరివరకు కమ్యూనిస్టు విలువలకు కట్టుబడి ఉన్నారని కొనియాడారు. దేశంలో మతతత్వం విజృంభిస్తోన్న ప్రస్తుత సమయంలో వామపక్ష లౌకిక ప్రజాస్వామ్య శక్తుల ఐక్య ఉద్యమాలు ఎంతో అవసరమన్నారు. సురవరం కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. సురవరం సుధాకర్‌రెడ్డి గొప్ప ప్రజాసేవకుడని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. మననుంచి దూరమైనా ఆయన ఆశయాలను కొనసాగించాల్సిన అవసరముందని తెలిపారు. సురవరం సేవలు చిరస్మరణీయమని, ఆయన తనకు మంచి స్నేహితుడని తెలిపారు. విలువల కోసం, నమ్మిన సిద్ధాంతం కోసం చివరకంటూ నిలబడ్డాడని, ఏ విషయాన్నైనా చాలా స్పష్టంగా చెబుతారని గుర్తు చేశారు. సురవరం మరణం ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజా ఉద్యమాలకు తీరని లోటన్నారు.

**పోరాటాలకు పునరంకితమవ్వాలి : పి.మధు**

దేశం ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో వామపక్ష దిగ్గజం సురవరం సుధాకర్‌రెడ్డి మృతి అత్యంత బాధాకరమని సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ ఎంపి పి.మధు అన్నారు. రైతులు, కూలీలు, కార్మికులను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీవ్రమైన బాధలకు గురిచేస్తోందని, మతోన్మాదాన్ని రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుతోందని తెలిపారు. ఈ నేపథ్యంలో సురవరం ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేయాలన్నారు.



మఖ్దూం భవన్ నుంచి గాంధీ ఆస్పత్రి వరకు అంతిమయాత్ర

**జీవన సౌరభం**

గొప్ప పనులు
గొప్ప బలంతో కాదు,
పట్టుదలతో
సాధ్యమవుతాయి.

**మీ కోసం**

స్టీలు డబ్బాలు, కప్‌బోర్డులపై పడిన జిడ్డు మరకలు పోవాలంటే ఒక కర్చీఫ్‌లో కొంచెం బియ్యం అందులో టూత్ పౌడర్ వేసి మూటలా కట్టుకోవాలి. ఈ మూటతో వాటిపై రుద్దాలి. తరువాత మెత్తని వస్త్రంతో మరోసారి రుద్దితే మరకలు పోతాయి.





## విశ్వాసం



ఒక ఊర్లో ఒక కుక్క ఉంది. దానికి ఎవరూ ఆహారం పెట్టేవారు కాదు. అది బాగా మురికిగా ఉండేది. అది ఊరి చివరే తిరిగేది. ఆకలితో అలమటించేది. ఒక రోజు అది ఆకలికి ఉండలేక ఓ ఇంటికి వెళ్లింది. అప్పుడే ఆ ఇంటివాళ్లు భోజనం చేయడానికి సిద్ధమవుతున్నారు. కుక్కని చూసి ఆ ఇంట్లోని చిన్న పిల్ల దానికి అన్నం పెట్టింది. ఆ రోజు నుండి అది ఆ ఇంటిని వదల్లేదు. పాపతో కలిసి ఆడుకుంటూ, అన్నం తింటూ అక్కడే ఉండిపోయింది.

ఒకరోజు ఆ కుటుంబ సభ్యులు నెలరోజుల కూలీ డబ్బులు తెచ్చి ఓ పాత బీరువాలో దాచుకున్నారు. ఆ తర్వాత రోజు, ఎప్పటిలాగానే పనికి వెళ్లిపోయారు. కొంతసేపటికి ఒక దొంగ ఆ ఇంట్లోకి చొరబడ్డాడు. డబ్బులు కోసం వెతికాడు. అప్పుడే కుక్క అక్కడికి వచ్చింది. ఇంట్లో ఏదో అలికిడి అవుతోందని గ్రహించింది. గట్టిగా అరిచింది. భయంతో దొంగ పరుగుదీశాడు. పరుగెత్తుతూ పరుగెత్తూతూ కాలికి పెద్ద రాయి తగిలి స్పృహతప్పి పడిపోయాడు. కొంతసేపటికే ఆ కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చారు. దొంగని చూసి ఆశ్చర్యపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దొంగని పట్టుకుపోయారు.

**- చీమల ఐశ్వర్య, 7వ తరగతి, ఎంపియుపి స్కూలు, తెన్ను బొడ్డవర, విజయనగరం జిల్లా.**

### నేను గీసిన బొమ్మ



**సి.శ్రీ మాధవి**
**10వ తరగతి**
**సెయింట్ జోసెఫ్స్ విద్యాలయం, కర్నూలు.**



### నేను గీసిన బొమ్మ



**సయ్యద్ జాన్‌బీ**
**9వ తరగతి,**
**అరవింద హైస్కూలు, కుంచనపల్లి, గుంటూరు జిల్లా.**



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

# వీధి జంతువులతో జాగ్రత్త!

పెంపుడు జంతువుల పట్ల ప్రేమ ఉండటం సహజమే. కానీ వాటి ద్వారా వచ్చే కొన్ని దుష్పరిణామాలు కూడా తెలుసుకోవటం మంచిది. పశువులు, శునకాలు, గొర్రెలు, మేకలు, గుర్రాలు, కోళ్ళు, పక్షుల నుంచి మనుషులకు కొన్ని వ్యాధులు సంక్రమిస్తాయి. పెంపుడు జంతువులను ఎవరి ఇంట్లో వాళ్లు పెంచుకుంటే మిగతా వారికి ఇబ్బందులు ఉండవు. కానీ, కొందరు విచక్షణా రహితంగా వీధుల్లో వదిలేస్తుండటమే ప్రమాదకరంగా పరిణమిస్తోంది.

**వీధి కుక్కలతో ఇబ్బందులు**

ఇళ్లల్లో వదిలేసిన కుక్కలే వీధుల్లో తిరుగుతూ ఆ తర్వాత వాటి సంతతిని వృద్ధి చేసుకుంటున్నాయి. ఇవి వీధుల్లో తిరుగుతూ ప్రజాజీవనానికి తీవ్ర ఆటంకాన్ని కల్గిస్తున్నాయి. దేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ ఇదే సమస్య. పౌర జీవనానికి ఇబ్బంది కల్గిస్తోంది. మిగతా ప్రాంతాల సంగతి అటుంచితే మన రెండు రాష్ట్రాల్లోనూ వీధి కుక్కల బెడద ఎక్కువైపోతోంది. మనదేశంలో 11 సెకన్లకో కుక్కకాటు కేసు నమోదవుతోంది. పసికందులు, వృద్ధులపైనా వీధి కుక్కలు దాడి చేస్తున్నాయి. 2024లో ఒక్క ఏడాదిలోనే దేశంలో 37 లక్షలకు పైగా కేసులు నమోదయ్యాయి. హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, ఏలూరు, కాకినాడ, విశాఖపట్టణం, తిరుపతి ఇలా అన్ని ప్రాంతాల్లో ఊర కుక్కలు గుంపులు గుంపులుగానే సంచరిస్తున్నాయి. పసిపిల్లలను ఎత్తుకెళ్లటం దగ్గర నుంచి పెద్దల రక్త మాంసాలను లాగేసే వరకూ వీటి ఉధృతి పెరిగింది.



**విదేశాల్లో పద్ధతులు ఆచరణీయం**

మనదేశంతో పోలిస్తే చాలా దేశాల్లో వీధి కుక్కలు పెద్దగా కనిపించవు. ఉన్నా వాటికి ర్యాబిస్ వ్యాక్సిన్ వేస్తారు. జనన నియంత్రణ ఇంజక్షన్లు సైతం చేసేస్తారు. వాటికి సంబంధించిన వివరాలు కుక్క మెడలో పొందుపర్చి ట్యాగ్‌లుగా ఉంటాయి. కుక్కల సంతతి నియంత్రణ చర్యలు చేపట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మనదేశంలో అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నాయి. వీధి కుక్కలతో ర్యాబిస్ ప్రబలితే అది పౌరుల ప్రాణాలకు తీవ్ర ప్రమాదకరమవుతుంది. దీన్ని నివారించడానికి ప్రపంచవ్యాప్తంగా పలు పద్ధతులను పాటిస్తున్నారు. శునక జనన నివారణ శస్త్ర చికిత్సలు (ఎబిసి), ర్యాబిస్ టీకా కార్యక్రమాలు, సిఎన్‌విఆర్ పద్ధతిని కొన్నిచోట్ల అనుసరిస్తున్నారు.

కారుణ్య పద్ధతి విధానాన్ని ఒక్క రోజులోనే పూర్తి చేయొచ్చు. శ్రీలంక, థాయ్‌లాండ్, ఇండోనేషియా, మాల్దీవులు వంటి దేశాల్లో దీన్ని విజయవంతంగా అనుసరిస్తున్నారు. వీధి కుక్కల సమస్య నివారణకు ఇది చక్కటి ప్రత్యామ్నాయమని తమిళనాడు వెటర్నరీ, జంతుశాస్త్రాల విశ్వవిద్యాలయ అధ్యయనం పేర్కొన్న విషయం తెలిసిందే.

**హడావుడి తప్ప ఆచరణ శూన్యం**

దేశంలో ఏ ప్రాంతంలోనైనా రాత్రి 10 గంటల తర్వాత తమ ఇళ్లకు ప్రజానీకం వెళ్లాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పోవాల్సిందే. గుంపులు గుంపులుగా తిరుగుతూ రాకపోకలు సాగించే వారిని భయోత్పాతానికి గురిచేస్తున్నాయి. రోడ్లపైనే ఉంటూ అక్కడ మలమూత్ర వ్యర్థాలు వదులుతూ కంపు కొట్టేలా చేస్తున్నాయి. అవి తెల్లవార్లూ అరుస్తూ ఉంటే నివాసితులు కంటిపై కునుకు లేకుండా ఇబ్బందులు పడుతున్నారు.

**ప్రజలకు రక్షణ చర్యలు ముఖ్యం**

సమస్య తీవ్రతను గుర్తించి తెలంగాణా, ఆంధ్ర ప్రభుత్వాలు శునక జనన నివారణ శస్త్రచికిత్సలు, ర్యాబిస్ టీకా కార్యక్రమాల (ఎఆర్‌వి)కు ప్రత్యేకంగా బృందాలు ఏర్పాటు చేయటం ఎంతో మేలు. వీధి కుక్కల వీరంగాలపై ఫిర్యాదు చేయడానికి వీలుగా దేశంలోని అన్ని ప్రాంతాల్లో హెల్ప్‌లైన్ కేంద్రాల ఏర్పాటు చేయాలి. హైదరాబాద్‌లో వీధి కుక్కలకు నూరు శాతం యాంటీ ర్యాబిస్ టీకాలు వేయాలని కార్పొరేషన్ అధికారులు నిర్ణయించటం ఎంతో మంచి ఆలోచన. ఇలాంటి చర్యలు దేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ, అన్ని చోట్లా చిత్తశుద్ధితో అమలుచేస్తేనే వీధి కుక్కల భారి నుంచి ప్రజలకు రక్షణ లభిస్తుంది.



### ఆలనలేని ఆవులు, ఎద్దులతో ప్రమాదాలు


రోడ్లపై తిరిగే ఆవులు, ఎద్దులతో కూడా చాలా సమస్యలు ఎదురవుతున్నాయి. కొందరు యజమానులు వాటికి దాణా వేయకుండా వీధుల్లోకి వదిలేస్తుండటంతో అవి స్వైర విహారం చేస్తూ పిల్లలు, పెద్దలు, మహిళలను పొడిచి, గాయపరుస్తున్నాయి. ప్రధాన రోడ్లపై పడుకుంటూ ప్రజల రాకపోకలకు అంతరాయాన్ని కల్గిస్తున్నాయి. ఇటీవల ఆవు దాడిలో విజయవాడ కృష్ణలంకకు చెందిన విశ్రాంత ఆర్టీసీ కండక్టర్ నరసింహారావు మృతి చెందారు. పశువుల దాడిలో చాలామంది గాయపడిన ఉదంతాలు ఉన్నాయి. కొన్ని నగరాలు పట్టణాల్లో అధికారుల స్పందిస్తున్నా వాటి బందులదొడ్డిలో ఒకటీ, రెండ్రోజులు ఉంచి జరిమానా వేసి పంపించేస్తున్నారు. అయినా సమస్య పరిష్కారానికి నోచుకోవటం లేదు.



**- బొమ్మదేవర తులసీరావు, మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం, విజయవాడ.**

# కార్పొరేట్లకే సినిమా హబ్‌లు

కేంద్రప్రభుత్వం తాజా మార్గదర్శకాల పేరుతో తీసుకొచ్చిన సినిమా పాలసీ దేశంలోని వివిధ రాష్ట్రాల్లోని సినిమా పరిశ్రమలపై తీవ్ర ప్రభావాన్ని చూపించేదిగా ఉంది. ఈ ఏడాది మే 1 నుంచి 4 వరకూ ముంబైలో జరిగిన వేవ్స్ సమ్మిట్‌లో కేంద్రప్రభుత్వం తన విధానాన్ని వెల్లడించింది. కేరళ, రాజస్థాన్, హర్యానా, జమ్మూకశ్మీర్ లాంటి రాష్ట్రాలు సినీ పరిశ్రమలను సబ్సిడీలు, ప్రోత్సాహకాలతో ఆకర్షిస్తున్నాయి. 100 ఏళ్ల సినీ చరిత్రలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయ సహకారాలతోనే సినిమా పరిశ్రమ అభివృద్ధికి బాటలు పడ్డాయి. ప్రభుత్వం తన బాధ్యతల నుంచి వైదొలిగి ప్రయివేటు, కార్పొరేట్ సంస్థలకు సినిమా హబ్‌లను కేటాయించే యోచన చేస్తోంది. మద్రాస్ నుంచి హైదరాబాద్‌కు సినీ పరిశ్రమ తరలినప్పుడు అప్పట్లోని పాలకులు స్టూడియోల ఏర్పాటుకు రాయితీకి భూముల కేటాయింపు చేశారు. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేశారు. ఇప్పుడు హైదరాబాద్‌లో కూడా తెలంగాణా ప్రభుత్వం సినీ హబ్ చేస్తామంటూ చేస్తున్న ప్రకటనలు కూడా ఇదే కోవకు చెందుతాయి. వినోద పరిశ్రమను అభివృద్ధి చేస్తామనే పేరుతో ప్రయివేటు సంస్థలను ప్రోత్సహించటం ఇందులో భాగమే. హైదరాబాద్ కేంద్రంగా తెలుగు సినిమా పరిశ్రమ విరాజిల్లుతున్న విషయం తెలిసిందే. తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలుగు సినీ పరిశ్రమను 'ప్రపంచ సినిమావేదిక'గా చేస్తామని ఇటీవల పలు వేదికలపైన ప్రస్తావించిన విషయం విదితమే. సినిమా పాలసీకి అనుగుణంగా దీనిని తీర్చిదిద్దామంటూ ముక్తాయిస్తున్నారు. అసలు సినిమా పాలసీ ఏమిటి? ఏవేమి చేస్తారు? నిబంధనలు ఎలా ఉంటాయి? ప్రభుత్వ పాత్ర ఎంతవరకూ ఉంటుంది? ఇత్యాది విషయాలపై స్పష్టత లేదు.



**కార్పొరేట్‌లకే ప్రాధాన్యం**

సామాన్య ప్రజలకు ఎంతో మేలుచేసే విద్య, వైద్య రంగాలను ఇప్పటికే పాలకులు ప్రయివేటుపరం చేస్తున్నారు. తాజాగా మౌలిక సదుపాయాల రంగంలో రాష్ట్ర ప్రభుత్వాలు వైదొలిగి ప్రయివేటు, కార్పొరేట్ సంస్థలకు అప్పగించే ప్రణాళికలు సినీ పాలసీలో ఉన్నాయి. ఇప్పటికే దేశంలోని పలు రాష్ట్రాల్లో సినీ రంగ పరిశ్రమల అభివృద్ధికి నిధుల కేటాయింపుతోపాటుగా ఫిలిం నగర్లు, సిటీలు, కాలనీలు, అకాడమీల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నాయి. కేంద్రం తీసుకొస్తున్న, దానికి వంత పాడుతున్న రాష్ట్రప్రభుత్వాలు కూడా ఇవే విధానాల అమలుకు పూనుకుంటున్నాయి. సినీ పాలసీ అమలు చేస్తే సినీరంగంలో ప్రభుత్వ జోక్యం చాలా తక్కువగా ఉంటుంది. ఇప్పుడున్న చట్టాలకు సవరణలు, మార్పులు వంటివి చోటుచేసుకుంటాయి. సినీ పరిశ్రమలో పనిచేసే ప్రొడక్షన్, డైరెక్షన్, ప్రొడ్యూసర్స్‌తో పాటుగా వర్కర్స్ విభాగాల్లో కూడా కార్పొరేట్ సంస్థలు పెత్తనం చేస్తాయి. చిన్న నిర్మాతలు, దర్శకులు చిత్ర పరిశ్రమకు దూరమయ్యే ప్రమాదం ఉంటుంది. కార్మికుల సంక్షేమం గురించి మాట్లాడే కార్మికశాఖ జోక్యం లేకుండా పోవొచ్చు.

**గుత్తాధిపత్యం పోకడలు**

రూ.2000 కోట్ల బడ్జెట్‌తో సినిమాలు తీసే నిర్మాతలు మన దేశంలోనూ, తెలుగు రాష్ట్రాల్లోనూ ఉన్నారు. రూ.కోటి నుంచి ఆపైన తీసే ఓ మాదిరి చిన్న నిర్మాతలు ఉన్నారు. కొత్తగా సినిమా పాలసీ అమలుచేస్తే వందల కోట్లతో సినిమాలు తీసే వారికే థియేటర్ల కేటాయింపు, సినిమాల విడుదలలకు అవకాశాలు ఉంటాయి. ఇప్పటికే ఈ పరిస్థితి ఉంది. రూ.50 కోట్లు లోపు సినిమాలు తీసే వారి ప్రాధాన్యత ఇంకా తగ్గిపోవొచ్చు. నిర్మాతలు, దర్శకత్వం, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లుగా ఉన్న వారే ఆయా సంఘాల్లో నాయకత్వ స్థానాల్లో ఉంటారు. చలన చిత్ర అభివృద్ధి మండళ్ల (ఎఫ్‌డిసి) కూడా వారికి మద్దతు ఇస్తుంటుంది. చిన్న సినిమాలను బయటకు రాకుండా తొక్కేసే అవకాశాలు ఉంటాయి. అవసరమైతే సెన్సార్‌బోర్డును సైతం ప్రయోగిస్తుంటారు. వారికి రాష్ట్రప్రభుత్వాల అండ ఎలాగూ ఉంటుంది.

**కార్మిక నేతలపై కేసులు ఇందులో భాగమేనా?**

తెలుగు సినిమా పరిశ్రమలో పనిచేస్తున్న 30 వేల మంది కార్మికులు 19 రోజులపాటు హైదరాబాద్‌లో ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. ఫెడరేషన్ 30 శాతం అగ్రిమెంట్ కోరగా నిర్మాతలు 22.5 శాతం ఇవ్వటానికి అంగీకరించారు. అగ్రిమెంట్ ఏమి జరిగింది? కార్మికుల్లో ఎవ్వరికి ఎంత మొత్తం పెరిగింది? వంటి విషయాలపై ఇండస్ట్రీలో జోరుగా చర్చ జరుగుతోంది. కార్మికుల పక్షాన నిలుస్తామని తెలంగాణా ప్రభుత్వ పెద్దలు ప్రకటించినా, ఇంకోవైపు పోలీసు ప్రయోగం ద్వారా బంద్ విచ్ఛిన్నానికి తుదికంటూ కృషి చేసింది. ఫెడరేషన్ అధ్యక్షులు అనిల్‌కుమార్ వల్లభనేని ఇంటి వద్ద పోలీసులు పహారా పెట్టి లేబర్ కార్యాలయంలో చర్చలకు కార్మికులను పిలవటం కూడా ఒక ఎత్తుగడ ప్రకారం జరిగింది.

రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి దాన కిశోర్ ఆదేశాలతో కార్మికశాఖ అదనపు కమిషనర్ గంగాధర్, నిర్మాతలు– కార్మిక నేతల మధ్య చర్చలు జరిపించారు. షరతులు అమలుతో పాటుగా ఆందోళన విరమించుకోవాలని హుకుం జారీ చేశారు. మొత్తం మీద సర్దుబాటుతో ఒప్పందం కుదిరి, ఆందోళన విరమణ జరిగింది. ఇప్పటికే కార్మిక నేతలపై నిర్మాత టిజి విశ్వప్రసాద్ పెట్టిన కేసులు కొనసాగుతున్నాయి. అగ్రిమెంట్‌లో ఉన్న కొర్రీలు, వర్రీలు ఉన్నాయి. రాబోయే రోజుల్లో కమిటీ అన్ని విషయాలను పరిష్కరిస్తుందంటూ ఎఫ్‌డిసి చైర్మన్ దిల్ రాజు ప్రకటించినా – అది ఆచరణలో చూడాల్సి ఉంది.




# క్రికెట్‌కు పుజారా గుడ్‌బై



- అన్ని ఫార్మాట్లకు రిటైర్మెంట్
- 103 టెస్ట్‌ల్లో 7,195 పరుగులు సాధించిన 'నయావాల్'

**స్పోర్ట్స్ డెస్క్ :** టీమిండియా టెస్ట్ క్రికెట్‌లో 'నయావాల్'గా నిలిచిన ఛెతేశ్వర్ పుజారా క్రికెట్‌లోని అన్నిఫార్మాట్లకు రిటైర్మెంట్ ప్రకటించాడు. ముగ్గురు ఆటగాళ్లు ఒక్కో తరానికి 'వాల్'గా నిలబడిపోయారు. మొదటిగా సునీల్ గావస్కర్ పేరు ప్రస్తావించాల్సిందే. ఆ తర్వాత ది వాల్ అంటూ రాహుల్ ద్రవిడ్ వచ్చాడు. అతడు ఆటకు వీడ్కోలు పలికేటప్పుడు.. మరి ఈ పాత్రను పోషించే ప్లేయర్ ఎవరా? అని అనుకుంటున్న సందర్భంలో ముందుకొచ్చాడు ఛెతేశ్వర్ పుజారా... నయావాల్‌గా మారిపోయి వందకు పైగా టెస్ట్ మ్యాచ్‌లు ఆడాడు. ఇప్పుడు అతడు కూడా క్రికెట్‌లోని అన్ని ఫార్మాట్లకు రిటర్మైంట్ ప్రకటించాడు. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఆయన సోషల్ మీడియాలో పోస్ట్‌ను షేర్ చేశారు. పూజారా 2023 నుంచి జట్టుకు దూరంగా ఉన్న విషయం తెలిసిందే. ఫామ్‌లోకి వచ్చేందుకు అయితే కొన్ని నెలలుగా అతను చేస్తున్న ప్రయత్నాలు ఫలించలేదు. ఈ నేపథ్యంలో పుజారా క్రికెట్‌కు పూర్తిగా వీడ్కోలు పలకాలని నిర్ణయించుకున్నాడు. 2008లో టీమిండియాలోకి అడుగుపెట్టిన పుజారా చివరిసారిగా 2023 జూన్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్‌లో ఆడాడు. క్లాసికల్ టెక్నిక్, డిఫెన్స్‌కు పేరుగాంచిన పుజారా.. 15 ఏళ్లకు పైగా టెస్ట్ బ్యాటింగ్ లైనప్‌లో కీలకపాత్ర పోషించాడు. అతడి కెరీర్‌లో ఇప్పటిదాకా 103 టెస్ట్ మ్యాచ్‌లు ఆడగా.. 43.60 సగటుతో మొత్తం 7,195 పరుగులు చేశాడు. ఇందులో 19 సెంచరీలు, 35 అర్ధ సెంచరీలున్నాయి. రాహుల్ ద్రవిడ్ తర్వాత భారత మిడిలార్డర్‌కు వెన్నెముకగా నిలిచిన పుజారా.. అనేక చారిత్రాత్మక భారత విజయాల్లో తనదైన ప్రతిభను కనబరిచాడు. 2017లో రాంచీ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో పుజారా డబుల్ సెంచరీ సాధించాడు. ఈ మ్యాచ్‌లో భారత్ మొత్తం 210 ఓవర్లు ఆడితే అందులో 87.5 ఓవర్లు పుజారానే ఆడి 202 పరుగులు చేయడం విశేషం. ఇప్పటికే ఇదే భారత రికార్డు. 'రాజ్‌కోట్ అనే చిన్న పట్టణం నుంచి పిల్లవాడిగా, నా తల్లిదండ్రులతో కలిసి, నేను స్టార్లను లక్ష్యంగా చేసుకోవడానికి బయలుదేరాను. భారత క్రికెట్ జట్టులో భాగం కావాలని కలలు కన్నాను. ఈ ఆట నాకు చాలా ఇచ్చింది. అమూల్యమైన అవకాశాలు, అనుభవాలు, ప్రేమ, అన్నింటికంటే ముఖ్యంగా నా రాష్ట్రాన్ని ఈ గొప్ప దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం ఇచ్చింది. భారత జెర్సీ ధరించడం, భారత గీతం పాడటం నేను మైదానంలోకి అడుగుపెట్టిన ప్రతిసారీ నా వంతు ప్రయత్నం చేయడం – దాని నిజమైన అర్థాన్ని మాటల్లో చెప్పడం అసాధ్యం. కానీ ప్రస్తుతం నేను అపారమైన కృతజ్ఞతతో అన్ని రకాల భారత క్రికెట్ నుంచి రిటైర్ కావాలని నిర్ణయించుకున్నాను".. అని పూజారా పేర్కొన్నాడు.

### సౌరవ్ గంగూలీ కొత్త ఇన్నింగ్స్

- ప్రిటోరియా క్యాపిటల్స్ హెడ్ కోచ్‌గా సిద్ధం

**స్పోర్ట్స్ డెస్క్ :** భారత క్రికెట్‌లో అగ్రెసివ్ లీడర్‌గా, స్ట్రాటజిస్ట్‌గా పేరు తెచ్చుకున్న దాదా సౌరవ్ గంగూలి ఇప్పుడు కోచ్‌గా మారబోతున్నాడు. ఆదివారం ఎస్ఎ20 లీగ్‌లోని ప్రిటోరియా క్యాపిటల్స్ జట్టు గంగూలీని తమ హెడ్ కోచ్‌గా ప్రకటించింది. 2026 సీజన్‌కి సిద్ధమవుతున్న ఈ జట్టు, గంగూలీ రాకతో పుంజుకోనుంది. గతంలో ఇంగ్లండ్ బ్యాటర్ జోనాథన్ ట్రాట్ ఈ జట్టుకి కోచ్‌గా ఉన్నాడు. ఈనెల 23న ట్రాట్ ఈ పదవి నుంచి తప్పుకోవడంతో, గంగూలీకి అవకాశం వచ్చింది.గంగూలీతో పాటు దక్షిణాఫ్రికా లెజెండ్ షాన్ పొలాక్‌ను కూడా అసిస్టెంట్ కోచ్‌గా నియమించారు.



### కుటుంబ కథా చిత్రమే సుందరకాండ

- నారా రోహిత్

**ప్రజాశక్తి – తిరుపతి సిటీ**

దర్శకుడు వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వంలో రూపొందించిన 'సుందరకాండ' సినిమా కుటుంబ కథా చిత్రం అని సినీ నటుడు నారా రోహిత్ తెలిపారు. సినిమా ప్రమోషన్‌లో భాగంగా ఆదివారం తిరుపతికి విచ్చేసిన ఆయన ఓ ప్రైవేట్ హోటల్లో సినీ నిర్మాత సంతోష్ చిన్నపోల్ల, హీరోయిన్ వీర్తి వాఘానితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 27 వినాయక చవితి రోజున ఈ సినిమా విడుదల కానున్నట్లు తెలిపారు. ఈ చిత్రాన్ని కుటుంబ సమేతంగా వీక్షించాలని కోరారు. రొమాంటిక్ కథ చిత్రంతో లవర్ బాయ్‌గా నటించానని తెలిపారు. సినిమాలోని పాటలు తెలుగు ప్రేక్షకులను ఇప్పటికే అలరించాయని, ఈ సినిమాతో రీ ఎంట్రీ ఇచ్చిన హీరోయిన్ శ్రీదేవి నటన అందరికీ నచ్చుతుందని ధీమా వ్యక్తం చేశారు.



### 'అమరావతి ఛాంపియన్‌షిప్' పోటీలు

- ప్రారంభించిన మంత్రి రాంప్రసాద్

**ప్రజాశకి – తిరుపతి బ్యూరో**

తిరుపతి తారకరామ స్టేడియంలో మూడు రోజుల పాటు జరగనున్న అమరావతి ఛాంపియన్‌షిప్ క్రీడలను రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగంలో ఎన్నో మార్పులు తీసుకొస్తోందని, అంతర్జాతీయ స్థాయిలోనూ రాష్ట్రం నుంచి క్రీడాకారులు రాణిస్తారని అన్నారు. తిరుపతిలో క్రీడా రంగాన్ని ప్రోత్సహించేందుకు 30 ఎకరాలు కేటాయించామన్నారు. రాబోయే రోజుల్లో తిరుపతి క్రీడా హబ్‌గా అభివృద్ధి చెందుతుందన్నారు. అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో అకాడమీ, స్టేడియం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో నూతన క్రీడా పాలసీని తీసుకొచ్చేందుకు తమ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. క్రీడా పోటీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన సినీ నటుడు నారారోహిత్ మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి నారా కుటుంబం కృషి చేస్తుందన్నారు. దేశఖ్యాతిని పెంపొందించడంలో క్రీడాకారుల పాత్ర కీలకమన్నారు. జాతీయ స్పోర్ట్స్ డే పురస్కరించుకుని ప్రారంభించిన ఈ పోటీల్లో 1,700 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్వర్, శాప్ చైర్మన్ రవినాయుడు, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

**'ఆడుదాం ఆంధ్రా'పై విచారణ పూర్తి : మంత్రి**

గత ప్రభుత్వం నిర్వహించిన 'ఆడుదాం..ఆంధ్రా'పై విచారణ పూర్తయ్యిందని, త్వరలోనే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఇటీవల పార్టీలో మంత్రులు, ఎంఎల్‌ఎలపై వచ్చిన ఆరోపణలపైనా ఆయన స్పందించారు. దేశంలోనే క్రమశిక్షణ కలిగిన పార్టీ టిడిపి అని, పార్టీలో ఎవరు తప్పుచేసినా ఉపేక్షించేది లేదని అన్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68